



7

ఒంగోలులో 'కె-ర్యాంప్' సందడి

ఒంగోలులో కె-ర్యాంప్ సినిమా బృందం సందడి చేసింది. కథానాయకుడు కిరణ్ అబ్బవరంతో పాటు నటీనటులు గురువారం చిత్రం ప్రదర్శితమవుతున్న గోరంట్ల మల్టీప్లెక్స్‌లో తళుక్కుమన్నారు. వారిని చూసిన అభిమానులు ఆనందంతో కేరింతలు కొట్టారు.

రయ్‌మని..

ఒంగోలు మీదగా బుల్లెట్ రైలు

- హైదరాబాద్ నుంచి చెన్నై వరకు..
- గంటకు 320 కి.మీ వేగంతో దూసుకెళ్లే రైలు రాకపోకలకు ప్రణాళిక
- ఎలివేటెడ్ రైల్ కారిడార్‌కు డీపీఆర్ సిద్ధం

ఒంగోలు కార్పొరేషన్ అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న బుల్లెట్ రైలు ఎట్టకేలకు రాష్ట్రంలోనికి అడుగుపెట్టనుంది. ఈ మేరకు ప్రాజెక్టును చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ప్రతిపాదనలు, వివరాలను నిర్మాణ సంస్థ అయిన రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ (రైట్స్) బుధవారం ప్రకటించింది. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మధ్య రెండు బుల్లెట్ ట్రైన్‌లు పట్టాలెక్కనుండగా, అందులో ఒకటి ఒంగోలు మీదుగా వెళ్లనుంది. ఇది గంటకు 320 కి.మీ. స్పీడుతో దూసుకెళుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా బెంగళూరు, చెన్నై వరకు వెళ్లేలా ప్రాజెక్టు రూపొందించారు. హైదరాబాద్-బెంగళూరు రైలు మొత్తం 626 కి.మీ ప్రయాణించ నుండగా, తెలంగాణలో 230 కి.మీ, ఆంధ్రప్రదేశ్‌లో 300 కి.మీ, కర్ణాటకలో 96 కి.మీ నడవనుంది. హైదరాబాద్- చెన్నై వెళ్లే రైలు మొత్తం 705 కి.మీ ప్రయాణించనుండగా, తెలంగాణలో 180 కి.మీ, ఆంధ్రప్రదేశ్‌లో 464, తమిళనాడులో 61 కి.మీ ప్రయాణించేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. కాగా 2026 నాటికి డీపీఆర్ అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి, చెన్నై చేరనున్నట్లుగా రూట్ సిద్ధం చేశారు. ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వే అధికారుల ఈ ప్రాజెక్టు కోసం ఫైనల్ లొకేషన్ సర్వే ప్రారంభించారు.

రైలు మార్గం ఇలా..

హైదరబాద్-చెన్నై లైన్‌ను హైదరాబాద్‌లోని శంషాబాద్, భరత్ సిటీ, ఏపీలోని దాచేపల్లి, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి ఎయిర్‌పోర్టు మీదుగా చెన్నై ఔటర్ రింగ్‌రోడ్, చెన్నై స్టేషన్ మీదుగా 760 కి.మీల లైన్‌ను నిర్మించనున్నారు. ఈ లైన్ ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల మీదుగా చెన్నైకి వెళుతుంది. తద్వారా ఇటు హైదరాబాద్, అమరావతి రాజధానులు అనుసంధానం అవుతాయి. శంషాబాద్, తిరుపతి, చెన్నై ఎయిర్‌పోర్టులకు సులభతరంగా చేరుకునేందుకు కనెక్టివిటీ లభిస్తుంది.

తప్పిన ముప్పు

తూర్పున తెరిపి ఇచ్చి.. పశ్చిమాన దంచిన వాన



గిద్దలూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న సగిలేరు వాగు

- జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- పొంగిన వాగులు, వంకలతో అవస్థలు
- పశ్చిమాన పంటలకు తీవ్ర నష్టం
- అధికారులతో మంత్రి స్వామి సమీక్ష
- మరింత అప్రమత్తంగా యంత్రాంగం
- నష్టాలపై దృష్టి, 76 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా
- 18 ప్రాంతాల్లో పొంగిన వాగులు, వంకలు

జిల్లాకు వాయుగుండం ముప్పు తప్పింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా పట్టిన ముసురు వర్షాల నుంచి ఉపశమనం లభించింది. జోరుగా కురుస్తున్న వానలతో జిల్లావ్యాప్తంగా ఎటుచూసినా వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. అనేకచోట్ల ప్రత్యేకించి పట్టణ ప్రాంతాలు జలమయమయ్యాయి. పశ్చిమ ప్రాంతంలో విస్తారంగా కురిసిన వర్షాలతో పంటలు నీటి మునిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో మరింత వర్షం కురిస్తే తీవ్ర నష్టం జరుగుతుందని అన్నివర్గాల ప్రజానీకం ఆందోళన చెందుతున్న సమయంలో బంగాళాఖాతంలోని అల్పపీడనం బలహీనపడటం ఊరట కలిగించింది.



వర్షాలకు జలకళ సంతరించుకున్న కంభం చెరువు

ఒంగోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పెనుముప్పు తప్పింది. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడింది. అయినా కూడా గురువారం జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. సోమవారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షాలు గురువారం కూడా కొనసాగడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా కనిపిస్తోంది. ప్రత్యేకించి గత రాత్రి పలుచోట్ల భారీవర్షం కురిసింది. ఈనెల 21న ఉదయం 8.30 గంటలకు ముందు గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున 26.9 మి.మీ, వర్షపాతం నమోదు కాగా బుధవారం పగలు, రాత్రి మరింత విస్తారంగా వర్షాలు


మిగతా 6లో...

మరోవైపు పశ్చిమ ప్రాంతంలో ఖరీఫ్‌లో సాగు చేసిన అనేక పంటలు నీటి మునిగి పోయాయి. వైపాలెం, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లోని చాలాచోట్ల మిర్చి, పత్తి, సజ్జ, పొగాకు. కంది, మినుము వంటి పైర్లలోకి నీరు చేరాయి. కోత దశలో ఉన్న సజ్జకు అధిక నష్టంగా కనిపిస్తోంది. కొన్నిచోట్ల సజ్జ కంకులు మొలకలు వస్తుండగా పత్తి కాయలు కుళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. మిర్చి ఇతర కొన్ని పంటలు ఉరకెత్తిపోయే ప్రమాదం నెలకొంది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాలపై దృష్టి సారించారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఐదు మండలాల్లోని 76 గ్రామాల్లో 2,929 మంది రైతులకు చెందిన 2,303.46 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ఆ శాఖ అధికారులు గుర్తించారు. అయితే అల్పపీడనం కొనసాగి వర్షాలు ఇంకా కురిస్తే పంటలకు భారీనష్టమే వాటిల్లే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటలకు తీవ్ర నష్టం



వెలిగండ్ల మండలం మోటుపల్లిలో వానకు తడిసి మొలకొచ్చిన సజ్జ కంకులు



పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లిలో వర్షానికి దెబ్బతిన్న పత్తి

పీహెచ్‌సీల ఉద్యోగుల్లో ఆందోళన

- జీతాల బిల్లులు పెట్టేందుకు డీడీవోలు లేక ఇబ్బందులు
- వైద్యాధికారులు సమ్మెలో ఉండటమే కారణం
- జిల్లావ్యాప్తంగా 1,800 మందికిపైగా సిబ్బంది
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామంటున్న వైద్యశాఖ



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళన బాటలోనే పయనిస్తున్నారు. జీతాల బిల్లులు పెట్టేందుకు డ్రాయింగ్ ఆఫీసర్లు(డీడీవో) లేకపోవడంతో ఉద్యమ బాట పట్టారు. పీహెచ్‌సీలకు మెడికల్ ఆఫీసర్లు డీడీవోలుగా ఉంటున్నారు. ప్రతినెల 25వ తేదీలోపు ఆయా పీహెచ్‌సీల నుంచి బిల్లులను ట్రెజరీకి పంపాల్సి ఉంది. గత నెల 30వతేదీ నుంచి

మిగతా 6లో...

1800 మంది ఉద్యోగులు

ఒక్కొక్క పీహెచ్‌సీలో 20నుంచి 30 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. అలా జిల్లా వ్యాప్తంగా 1800 మందికిపైగా పనిచేస్తున్నారు. ఒక్కొక్క పీహెచ్‌సీలో ముగ్గురు స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, హెల్త్ ఎడ్యుకేటర్, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఫ్‌ఎల్‌వోలు, ఎంఎల్‌వోల, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు ఇలా ఒక్కొక్క పీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. ఇప్పటికే ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు తమ జీతాల బిల్లులు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నారు. అయినా ఇంతవరకు ట్రెజరీకి బిల్లులు పెట్టేందుకు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డీడీవోలను నియమించకపోవడంతో తమ జీతాలు రాకపోతే తాము ఇబ్బందులు పడుతామని ఉద్యోగులు చెప్తున్నారు. వైద్యశాఖ ఉన్నతాధికారులు మాత్రం ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బిల్లులు పెట్టేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.



ఆకట్టుకున్న విద్యార్థిని నృత్యం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా!

ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీలో 2025 బ్యాచ్ స్వాగత వేడుక ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జూనియర్లు, సీనియర్లు కేరింతలతో సందడి చేశారు.

7

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కృషి

- ఎండీ ద్వారకా తిరుమలరావు
- డిపో అభివృద్ధికి రూ.2కోట్లు మంజూరు
- కొత్తగా 1050 ఎలక్ట్రిక్ బస్సులు
- 'స్త్రీ శక్తి' ప్రయాణికుల ఆక్యుపెన్సీ 97 శాతం



ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గిద్దలూరులో గురువారం ఆయన ఆర్టీసీ డిపోను పరిశీలించారు. అనంతరం ఆవరణలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి మొక్కలను నాటారు. డిపోలోని గ్యారేజీని పరిశీలించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపోలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభలో తిరుమలరావు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీశక్తి పథకం సజావుగా సాగుతున్నదని, స్త్రీ శక్తి పథకం విజయంలో కార్మికులదే ప్రధాన పాత్ర అని స్పష్టం చేశారు. ఆ పథకంలో అమలు చేస్తున్న సర్వీసుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో 97శాతం ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 1050 ఎలక్ట్రికల్ బస్సులను కొనుగోలు చేస్తున్నామని, ఆ బస్సులను అనువైన ప్రాంతాలలో వినియోగిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8వేల మంది కార్మికులకు ఉద్యోగోన్నతులు లభిస్తున్నాయని, వారిలో ఈ జోన్‌కు సంబంధించి 1064 మందికి లభిస్తాయన్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్య భద్రత, వసతుల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తిరుమలరావు

మిగతా 6లో...

ఫీడర్ కాలువ పనులకు టెండర్లు

- రెండు కంపెనీలు దాఖలు
- సాంకేతిక బిడ్ పరిశీలించిన అధికారులు
- నెలాఖరుకు ఖరారు

ఒంగోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనుల కోసం రెండు కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. ఆ పనుల కోసం ప్రాజెక్టు అధికారులు పిలిచిన టెండర్లకు సంబంధించి సాంకేతిక బిడ్‌ను అధికారులు గురువారం పరిశీలించగా రెండు కంపెనీల వారు దాఖలు చేసిన విషయాన్ని గుర్తించారు. వచ్చే ఏడాది ఆగస్టుకు వెలిగొండ తొలి దశ పూర్తి కోసం పట్టుదలతో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో తదనుగుణ చర్యలు జరుగుతున్న విషయం విదితమే. ఇందుకు సంబంధించి అత్యంతకీలకమైన ఫీడర్ కాలువ ఆధునీకరణ కోసం రూ.476 కోట్లు మంజూరు చేస్తూ గత నెల 22న ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. అందులో రూ.375 కోట్లతో ఫీడర్ కాలువ మొత్తం 21.80 కి.మీ లైనింగ్, మూడు చోట్ల 5.20 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఈనెల తొలివారంలో అధికారులు టెండర్లు పిలిచారు. టెండరు దాఖలు సమయం బుధవారం ముగియగా నిబంధనల ప్రకారం గురువారం టెండర్లకు సంబంధించి సాంకేతిక బిడ్‌లను పరిశీలించారు. దీంతో ఎన్ని కంపెనీలు టెండర్లు దాఖలు చే శాయన్న విషయం స్పష్టమైంది. ప్రస్తుతం వెలిగొండ రెండవ టన్నెల్ పనులు చేస్తున్న మెఘ ఇంజనీరింగ్ కంపెనీ, రాజమండ్రికి చెందిన జీడీఆర్ ఇన్‌ఫ్రా కంపెనీల టెండర్లు దాఖలు చేశాయి. ఆ కంపెనీలు సమర్పించిన పత్రాలకు సంబంధించిన సాంకేతిక అంశాలను ప్రాజెక్టు అధికారులు పరిశీలించి ఆ వివరాలను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ (ఎస్ఎల్‌టీసీ)కి

మిగతా 6లో...

చోరీలకు పాల్పడుతున్న మహిళా దొంగ అరెస్టు

- రూ.20 లక్షలు విలువైన సొత్తు స్వాధీనం
- నిందితురాలు పేరాలకు చెందిన మహిళ
- వివరాలు వెల్లడించిన ఒంగోలు వన్‌టౌన్ సీఐ

6

కారు, స్కూటీ ఢీ.. ఇద్దరు దుర్మరణం

వారిలో ఒకరు ప్రకాశం జిల్లా వాసి

తెలంగాణ రాష్ట్రంలో ప్రమాదం



అజేరియా మృతదేహం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మొదటి బైపాస్ రహదారిలో గురువారం కారు, స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో పిట్టల సాన్వితా(9), అజేరియా(37) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జిల్లాలోని చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పిట్టల అంజయ్య, నీరజ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఇటీవల పెద్ద కూతురు సాన్వితకు జ్వరం రావడంతో కోనరావుపేట మండలం నిమ్మపల్లిలోని పుట్టింటికి నీరజ తన ఇద్దరు కూతుళ్లను తీసుకొని వెళ్లింది. తిరిగి గురువారం ఇద్దరు కూతుళ్లతో కలిసి నీరజ తిమ్మాపూర్ వెళ్లేందుకు బయలుదేరింది. ఈక్రమంలో సిరిసిల్లలో తనకు తెలిసిన మేస్త్రీ అజేరియా కనిపించడంతో అతడి స్కూటీపై పెద్దకూతురును ఎక్కించి చిన్న కూతురితో కలిసి ఆమె ఆటోలో వెళ్లింది. ఇదేక్రమంలో బైపాస్ రహదారి వద్ద కె.కన్వెన్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న స్కూటీకి వేములవాడ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సాన్వితతోపా టు ప్రకాశం జిల్లా పెద్దచర్లోపల్లి మండలం వెంగయ్యపల్లికి చెందిన మేస్త్రీ ముప్పారపు అజేరియా(37) మృతి చెందారు. అంబులెన్స్‌లో వారిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

పొగాకు బ్యారన్ రిజిస్ట్రేషన్ గడువు పెంపు

పొదిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బ్యారన్ రిజిస్ట్రేషన్ గడువును డిసెంబరు 22వ తేదీ వరకు పెంచినట్లు బోర్డు వేలం నిర్వహణ అధికారి గిరిరాజ్ కుమార్ తెలిపారు. రూ.100 చలానాతో నవంబరు 7 నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు, రూ.400 చలానాతో నవంబరు 19 నుంచి డిసెంబరు 22వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు. పొగాకు రైతులు గమనించి బ్యారెన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కృషి

(5వపేజీ తరువాయి)

తెలిపారు. అనంతరం ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్మికులకు రెయిన్‌కోట్లను అందించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందని, గత వైసీపీ పాలకులు సంస్థను విలీనం పేరుతో కార్మికులను మోసగించారన్నారు. కార్మికుల పీఎఫ్ నగదును సైతం కాజేశా రన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జోన్ ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ సురేష్‌రెడ్డి, నెల్లూరు జోన్ ఈడీ రాజేంద్రప్రసాద్, ఈడీవో అప్పలరాజు, ఈడీఏ చంగల్‌రెడ్డి, ఇన్‌చార్జి డీఎం మౌనిక, జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య పాల్గొన్నారు.

ఫీడర్ కాలువ పనులకు టెండర్లు

(5వపేజీ తరువాయి)

నివేదిస్తాయి. వారి అనుమతి పొందిన అనంతరం ఆర్థిక బిడ్‌ను పరిశీలన ఉంటుంది. అందులో ఏ కంపెనీ తక్కువకు కోడ్ చేస్తే ఆ కంపెనీకి అధికారు లు టెండర్ ఖరారు చేస్తారు. ఈ ప్రక్రియ అంతా వారంలో పూర్తి చేసి నెలాఖరుకు టెండర్లు ఖరారు చేస్తారని అధికార వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు

వేటపాలెం(చీరాల),అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏఆర్ కానిస్టేబుల్ కీర్తి గోపీపై కేసు నమోదైంది. బుధవారం తెల్లవారుజామున చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని ఓ పెట్రోల్ బంకులో సిబ్బందిపై గోపీ అనుచితంగా దాడిచేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

'బెల్ట్' నిర్వాహకురాలు అరెస్టు

అద్దంకి,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానిసెంటర్‌లో బెల్ట్‌షాపు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేస్తున్న మహిళను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు.1.81 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటండి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఐదు మండలాలకు పార్టీ కొత్త అధ్యక్షుల నియామకం



ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులతో ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొత్తగా ఎన్నికైన టీడీపీ మండల అధ్యక్షులందరూ కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులను ఎరిక్షన్‌బాబు ప్రకటించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించేవారికి గుర్తింపు, పదవులు తప్పకుండా వరిస్తాయన్నారు. ప్రభుత్వ కృషిని, అభివృద్ధిని ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు ఎంతకష్టపడితే అంత ఫలితం లభిస్తుందని చెప్పారు. ఎర్రగొండపాలెం టీడీపీ మండల అధ్యక్షుడిగా చిట్యాల వెంగళరెడ్డి, పుల్లలచెరువుకు పొట్ల గోవింద్, త్రిపురాంతకంకు మేకల వళరాజు, దోర్నాలకు షేక్ మాబు, పెద్దారవీడు మండల అధ్యక్షునిగా మెట్టు శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎరిక్షన్‌బాబు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ముఖ్యనాయకులు దేవినేని చెలమయ్య, గొట్టం శ్రీనివాసరెడ్డి, శనగా నారాయణరెడ్డి, పయ్యావుల ప్రసాద్, కాకర్ల కోటయ్య, గొట్టం శ్రీనివాసరెడ్డి, వేగినాటి శ్రీను, తోట మహేష్, బీవీ సుబ్బారెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, చెవుల అంజయ్య పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న మహిళా దొంగ అరెస్టు

రూ.20 లక్షలు విలువైన సొత్తు స్వాధీనం

నిందితురాలు పేరాలకు చెందిన మహిళ

వివరాలు వెల్లడించిన ఒంగోలు వన్‌టౌన్ సీఐ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగరాజు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికురాలు వద్ద బ్యాగ్ కట్ చేసి 20 సవర్ల బంగారం అపహరించుకెళ్లిన మహిళా దొంగను అరెస్టు చేసి సుమారు రూ.20 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు చెప్పారు. గురువారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఆయన మాటల్లోనే... ఈనెల 1న టంగుటూరు మండలం సర్వేరెడ్డిపాలేనికి చెందిన పోవూరి సుమతీ పర్చూరు వెళ్లేందుకు ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు ఎక్కిన తరువాత బ్యాగ్‌ను పరిశీలించింది. అందులోఉన్న 20 సవర్ల బంగారం ఆభరణాలు కనిపించలేదు. ఎవరో బంగారాన్ని దొంగిలించారని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సీసీ పుటేజీ ఆధారంగా బాపట్ల జిల్లా చీరాల మండలం పేరాలకు చెందిన కంప ద్వారకా ఆ చోరీ చేసినట్లు గుర్తించారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న మహిళ ద్వారకాను అదుపులోకి తీసుకొని విచారించి ఆమె వద్ద ఉన్న బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈకేసు ఛేదించి దొంగను పట్టుకునేందుకు కృసి చేసిన సీఐ వై నాగరాజు, ఎస్సై కే శ్రీనివాసరావు, ఏఎస్సై కే సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు కే రామకృష్ణ జీ శాంతకుమార్, హెడ్‌కానిస్టేబుల్ పీ రవి, ఎం అనిల్, టెక్నీషియన్ పి.వెంకీలను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందిచారని సీఐ తెలిపారు.

తప్పిన ముప్పు!

(5వపేజీ తరువాయి)

కురిశాయి. అలా గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున 35.7 మి.మీ వర్షపాతం నమోదైంది. తొలుత సోమ, మంగళవారాలు తూర్పు, దక్షిణ ప్రాంతాలలో అధికంగా వర్షాలు కురవగా బుధవారం ఆ ప్రాంతాలతోపాటు పశ్చిమ ప్రాంతంలో కూడా అధికంగానే కురిసింది.

రాచర్ల మండలంలో అత్యధికం

గురువారం ఉదయానికి 24 గంటల సమయంలో జిల్లాలో అత్యధికంగా రాచర్ల మండలంలో 85.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా పొదిలిలో 76.4, చీమకుర్తిలో 58.6, మార్కాపురంలో 57.2, పామూరులో 54.6, మర్రిపూడిలో 50.6 మి.మీ. నమోదైంది. మరో 20 మండలాల్లో 30 నుంచి 50 మి.మీ నమోదైంది. ఇలా తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అనేక ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగాయి. మార్కాపురం ప్రాంతంలో గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపేశారు. దోర్నాల, పామూరు, రాచర్ల, మార్కాపురంతోపాటు పలు మండలాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

అప్రమత్తంగానే అధికార యంత్రాంగం

తాజా వర్షాలు, జిల్లాలో పరిస్థితిపై మంత్రి డాక్టర్ స్వామి గురువారం అధికారులతో సమీక్ష చేశారు. ప్రకాశం భవనంలోని కలెక్టర్ సమావేశపు హాలులో తొలుత కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఇతర జిల్లా అధికారులతో మాట్లాడారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని మండలాల స్పెషల్ ఆఫీసర్లు, మండల అధికారులతో మాట్లాడి అక్కడి పరిస్థితులు తెలుసుకొని తగు సూచనలు చేశారు. వాయుగుండం తప్పిపోయినా అల్పపీడనం కొనసాగుతుండటంతో వర్షాలు ఆగకపోవచ్చని, మరో అల్పపీడనం కూడా రెండు రోజులు తర్వాత ఏర్పడుతుందన్న సంకేతాలు వాతావరణ శాఖ నుంచి అందుతున్నాయి. దీంతో యంత్రాంగం మరింత అప్రమత్తంగానే ఉండాలని మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబులు ఆదేశించారు. ఇదిలాఉండగా భారీ వర్షాలు, వాటి వల్ల వచ్చే వరదలతో వాగులు, వంకలు పొంగి జిల్లాలోని 18 ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు ఉంటాయని పోలీస్ శాఖ గుర్తించింది. డ్రోన్ కెమెరాల సాయంతో వాటిని గుర్తించి ఆలాంటి నీటి ప్రవాహాలు ఉండే చోట నష్టాలు జరగకుండా 24 గంటలు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది అలాంటి చోట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు.

పీహెచ్‌సీల ఉద్యోగుల్లో ఆందోళన

(5వపేజీ తరువాయి)

జిల్లాలోని 64 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న 138 మంది వైద్యాధికారులు సమ్మెలో ఉన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం వైద్యాధికారులు విజయవాడలో రిలే నిరహార దీక్షల్లో ఉన్నారు. వైద్యశాఖ ప్రత్యామ్నాయంగా ఒంగోలులోని మెడికల్ కాలేజీలో పీజీ చదువుతున్న విద్యార్థులను ఆ వైద్యశాలలకు నియమించి ప్రజలకు వైద్యసేవలు అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు సమ్మెలో ఉండటంతో జీతాలు బిల్లులు పెట్టేందుకు సమస్యగా మారింది. ఆయా పీహెచ్‌సీలకు డీడీవోలు లేకపోవడంతో ఆ బిల్లులు ట్రెజరీకి పంపేందుకు సాధ్యం కాదు. ఈనెల 25వతేదీలోపు ఆ బిల్లులను ట్రెజరీకి పంపకపోతే నవంబరు 1వతేదీన ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

వైద్యశాఖ ఏవోకు డీడీవో బాధ్యతలు అప్పగించాం

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. అందుకోసం వైద్యశాఖలో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో)కు డీడీవో అధికారాలను అప్పగించాం. అన్ని పీహెచ్‌సీలకు సంబంధించిన బిల్లులను ఏవో ట్రెజరీకి పంపుతారు. అందువల్ల ఉద్యోగులు జీతాల కోసం ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన పనిలేదు.

- డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

శింగరకొండలో ఆంజనేయస్వామి మండల దీక్ష ప్రారంభం

దీక్ష తీసుకున్న ధర్మకర్తల మండలి చైర్మన్ మురళీసుధాకరరావు



ఆలయ ప్రదక్షణ చేస్తున్న మండల దీక్ష భక్తులు

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాల యంలో గురువారం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, పలువురు భక్తులు మండల దీక్ష తీసుకున్నారు. దశాబ్ద కాలంగా శింగరకొండలో ఆంజనేయస్వామి మండల దీక్షలు ప్రారంభ మయ్యాయి. ఈ క్రమంలో గురువారం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అద్దంకి, దర్శి, వి.కొప్పెరపాడు, వైదన తదితర గ్రామాల నుండి వచ్చిన సుమారు 50 మంది భక్తులు దేవాలయం లో మండల దీక్ష తీసుకున్నారు. నవంబరు 12న అర్ధమండల దీక్ష ప్రారంభం కానుంది. మండల, అర్ధ మండల దీక్షలు తీసుకున్న భక్తులు డిసెంబరు 3న హనుమత్ వ్రతం సందర్భంగా దీక్షా భక్తులు స్వామి వారికి ఇరుముడులు సమర్పించ నున్నారు. దీక్షా భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా బుధవారం రాత్రి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభానికి ఆకాశ దీపం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాగునీటి చెరువులను నూరుశాతం నింపండి

రామకూరు చెరువును పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్



పంగులూరు చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పంగులూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు గ్రామ పంచా యతీ పరిధిలోని సింగర్ చెరువును కలెక్టర్ వినోదర్‌కుమార్ గురువారం సాయంత్రం పరిశీలించారు. చెరువును పూర్తిగా నీటితో నింపకపోవడాన్ని, కట్టలపై చిల్లచెట్లు ఉండా న్ని ప్రశ్నించారు. జిల్లాలోని చెరువులలో ఉన్న నీటి నిల్వల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చెరువులన్నిటినీ వారంరోజులలో నూరుశాతం నీటితో నింపాలని అధికారులను ఆదేశించారు. కట్టలపై ఉన్న చిల్లచెట్లను తొలగించి చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెరువుకు నీరు చేరుకునే ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లు క్లియర్‌గా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో బాలమ్మ, చీరాల ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ శ్రీచరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మంచినీటి చెరువును పరిశీలించిన కలెక్టర్

మార్టూరు : మార్టూరు మంచినీటి చెరువును గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చెరువు గురించి అధికారులతో మాట్లాడారు. చెరువు విస్తీర్ణం ఎంత, ఇప్పటి వరకు ఎంతభాగం చెరువు నింపారు, ఇంకా ఎంత నింపాలి అంటూ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను, గ్రామ పంచాయతీ ఈవోలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. రాజుపాలెం మేజరు నుంచి పైపులైన్ ద్వారా చెరువుకు సాగర్ జలాలు చేరుతున్నాయన్నారు. ఇప్పటికి 90 శాతం చెరువును నింపామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో కలెక్టర్ మరో రెండు మూడు రోజులలో చెరువును పూర్తిస్థాయిగా నింపాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు టి.ప్రశాంతి, ఎంపీడీవో వై శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో తస్నీరు శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు తహసీల్దారు కార్యాలయంలో కలెక్టర్ అరగంట సేపు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

అద్దంకి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రతి సోమవారం అద్దంకి డిపో నుంచి ముండ్లమూరు, తాళ్లూరు, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, రాజంపల్లి,పొదిలి, మార్కాపురం మీదుగా శ్రీశైలంకు బస్ సర్వీసు నడుపుతున్నట్లు డీఎం మహబూబి తెలిపారు. అక్టోబరు27, నవంబరు3, 10 ,17 తేదిలలో అద్దంకిలో ఉదయం బయలుదేరి శ్రీశైలం వెళ్ళి తిరుగు ప్రయాణం లో మరలా అదే రూట్ లో అద్దంకి వస్తుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రమాదకరంగా మారిన కల్వర్టు

అవీఇవీ



ఎండ్లూరు డొంకవద్ద కర్నూల్‌రోడ్డులో ఉన్న కల్వర్టరుపై చేరిన నీరు

సంతనూతలపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎండ్లూరు డొంకవద్ద ఉన్న కర్నూల్ రోడ్డుపై కల్వర్టరు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రమాదకరంగా తయారైంది. కల్వర్టు కొద్దిగా కుంగడంతోపాటు ఇరువైపులా ఉన్న నీరు కొంతమేర రోడ్డుమీదకు వచ్చింది. ఏ క్షణాన అయినా కల్వర్టు పూర్తిగా కుంగిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళనవ్యక్తం చేశారు. చీమకుర్తి సమీపంలోని గ్రానైట్ ఏరియా నుంచి అధికలోడుతో వచ్చే గ్రానైట్ లారీలు, టిప్పర్ల ధాటికి కల్వర్టు దెబ్బతింటోంది. అధికారులు స్పందించి ఎండ్లూరు డొంకవద్ద, సంతనూతలపాడు సమీపంలోని పెదగచ్చుల కల్వర్టులకు వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ నినాదం

ఏపీ మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి, దేవకి



డాక్టర్ ఏలూరి, దేవకిలను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ నినాదమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, ఏపీ పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి చెప్పారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం మార్కాపురం ప్రాంతానికి చెందిన ఇద్దరికి స్థానిక బీజేపీ నాయకులు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశానికి జీవనాధారమైన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులను వచ్చేఏడాది ఆగస్టు నాటికి ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. పోలవరం నిర్మాణానికి తగినన్ని నిధులు కేంద్రం మంజూరు చేస్తోందని చెప్పారు. దొనకొండలో రూ.1,200కోట్లతో ప్రభుత్వరంగ బీడీఎల్ కంపెనీ ఏర్పాటు చేసేందుకు కేంద్రం అనుమతించిందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేసేందుకు కేంద్రం పూర్తిస్థాయిలో సహకరించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, జీవీ రెడ్డి, బెల్లంకొండ విజయలక్ష్మి, అశోక్‌రెడ్డి, బీ కోటిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, పాదర్తి ఆంజనేయులు, మద్దెల లక్ష్మి, సతీష్, జీవీ నారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి




మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

మార్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ముంబయికి చెందిన ఎస్‌వీకేఎమ్ డీమ్డ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. జార్జి ఫార్మసి కాలేజీలో సిలికో స్క్రీనింగ్ ప్రొటోకాల్స్, టూల్స్ ఫర్ ది డ్రగ్ డిజైన్ అండ్ డిస్కవరీ ప్రాసెస్ అనే అంశంపై గురువారం ఒక్కరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఔషధ రూపకల్పన, మాలిక్యూలర్ డాకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించి ప్రొటీన్ లక్ష్యాలపై ఎలా అధ్యయనం చేయాలో విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ప్రసన్నకుమార్, కో-కన్వీనర్లు డాక్టర్ వై.సునీత, డాక్టర్ కె.అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన బి.ఎ., బీకాం(జనరల్ కంప్యూటర్ అప్లికేషన్స్), బి.బి.ఎ, ఎంఎ, బి.ఎల్‌ఐసీ, ఎంఏ ఎకనామిక్స్, బీఎల్‌ఎస్ కోర్సుల పరీక్షలకు సంబంధించి ఫలితాలను తాత్కాలిక రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, దూరవిద్య సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 4 లోపు దరఖాస్తు చేసుకోవాలని దూరవిద్య పరీక్షల డిప్యూటీ రిజిస్టార్ సయ్యద్ జైనులాబ్దిన్ తెలిపారు. ఒక్కొక్క పేపరు రీ-వాల్యుయేషన్‌కు డిగ్రీ విద్యార్థులు రూ.770, పీజీ, బీఎల్‌ఐసీ విద్యార్థులు రూ.960 చెల్లించాలన్నారు. రీవాల్యుయేషన్ దరఖాస్తులను వచ్చే నెల 7లోపు విశ్వవిద్యాలయంలోని దూర విద్య పరీక్షల సమన్వయకర్తకు అందజేయాలన్నారు. ఫలితాలను ఏఎన్యూసిడిఈడాట్‌ఇన్ఫో అంతర్జాలం నుంచి పొందవచ్చన్నారు.

రోడ్డుపై నిరసన



రోడ్లపై వరి మొక్కలు నాటుతున్న మహిళలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలోని సుందరయ్య కాలనీ వాసులు గురువారం వినూత్నంగా నిరసన తెలిపారు. కాలనీలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని నిరసన తెలుపుతూ మహిళలు బురదమయంగా మారిన రోడ్లపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు.

వైభవంగా కార్తీక పూజలు




కుసుమహరనాథ, పార్వతి పరమేశ్వరులు

గిద్దలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీకుసుమ హరనాథ క్షేత్రంలో కార్తీక మాస పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గురువారం కుసుమ హరనాథ, పార్వతి పరమేశ్వరులకు పంచామృతాభిషేక కార్యక్రమాన్ని భక్తులు సామూహికంగా నిర్వహించారు. సామూహిక భజనల అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కార్తీకం నెల పొడవునా ప్రత్యేక పూజలు, సోమవారాలు, ఏకాదశి, పౌర్ణమి రోజుల్లో సామూహిక అభిషేకాలు జరుగుతాయని భక్త సమాజం అధ్యక్షుడు నటుకుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు తెలిపారు.

ముంచిన వర్షాలు

2,303 హెక్టార్లలో పంటలకు నష్టం
ప్రాథమికంగా గుర్తించిన వ్యవసాయశాఖ
ప్రభుత్వానికి నివేదన

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో 2,303.46 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలోని ఐదు మండలాల పరిధిలోని 76 గ్రామాలలో 2,929 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. ఇంకా వర్షం వీడకపోవడంతో ఈ పంట నష్టాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పెద్దారవీడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 1,309 మంది రైతులు, వెలిగండ్ల మండలంలో 17 గ్రామాలకు చెందిన 1,013 మంది రైతులు, మర్రిపూడి మండలంలో 18 గ్రామాలకు చెందిన 420 మంది రైతులు, పొదిలి మండలంలో 27 గ్రామాలకు చెందిన 185 మంది రైతులు, కొత్తపట్నం మండలంలో ఒక గ్రామానికిచెందిన ఇద్దరు రైతులకు చెందిన పంట నష్టపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పత్తి 915.5 హెక్టార్లు, మొక్కజొన్న 24.06 హెక్టార్లు, సజ్జ 1,358.98 హెక్టార్లు, జొన్న 2.42 హెక్టార్లు, వేరుశనగ 2.5 హెక్టార్లలో వర్షాలకు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి నివేదించారు.


పెద్దారవీడులో నీట మునిగిన మిర్చి

తర్లుపాడులో నీటిలో ఉన్న బొప్పాయి తోట

మార్కాపురంలో పత్తి కొనుగోలు కేంద్రం

● వచ్చేనెల మొదటివారంలో ప్రారంభం


మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మార్కెట్ యార్డులో వచ్చేనెల మొదటి వారంలో పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీచాంబర్‌లో గురువారం పత్తి కొనుగోళ్లపై జిల్లాకమిటీ సమావేశానికి జేసీ అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా జిల్లాలో పత్తి పంట విస్తీర్ణం, దిగుబడిని వ్యవసాయ శాఖ అధికారులు ఈసందర్భంగా జేసీ గోపాలకృష్ణ దృష్టికి తెచ్చారు. దీనిపై జేసీ మాట్లాడుతూ ఈపంట వివరాలతో ఆర్‌ఎస్‌కేల వద్ద రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రైతుల ద్వారా కపాస్ కిసాన్ యాప్ ద్వారా వారి పంటను అమ్ముకునేందుకు స్లాట్‌లను బుక్ చేసుకోవచ్చన్నాను. ఆర్‌ఎస్‌కేల వద్దకు వచ్చేటప్పుడు రైతులు ఆధార్, పట్టాదారు పాసుబుక్ జెరాక్స్ కాపీలను తీసుకుపోవాలన్నారు. సీసీఐ బయ్యర్లు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పత్తికొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రంలో సీసీ కెమెరాలు, మంటలను ఆర్పే యంత్రాల ఏర్పాటుతో పాటు రైతులు తీసుకొని వచ్చే పత్తికి ఇన్సూరెన్స్ విధిగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రంనుంచి జిన్నింగ్ మిల్లుకు తరలించే సమయంలో రవాణా ఇబ్బందులు లేకుండా ఆశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పత్తి కొనుగోలు సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను జేసీ ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కనీస మద్దతు ధర 24.5 నుంచి25.5 ఎం.ఎం.కు రూ. 7,710, 29.5నుంచి 30.5 ఎంఎం మద్దతు ధర రూ. 8,110తో కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, మార్కెటింగ్‌శాఖ అధికారి వరలక్ష్మితో పాటు ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

జిల్లాలో 35.7 మి.మీ. వర్షపాతం నమోదు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 35.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. రాచర్ల మండలంలో అత్యధికంగా 85.4మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా కురిచేడు మండలంలో 11.2 మిమీ నమోదైంది. పొదిలి 76.4, చీమకుర్తి 58.6, మార్కాపురం 57.2, పామూరు 54.6, మర్రిపూడి 50.6, సంతనూతలపాడు 49.6, సీఎస్‌పురం 48.6, తర్లుపాడు 48.0, ఒంగోలు రూరల్ 47.4, ఒంగోలు అర్బన్ 47.4, పెద్దారవీడు 40.8, కొత్తపట్నం 39.6, కొనకనమిట్ల 37.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. సింగరాయకొండ 36.8, దోర్నాల 36.4, నాగులుప్పలపాడు 34.8, కంభం 34.2, వెలిగండ్ల 34.2, బేస్తవారిపేట 34.0, కనిగిరి 33.6, పీసీపల్లి 32.4, మద్దిపాడు 32.2, టంగుటూరు 30.4, గిద్దలూరు 28.6, పొన్నలూరు 27.0, హనుమంతునిపాడు 26.6, కొమరోలు 26.4, కొండపి 24.8, జరుగుమల్లి 24.6, దొనకొండ 23.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. పుల్లలచెరువు 20.0, దర్శి 19.2, తాళ్ళూరు 19.0, అర్ధవీడు 18.4, యర్రగొండపాలెం 16.2, త్రిపురాంతకం 13.4, ముండ్లమూరు 13.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రాణ,ఆస్తి నష్టం లేకుండా చర్యలు

● సమీక్షలో మంత్రి డాక్టర్ స్వామి


వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని మండలాల్లో వర్షాల పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీ వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణలతో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. అనంతరం మం డల స్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో స్వామి మాట్లాడారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు వల్ల ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. వర్షాలు తగ్గేంత వరకు ఇదే స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించామన్నారు. వర్షాల వల్ల పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బందిని పూర్తి స్థాయిలో నిమగ్నం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. చెట్లు కూలి రవాణాకు అంతరాయం కలిగినా, విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగినా తక్షణమే పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.

వాగులు పొంగుతుంటే ప్రజలు అటు వైపు వెళ్లకుండా రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో నిరంతరం గస్తీ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడటంతో పాటు క్లోరినేషన్ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. గ్రామాల్లోని వర్షపు నీటిని చెరువులకు మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమైందన్నారు. కలెక్టరేట్, డివిజన్, మడల స్థాయిలోనూ ప్రత్యేకంగా కమాండ్ కంట్రోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తనతో పాటు జాయింట్ కలెక్టర్ కూడా క్షేత్ర స్థాయిలో పర్యటించి అధికారులకు అవసరమైన సూచన లు చేశామన్నారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని, అవసరమైన మందులు, రేషన్ సరుకులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశుతో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.


గోరంట్ల మల్టీప్లెక్స్‌లో మాట్లాడుతున్న కె.ర్యాంపు హీరో కిరణ్ అబ్బవరం, నటులు

సందడి చేసిన 'కె.ర్యాంప్' సినీ బృందం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కె.ర్యాంప్ సినీబృందం గురువారం ఒంగోలులో సందడి చేశారు. హీరో కిరణ్ అబ్బవరం ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఒంగోలులో చిత్రం ప్రదర్శితమవుతున్న గోరంట్ల మల్టీప్లెక్స్‌కు రాగా వారికి థియేటర్ యాజమాన్యం గోరంట్ల బాబు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ దర్శకుడు జైన్స్ నాని అద్భుతంగా దర్శకత్వాన్ని వహించారని, అదేవిధంగా ఈ చిత్రంలోని హీరోయిన్ యుక్తి తరేజ్‌తో పాటు ఇతర నటీనటులందరూ మంచి నటన ప్రదర్శించారన్నారు. ఇక చిత్రంలో అన్ని రకాల ప్రేక్షకులను ఆకట్టుకునేవిధంగా హాస్య సన్నివేశాలతో కథాంశం ఉందని, ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నదని అన్నారు. ఈ నెల 18న విడుదలైన ఈ చిత్రం అన్ని సెంటర్లలో విజయవంతంగా ప్రదర్శించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నదన్నారు. చిత్ర యూనిట్‌కు థియేటర్ యాజమాన్యం గోరంట్ల బాబు శుభాకాంక్షలు తెలుపుతూ ఇందులో హీరోగా నటించిన కిరణ్ అబ్బవరపుకు మంచి భవిష్యత్ ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానుల కోలాహలంతో థియేటర్ ప్రాంతం సందడిగా మారింది.

అప్పు తీర్చమన్నందుకు కత్తెరతో దాడి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన అప్పు తిరిగి తీర్చమన్నందుకు కత్తెరతో దాడి చేసిన ఘటన పట్టణంలో జరిగింది. అందిన సమాచారం మేరకు కార్పెంటర్‌గా పని చేస్తున్న సురేంద్ర అనే వ్యక్తి ఆంటీ హోటల్ దగ్గర ఉన్న టైలర్ రమణకు అప్పుగా రూ.96,000 ఇచ్చాడు. గత కొన్ని రోజులుగా అప్పు చెల్లించాలని సురేంద్ర అడుగుతున్నాడు. గురువారం తన అప్పు వెంటనే చెల్లించాలని సురేంద్ర టైలర్ రమణ వద్దకు వెళ్లగా మాటామాటా పెరిగి పెనుగులాటలో టైలర్ రమణ తన వద్ద ఉన్న కత్తెరతో సురేంద్రను గాయపరిచాడు. ఈ మేరకు సురేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం సురేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అర్బన్ సీఐ కె.సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలపై శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం మనిర్వహిస్తున్నట్లు శంకరరావు తెలిపారు. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాల ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమం సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు జరుగుతుందన్నారు. 9959225700కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలని సూచించారు.

ఆక్రమణదారులకు నోటీసులు

పెద్ద దోర్నాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ వైద్యశాల ముందు ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలను ఏర్పాటు చేసుకున్న యజమానులకు రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు గురువారం నోటీసులు అందజేశారు. వారం రోజుల్లో ఖాళీ చేయాలని లేదా తొలగింపు చర్యలు చేపడతామని దుకాణాల యజమానులకు అందజేస్తూ, లేనివారి దుకాణాలకు నోటీసులు అంటిస్తున్నారు. దుకాణదారులు మాట్లాడుతూ అందరినీ తొలగిస్తే మాకేమి అభ్యంతరం లేదని ఒకవైపు తొలగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మ, వీఆర్‌వోలు కె ఏడుకొండలు, వీ నాగేశ్వరరావు, సిబ్బంది గురవయ్య, సత్యారావు పాల్గొన్నారు.



ఒంగోలు రిమ్స్ కాలేజీ ఆడిటోరియంలో గురువారం జరిగిన ఎంబీబీఎస్ 2025 బ్యాచ్ స్వాగత వేడుకలతోపాటు, తెల్లకోటు ధరించే కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

● ఘనంగా మెడికల్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే

డాక్టర్ కావాలన్నది ప్రతి ఒక్కరి కల.. ఎంబీబీఎస్ చదివేందుకు ఇంటర్ వరకు పుస్తకాలతో కుస్తీ పడి నీట్‌లో ఉత్తీర్ణత సాధించి. మెడికల్ కాలేజీలో అడుగుపెట్టిన వేళ..తొలిసారిగా ఒంటిపై తెల్లకోటు ధరించడం మరిచిపోలేని మధురానుభూతి. ఆ మహోత్సవానికి ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కళాశాల వేదిక అయింది. ఈ సందర్భంగా గురువారం ఎంబీబీఎస్ 2025 బ్యాచ్ స్వాగత వేడుకలతో పాటు, తెల్లకోటు ధరించే కార్యక్రమం ఘనంగా జరిగింది. కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జూనియర్స్, సీనియర్స్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అశోక్ కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ వైద్య వృత్తి పవిత్రమైనదని తెలిపారు. ఎంతో కష్టపడి చదువుకుని మెడికల్ సీటు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. గౌరవ ప్రదమైన వైద్య విద్యలోకి తొలి అడుగు వేసిన ప్రతి విద్యార్థి మంచి ప్రవర్తనతోపాటు కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజి విద్యారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. అలాగే మొదటి సంవత్సర విద్యార్థులకు సీనియర్స్ ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్‌నామినేని కిరణ్ కుమార్, సీఎస్ఆర్‌ఎంవో డాక్టర్ మాధవిలత, మెడికల్ కాలేజి ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్

రహదారిపై గుంతలు - గ్రానైట్ లారీ బోల్తా


ఆర్‌ఎల్‌పురం-రామతీర్థం రోడ్డులో బోల్తా పడిన గ్రానైట్ వాహనం

చీమకుర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : ఆర్ఎల్‌పురం గ్రామం నుంచి రామతీర్థం వరకూ దాదాపు కిలోమీటరుకుపైగా దూరం రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రహదారికి ఇరువైపులా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఈ క్వారీల నుంచి డంపర్లు, భారీ వాహనాలు రాళ్ల లోడులతో రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ రహదారి శిథిలావస్థకు చేరుకుంది. ఏడాది క్రితం తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహించారు. కానీ నిత్యం భారీ వాహనాలు ప్రయాణిస్తుండటంతో మళ్లీ గుంతలుపడ్డాయి. గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో గుంతలు నీటిమయమై తటాకాలను తలిపిస్తున్నాయి. గురువారం యథావిధిగా క్వారీ నుంచి గ్రానైట్ రాయిని లోడుచేసుకొని వెళ్తున్న ట్రాలీ గుంతల్లో పడి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణప్రమాదం చోటుచేసుకోలేదు. దీంతో అక్కడ పరిసరాల్లో ఉన్నవారు ఊపిరిపీల్చుకున్నారు.

మోసగించిన కేసులో ఒకరికి జీవితఖైదు

● మరో ఇద్దరికి రెండేళ్ల జైలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యువతికి మాయమాటలు చెప్పిప్రేమపేరుతో వంచనకు గురిచేసిన దూదేకుల సైదావలిపై నేరం రుజువైనందున జీవితఖైదుతో పాటు రూ.35వేలు జరిమానా విధిస్తూ జిల్లా అదనపు కోర్టు న్యాయాధికారి రాజావెంకటాద్రి గురువారం తీర్పునిచ్చారు. అంతేకాకుండా నేరస్థుడికి సహకరించిన సైదావలి తల్లిదండ్రులు ఖాదర్ వలి, కాశమ్మలకు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధించారు.

ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. బేస్తవారిపేటకు చెందిన దూదేకుల సైదావలి కంభంకు చెందిన యువతిని (2020 సంవత్సరం) కాలేజీలో చదువుకుంటూ నమ్మించాడు. పెళ్లిచేసుకుంటానని మాయమాటలు చెప్పి యువతి లొంగదీసుకున్నాడు. అనంతరం 2022లో యువతిని కులం పేరుతో దూషించడమే కాకుండా హేళన చేశాడు. సైదావలి తల్లిదండ్రులు కూడా అదే విధంగా ఆ యువతిపై దూషణలకు దిగారు. దీంతో బాధితురాలు కంభం పోలీసు స్టేషన్‌లో 2022లో ఫిర్యాదు చేసింది. అప్పట్లో ఎస్సీ,ఎస్టీ యాక్ట్‌తోపాటుగా, రేప్ చేసి మోసం చేసినట్లు కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు.

అనంతరం సైదావలితోపాటు అతని తల్లిదండ్రులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈమేరకు విచారించిన న్యాయాధికారి టి.రాజావెంకటాద్రి సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు సైదావలిపై నేరం రుజువు కావడంతో జీవితఖైదుతో పాటు రూ. 35 వేలు జరిమానా విధించారు. సైదావలి తల్లిదండ్రులు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు శిక్షతోపాటుగా రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి కుమారి తమ వాదనలు వినిపించారు. ఈకేసులో నేరస్థులకు శిక్షలు పడే విధంగా సాక్ష్యాధారాలు సేకరించి కోర్టుముందు ఉంచిన పోలీసులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారు.

ఎంపీడీవోగా ఎంపికైన సాహితీ సృజన

రాచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాలలో రాచర్ల మండలం జేపీచెరువు గ్రామానికి చెందిన పుట్టా సృజన సాహితీ మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా ఎంపికయ్యారు. సృజన సాహితీ తండ్రి పుట్ట బాలగంగాధర్ హైదరాబాద్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సాహితీ గ్రూప్ -1 మొదటి ప్రయత్నంలోనే ఎంపీడీవోగా ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	250.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	260.00

నగరం నీటిలోనే..!

రోడ్లన్నీ జలమయం • అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

ఇబ్బందిపడుతున్న వాహనదారులు, ప్రజలు



బాపూజీ కాంప్లెక్స్ రోడ్డులో నీటిలోనే వాహనాల రాకపోకలు



గుంటూరు రోడ్డులో..



ఆర్టీసీ డిపో ఎదురు భారీగా నిలిచిన వర్షపునీరు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గడిచిన రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ముసురు వాతావరణంతో ముంచెత్తిన వానతో జనాలకు ఇక్కట్లు తప్పలేదు. గురువారం కూడా నగరంలో ప్రధాన రహదారులన్నీ జలమయం అవుతుండగా, ఇక శివారు కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. నగరంలో పెరిగిపోతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు, మురుగు కాలువలు ఆధునీకరణకు నోచుకోవడం లేదు. దీంతో కొద్దిపాటి వాన కురిసినా నగరమంతా చెరువులా మారిపోతుంది. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పరిస్థితి దిగజారుతోంది. ముఖ్యంగా పారిశుధ్యం మెరుగు పనులు కేవలం మొక్కుబడికే పరిమితం కాగా, కాలువల్లో పూడిక తీతలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక ఇరుకైన డ్రైనేజీ వ్యవస్థతో మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తున్నది. గత రెండు రోజులుగా నగరంలో కురుస్తున్న వానలకు ప్రజలకు కష్టాలు తప్పలేదు. అయితే ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్విక్ రెస్పాన్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. స్థానిక రిక్షాల బజారులో, పలు శివారు కాలనీలలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరగా, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆటోనగర్‌లో నిలిచిన వర్షపు నీరు

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం త్రోవగుంట ఆటోనగర్‌లో భారీ వర్షాలకు జలమయం అయ్యింది. దీంతో కార్మికులకు పనులు నిలిచిపోయాయి. గత వారం రోజులు నుంచి కురుస్తున్న వర్షాలతో రోడ్లు బురదమయం అయ్యాయి. రోడ్లను వర్షపునీరు ముంచెత్తడంతో ఆటోమొబైల్ షాపులను మూతవేసినట్లు యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోనగర్‌కు డ్రైనేజీ, సీసీ రహదారులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ఇస్లాంపేటకు వెళ్లే దారిలో..



ఆటోనగర్‌లో నిలిచిన వర్షపునీరు



గాంధీపార్కు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

వర్షపు నీరు వెళ్లేందుకు సహకరించాలి

• కల్వర్టు పూడ్చిన రైతులతో కమిషనర్



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): "కొప్పోలు రోడ్డులో వర్షపునీరు వెళ్లేందుకు రైతులు సహకరించాలి. పలు కాలనీల చుట్టూ నీరు చేరటంతో 1000 కుటుంబాల వారు ఇబ్బంది పడుతున్నారు. విపత్తు సమయంలో ఎవరూ సహాయక చర్యలకు అడ్డురాకూడదు" అంటూ నగర కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. స్థానిక కొప్పోలు రోడ్డులోని ఎన్టీఆర్ కాలనీ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు కల్వర్టు పక్కన కాలువను పూడ్చిన రైతులతో గురువారం కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ రోడ్డులో ఉన్న పలు కాలనీల ప్రజలు వర్షాల సమయంలో ఇబ్బందులు పడుతున్నారని, వర్షపునీరు కల్వర్టు ద్వారా ప్రవాహం లేక సమస్య పెరుగుతోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. అయితే రైతులు తమ సమస్యలను వెళ్లబోసుకున్నారు. తమ పొలాల్లోకి డ్రైనేజీ నీరు భారీగా వస్తుండడంతో పంటలను సాగు చేసుకోవడానికి చాలా ఇబ్బందిపడుతున్నామని చెప్పారు. దీంతో కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతానికి వర్షపునీరు కల్వర్టు ద్వారా వెళ్లేందుకు సహకరించాలని కోరగా రైతులు అంగీకరించారు. కార్యక్రమంలో ఎంఈ ఐసయ్య, కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

• న్యాయాధికారి ఇబ్రహీంషరీఫ్



మాట్లాడుతున్న న్యాయాధికారి ఇబ్రహీంషరీఫ్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ ఉన్నతంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మత్తుపదార్థాలకు, ప్రత్యేకించి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తద్వారా బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చని జిల్లా న్యాయసేవసాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీంషరీఫ్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని రాజీవ్‌గాంధీ మెడికల్ కాలేజీలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, బాలబాలికలపై జరుగుతున్న లైంగిక దాడి నివారణ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయాధికారి ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ ఫోక్సో యాక్ట్ ప్రకారం గరిష్ఠంగా శిక్షలు విధించబడతాయన్నారు. అదేవిధంగా మాదకద్రవ్యాలు వినియోగం, రవాణా, అమ్మకాలు నిర్వహించడం ద్వారా పలు కఠినమైన శిక్షలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ మమత, డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి యోగా శిక్షణ

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రకాశం యోగా మిత్ర బృందం ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి అమృత ఆహారంతో కూడిన యోగా కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు బత్తినేని సుబ్బారావు, చుండూరి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒంగోలు నగరం అంజయ్యారోడ్డులోని ఆరామ క్షేత్రం పైఅంతస్తులో 41 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి యోగా శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 9885547017, 9490299234 సెల్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

పంటకుంటలతో రైతులకు ప్రయోజనం



చిన్నగుడిపాడులో పంటకుంటలో చేరిన వర్షపు నీరు

దొనకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పంటకుంటలు రైతులకు ప్రయోజనకరంగా ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట కుంటల్లోకి వర్షపు నీరు చేరింది. దొనకొండ మండలానికి 122 పంట కుంటలు మంజూరయ్యాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే 75 కుంటలు తవ్వారు. వర్షం నీరు వృధా కాకుండా నేరుగా ఈ కుంటల్లోకి చేరే విధంగా పనులు చేపట్టారు. వర్షపు నీటిని ఆదా చేయటం ద్వారా భూగర్భజలాలను పెంపొందించడంతోపాటు సాగుకు నీటి వనరుల కొరత లేకుండా ఉండేందుకు ప్రభుత్వం వీటి నిర్మాణాలను చేపట్టింది.

రామన్నచెరువు కట్ట సమస్యను పరిష్కరిస్తాం

• కలెక్టర్ రాజాబాబు



చెరువు వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, వర్షపునీటిని మళ్లిస్తున్న ఎక్స్‌కవేటర్ (ఇన్‌సెట్లో)

నాగులుప్పలపాడు,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రామన్నచెరువు కట్ట సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజాబాబు పేర్కొన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో చదలవాడ గ్రామంలోని రామన్నచెరువుకు భారీగా వరదనీరు చేరింది. ప్రతి ఏడాది వర్షపునీటితో చెరువు నిండి పక్కనే అనుకుని ఉన్న హైవే-216పై నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈక్రమంలో కలెక్టర్ పి.రాజాబాబు, జేసీ గోపాలకృష్ణతో కలిసి గురువారం చదలవాడ రామన్నచెరువు కట్ట దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. చెరువులోకి చేరిన వరదనీరు జాతీయ రహదారిపైకి చేరకుండా కట్ట పక్కనే ఉన్న సైడుకాలువల ద్వారా బయటకు వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని హైవే, ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సైడు కాలువల్లోని నీరు గుండ్లకమ్మ వాగులోకి మళ్లించాలని సూచించారు. దీంతో అధికారులు ఎక్స్‌కవేటర్‌తో నీటిని మళ్లించే పనులు ప్రారంభించారు. కాగా ప్రతి ఏడాది వర్షాకాలంలో వరదనీటితో చెరువు నిండి పడమర వైపు కట్ట తెగిపోతుందని, చెరువుకట్టను పటిష్టం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని సర్పంచ్ దాసరి వరప్రసాదరావు, పలువురు గ్రామస్థులు కలెక్టర్‌కు విన్నవించారు. దాంతో త్వరలోనే రామన్నచెరువు కట్ట సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి !

• కమిషనర్ వెంకటేశ్వరరావు



యూట్యూబర్స్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయన్సర్లతో కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధిని ప్రపంచవ్యాప్తంగా వివరించేందుకు కార్పొరేషన్ అధికారులు వినూత్న ఆలోచనకు శ్రీకారం పలికారు. ఈ మేరకు గురువారం నగరానికి చెందిన పలువురు యూట్యూబర్స్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయన్సర్లతో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు నగరంలో సోషల్ మీడియా ద్వారా అనేక మంది అభిమానులను సొంతం చేసుకున్న ప్రతి ఒక్కరూ నగర అభివృద్ధి గురించి అందిరికీ తెలిసేలా రీల్స్, షార్ట్‌ఫిల్మ్‌ల ద్వారా వివరించాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరించడం తోపాటు ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు మీ వంతు సహకారం అందించాలని కోరారు. అలాగే నగరంలోని తాగునీరు, పారిశుధ్యం సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ ఐసయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపక్కన చెత్త వేస్తే చర్యలు

నగర పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో, ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో, రోడ్ల వెంట చెత్తను వేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

వాసవీ అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారెను సమర్పిస్తున్న భక్తులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అన్నాచెల్లెళ్ల పండుగ భగినీ హస్త భోజనం సందర్భంగా ఒంగోలు నగరం అమలనాదునివారి వీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి గురువారం మహిళలు చీరె, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లతో కూడిన సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అమ్మవారికి సోదర సమానుడిగా భావించే శ్రీకృష్ణునికి ముందుగా స్థానిక గాంధీరోడ్డులోని గీతామందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహికంగా గీతా శ్లోకాలను పఠిస్తూ వారు వాసవీ అమ్మవారి దేవస్థానానికి చేరుకుని సారెను సమర్పించారు. అనంతరం అర్చకులు లోల వెంకటసూర్యనారాయణశాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రతిభానంద సరస్వతి మాతాజీ, దోగిపర్తి సుబ్రహ్మణ్యం, రాజరాజేశ్వరి, కే.కృష్ణ, కొప్పురావూరి సురేఖ, దేసు అరుణ, ఉపేంద్ర, అనిత, చీమకుర్తి శివప్రసాద్, భారతి, హేమకేష్, గుర్రం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ఎస్జీటీలకు డిప్యుటేషన్ అవకాశం

• డీఈవో కిరణ్‌కుమార్

సంతనూతలపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు, కో-స్కోలాస్టిక్ యాక్టివిటీస్‌లో తెలుగు లెక్చరర్ పోస్టు-1, ఫైన్ ఆర్ట్స్ లెక్చరర్ పోస్టులు-2, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈవీఎస్‌లో సోషల్ సైన్సు పోస్టు-1లకు ప్రభుత్వ/జడ్పీ/మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్‌లు డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. 31-10-2025 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసి, 58 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. మాస్టర్ డిగ్రీలో సంబంధిత సబ్జెక్టులో 55శాతం, ఎంఈడీలో 55 శాతం మార్కులు పొంది ఉన్న అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరకాస్తు కాపీలను ఒంగోలులోని డీఈవో కార్యాలయంలోను అందజేయాలన్నారు. ఈనెల 30, 31 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన ఉంటుందని, వివరాలకు డైట్ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

మెలకువలు పాటిస్తే అధిక లాభాలు

మద్దిపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మిరపనారు సాగులో మెలకువలు పాటిస్తే అధిక లాభం పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి డాక్టర్ సంధ్య పేర్కొన్నారు. గురువారం మద్దిపాడు మండలంలోని దొడ్డవరం, కొలచనకోట గ్రామాల్లో సాగు చేస్తున్న మిరప, బంతినారులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ అధిక వర్షాల సమయంలో నర్సరీల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, ఆకులు పసుపుబారకుండా యూరియా గాని పొటాషియం నైట్రేట్ స్ప్రే చేయాలన్నారు. మిరపతోటలు ఉరకెత్తితే పది గ్రాములు యూరియా లీటర్ నీటికి కలిపిన వారంలో రెండుసార్లు పిచికారి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఎస్టీ కాలనీవాసులకు సరుకులను అందజేస్తున్న నాయకులు

సంతనూతలపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కామేపల్లివారిపాలెంలోని ఎస్టీకాలనీవాసులకు స్థానిక టీడీపీ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, ఇస్తర్ల నరసింహం గురువారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రోజు వారి కూలి పనులు చేసుకుని జీవించే వారికి గత వారంరోజులుగా వర్షాలు పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో టీడీపీ నాయకులు స్పందించి ఎస్టీకాలనీ వాసులకు సరుకులను అందజేశారు.

వైసీపీ హయాంలో ఒకటో తేదీన జీతాలు ఇచ్చారా?

• టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్వాములు

మద్దిపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఏనాడైనా ఒకటవ తేదీ ఉద్యోగులకు జీతాలు ఇచ్చారా అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు ప్రశ్నించారు. గురువారం మద్దిపాడులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఉద్యోగుల డీఏపై వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగులను బ్రాందీ షాపుల దగ్గర నిలబెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో వడ్లమూడి శ్రీనివాసరావు, మోరబోయిన సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

మద్దిపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామాల్లో పక్కా గృహాలు నిర్మించుకోవాలనుకునే వారు నవంబరు 5వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో జ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు మద్దిపాడులోని హౌసింగ్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

దొడ్డవరంలో అధ్వానంగా అంతర్గత రోడ్లు

• ఇబ్బందిపడుతున్న స్థానికులు

మద్దిపాడు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం దొడ్డవరంలో పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానగా మారాయి. ముఖ్యంగా బీసీకాలనీలో వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కనీసం కాలు బయట పెట్టే పరిస్థితి కూడా ఉండటం లేదు. అడుగులోతు గుంతలు దర్శనమిస్తున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కాగా గురువారం ఈ విషయంపై సర్పంచ్ పూనూరు సుబ్బారావు మాట్లాడుతూ పంచాయతీ తీర్మానంతో బీసీకాలనీలో రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండి పంచాయతీ ట్రాక్టర్ ద్వారా గ్రామంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్త భరత్‌రావు, పంచాయతీ కార్యదర్శి రాజా రమేష్, ఇంజేపల్లి సునీల్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్‌స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటినట్లు స్కూలు డైరెక్టర్ జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చరణ్, ప్రియ, రాహుల్, రోహిత్‌లు రజిత పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విజేతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డీపీవో

టంగుటూరు (కొండపి), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాలు అధికంగా పడుతున్నందున గ్రామస్థులు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని వల్లూరు గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పలు వీధుల్లోని నివాసితులతో ఆయన మాట్లాడారు. అంటు వ్యాధులు ప్రబలకుండా, దోమల ఉత్పత్తి పెరగకుండా గృహాల యజమానులు మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరుగా వేసి గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు వచ్చినపుడు అందజేయాలన్నారు. కరపత్రాలను అందజేశారు.

రేపు నాగేంద్రస్వామికి పూజలు

సంతనూతలపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని మద్దులూరురోడ్డులో ఉన్న శ్రీనాగేంద్ర, సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25న నాగులచవితి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, భక్తులు తరలిరావాలని కోరారు.

తడిసిముద్దవుతున్న చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయం

- వర్షాలకు ఉరుస్తున్న గదులు
- రికార్డులను భద్రపరచలేక సిబ్బంది తంటాలు
- నిధులు మంజూరైనా మొదలు కాని నూతన నిర్మాణ పనులు





వర్షపు నీటితో తడిసిపోతున్న తహసీల్దార్ కార్యాలయంలోని గదులు

చీమకుర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేరుగాంచిన రెవెన్యూ కార్యాలయాల్లో చీమకుర్తి తహసీల్దార్ కార్యాయం ఒకటిగా ఉంది. సంతనూతలపాడు నియోజకవర్గానికి ఎన్నికల పరంగా ఇదే ప్రధాన కార్యాలయం. ఇక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. మండలపరిధిలోని రెవెన్యూ రికార్డులతో పాటు ఎన్నికల పరమైన రికార్డులు ఇదే కార్యాలయంలో భద్రపరుస్తారు. ఇంతటి కీలకమైన తహసీల్దార్ కార్యాలయం గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో తడిసిముద్దవుతున్నది. డీటీ కార్యాయలంతో పాటు పలు గదులు శిథిలావస్థకు చేరుకొని ఉరుస్తుండటంతో వర్షపునీరు చేరింది. ఉద్యోగులు కార్యక లాపాలు నిర్వహించటానికి వీలులేకుండా వర్షం పడే సమయంలో ఉరుస్తుండటంతో చేసేదేమిలేక గదులు ఖాళీచేసి అందరూ కలిసి ఒకే చోట ఉండాల్సి వస్తుంది. కాగా శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయంను పడగొట్టి పునర్నిర్మాణం చేసేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ చొరవతో రూ.3కోట్ల డీఎంఎఫ్ నిధులను కలెక్టర్ ఏడాది క్రితం మంజూరు చేశారు. అయితే అక్కడనుంచి ఒక్క అడుగు కూడా ముందుకుపడకపోవటం గమనార్హం. శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయాన్ని కూలగొట్టాలంటే ఖాళీచేసి వేరే చోటుకు తాత్కాలికంగా కార్యాలయాన్ని తరలించాల్సి ఉంది. కానీ తాత్కాలికంగా కార్యాలయం నిర్వహించటానికి భవనం లభించకపోవటం సమస్యగా మారింది. పాత మున్సిపల్ కార్యాలయాన్ని ఇవ్వాలి అని తహసీల్దార్ కోరగా దానికి కమిషనర్ సరైన రీతిలో స్పందించకపోవటంతో ఇక్కడే ఉండిపోయారు. ఉన్నతాధికారులు తక్షణమే తాత్కాలిక తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు భవనాన్ని చూసి నూతన భవన నిర్మాణం కోసం శ్రీకారం చుట్టాల్సి అవసరం ఎంతైనా ఉంది.

భారీ వర్షం.. పంటలకు నష్టం






పాలకవీడు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పగిడి వాగు, చింతగుంట్ల వద్ద నీట మునిగిన పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందుల
తర్లుపాడులో చెరువును తలపిస్తున్న పొలాలు, కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న దొంగలవాగు, ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్న సీఐ, ఎస్ఐ సిబ్బంది

- నీట మునిగిన పొలాలు
- ఆందోళనలో రైతులు
- దెబ్బతిన్న పైర్లను పరిశీలించిన ఎమ్మెల్యే కందుల
- నష్టం అంచనాల్లో అధికారులు నిమగ్నం

మార్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రకాశంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మార్కాపురం డివిజన్ వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ వర్షం కురిసింది. అన్నిచోట్లా సాధారణ వర్షపాతాన్ని మించి వందలరెట్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. చాలాచోట్ల వాగులు పొంగిపొర్లాయి. అంతేగాక మూడు రోజులుగా ముసురుపట్టి రోజూ వర్షం పడుతుండడంతో పలు పైర్లు నీటమునిగాయి. పత్తి, మిరప మోస్తారుగా దెబ్బతినగా కొన్నిచోట్ల వరి, మరి కొన్ని చోట్ల మెట్టపైర్లు కూడా చేతికి దక్కే పరిస్థితి లేదు. గుండ్లకమ్మ నదిలో ప్రవాహం పెరగడంతో పెద్దనాగులవరం వెళ్లే రహదారిలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామం వద్ద రహదారిపై నీరు ప్రవహిస్తుండంతో రూరల్ పోలీసులు దగ్గరుండి వాహనాలను అనుమతిస్తున్నారు. తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల్లో కూడా వాగులు పొంగడంతో కొన్నిచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నీటి మునిగి దెబ్బతిన్న పంట పొలాలను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వ్యవసాయ అధికారులతో కలసి పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యాన అధికారులు గ్రామాల్లో పర్యటించి పైర్లు దెబ్బతినకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. గడిచిన 24 గంటల్లో పొదిలి మండలంలో అత్యధికంగా 76.4 మి.మీ, మార్కాపురం పట్టణ, మండల పరిధిలో 57.2 మి.మీ, తర్లుపాడు మండలంలో 48 మి.మీ, కొనకనమిట్ల మండలంలో 37.8 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది.

పంట నష్ట పోయిన రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్ : అకాల వర్షానికి పంట నష్ట పోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. బోడపాడు, చింతగుంట్ల గ్రామాల్లో అకాల వర్షానికి నీట మునిగిన పంటలు, ఇళ్లను ఎమ్మెల్యే కందుల గురువారం పరిలించారు. బోడపాడు గ్రామంలో ఇళ్ల మధ్య నిలిచిన వాన నీటిని పరిశీలించారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామస్థులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలన్నారు. దెబ్బతిన్న పత్తిని ఏడీఏ బాలాజీ నాయక్, ఏవో బుజ్జిబాయితో కలిసి క్షేత్ర స్థాయితో పరిశీలించారు. నియోజకవర్గంలో 8వేల ఎకరాల్లో పత్తి, 3వేల ఎకరాల్లో మిరపకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనాలు వేసినట్లు తెలిపారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి పంట నష్టం వివరాలను తెలియజేసి, ఆదుకుంటామని ఎమ్మెల్యే కందుల హామీ ఇచ్చారు.

కొండేపల్లి రోడ్డులో గుండ్లకమ్మ నుంచి మార్కాపురం చెరువుకు చేరే కెనాల్‌ను పరిశీలించి నీరు లీక్ అవకుండా కెనాల్ ద్వారా చెరువుకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, బోడపాడు టీడీపీ నాయకులు బొగ్గు శేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. మండలంలోని వేమలకోట వద్ద వాగు పొంగింది. మార్కాపురం కంభం రహదారిపై ప్రవహిస్తోంది. రూరల్ ఎస్ఐ అంకమ్మరావు సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి వాహనదారులకు జాగ్రత్తలు చెప్పారు.

పెద్దారవీడు : మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం రాత్రి వర్షం భారీగా కురిసింది. దీంతో సాగు చేసిన పంటలన్నీ దాదాపు నీట మునిగాయి. మిరప, పత్తి పొలాల్లో నీరు చేరింది. మండలంలో మొత్తం సాగు చేసిన 12,000 ఎకరాలలో మిరప 4,189 ఎకరాలు, పత్తి 3726 ఎకరాలు సాగు చేశారు. మిగిలిన 8 రకాల పంటలు మరో 2 వేల ఎకరాలు సాగు చేశారు. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు పత్తి, మిరప, పొగాకు చేలన్నీ నీట మునిగాయి. ముఖ్యంగా పెద్దారవీడు, పుచ్చకాయలపల్లి, గొబ్బూరు రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ పరిస్థితి అధికంగా కనబడుతోంది. వర్షాలతో సాగుచేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వానలు ఇంతటితో ఆగితే కొంతమేరైనా పంటలు చేతులకందుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పత్తి పొలాలలో నిల్వ ఉన్న వర్షపునీటి కారణంగా ఇప్పటికే 2250 ఎకరాల పత్తి నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. వర్షం పూర్తిగా నిలిచిన తర్వాత అధికారులు పంట పొలాలను సందర్శిస్తే ఏ పంట ఎంతమేర నష్టం వాటిల్లిందన విషయం తేటతెల్లమౌతుంది.



పెద్దనాగులవరం సమీపంలోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద పరిస్థితి సమీక్షిస్తున్న ఎస్ఐ సైదుబాబు

పుచ్చకాయలపల్లి ఎస్సీ కాలనీలో వర్షపునీరు

పుచ్చకాయలపల్లి ఎస్సీ కాలనీలోకి వర్షపునీరు చేరింది. కాలనీలో లోతట్టు ఇళ్లలోకి చేరిన నీటిని ప్రజలు బిందెలతో ఎత్తిపోసుకునే పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో జాన్‌సుందరంలో కాలనీని సందర్శించి నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టారు. అదే విధంగా పెద్దారవీడు, పుచ్చకాయపల్లి గ్రామాల మధ్య ఉండే నల్లవాగులో వర్షపునీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. దీంతో కొన్ని గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి.

వాగులు ఉధృతం

రాచర్ల : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని పలు వాగులు, కుంటలు ఉధృతంగా ప్రవహిస్తూ పంటలు నీట మునిగాయి. చోళవీడు - అనుములపల్లి గ్రామాల మధ్య లోతువాగు, గౌతవరం - అనుములవీడు గ్రామాల మధ్య నక్కల వాగు, పాలకవీడు - సోమిదేవిపల్లి గ్రామాల మధ్య పగిడి వాగు, రాచర్ల- అనుములవీడు గ్రామాల మధ్య ఇటుకల బట్టి సమీపంలో నక్కల వాగులు భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో కంది, పొగాకు, పత్తి, మిరప, వరి తదితరవి నీట మునిగి రైతులకు తీవ్రంగా నష్టం జరిగింది. మండల రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి ప్రవహిస్తున్న వాగుల వద్ద ప్రజలకు నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. పాలకవీడు పగిడి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో టీడీపీ నాయకులు నల్లబోతుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. అనుములవీడు పంచాయతీ కార్యదర్శి టి గణేష్, వీఆర్వో బీ కిషోర్‌కుమార్, వీఆర్ఏ జి క్రాంతి దీపక్ ప్రజలు వాగుల వద్దకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఎస్ఐ కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

మండలంలో 85.4మి.మీ వర్షపాతం నమోదు

బుధవారం నుంచి కురిసిన భారీ వర్షాలకు మండలంలో 85.4మి.మీల వర్షపాతం నమోదయిందని మండల అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్‌వో) షేక్ మున్వర్ తెలిపారు.

సగిలేరుకు వరద

గిద్దలూరు టౌన్ : వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పలు పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, పత్తి, మిరప, టమాటా సాగులో ఉన్న పొలాల్లో ఎక్కువ నీరు నిలబడి పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతున్నది. నల్లమలలో కురుస్తున్న వర్షాలకు సగిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధ, గురువారాలలో సుమారు 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రవహించిన దొంగలవాగు, తీగలేరు

రాకపోకలు బంద్

పెద్ద దోర్నాల : భారీ వర్షాలకు మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే కడపరాజుపల్లె చెరువు మినహా మిగిలిన చెరువులన్నీ నిండుకుండల్లా జలకళను సంతరించుకున్నాయి. బుధవారం నుంచి కురుస్తున్న ముసురుకు దొంగలవాగు కర్నూలు-గుంటూరు రహదారిపై కొత్తూరు వద్ద ఉన్న చిన్న చప్టాపై ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నల్లమల నుంచి వరద నీరు ఎగువ చెర్లోపల్లి చెరువు అలుగు ద్వారా బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తుండడంతో చిలకచెర్ల, చెరువుగూడెం, చెర్లోపల్లి గ్రామాల ప్రజలు బయటి ప్రాంతాలకు రాలేకపోయారు. తీగలేరుకు వరద చేరి గంటవానిపల్లె బ్రిడ్జిపై నుంచి పారడంతో రాకపోకలు స్తంభించాయి. చిన్నదోర్నాల వద్ద బ్రిడ్జిపై ప్రహిస్తుండడంతో రాకపోకలు నిలిపోయాయి. మిరప, పత్తి దెబ్బతినే స్థాయికి చేరుకున్నాయి.

విద్యార్థులు చట్టాలను తెలుసుకోవాలి

రాచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలని ఎస్ఐ పీ కోటేశ్వరరావు అన్నారు. పోలీసుల వారోత్సవాలలో భాగంగా గురువారం పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు చట్టాలు, పోలీసు వ్యవస్థపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం పోలీ ఆయుధాల వినియోగాన్ని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనాలతో జాగ్రత్త

కంభం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో తరగతి గదులు శిథిలావస్థలో ఉన్న చోట అప్రమత్తంగా ఉండాలని ఎంఈవో అబ్దుల్ సత్తార్ తెలిపారు. గురువారం మండలంలోని కందులాపురం ఉన్నత పాఠశాలను ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సదరు పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న తరగతి గదిని పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాడుబడిన, శిథిలావస్థలో తరగతి గదులు ఉన్న చోట అప్రమత్తంగా ఉండాలని, గది పరిసరాలలో విద్యార్థులు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ మురళీమోహన్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

'మంచి కార్యకర్తను కోల్పోయింది'

రాచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీ ఒక మంచి కార్యకర్తను కోల్పోయిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. రాచర్ల గ్రామానికి చెందిన షేక్ అచ్చుకట్ల ఖాశింవలి (49) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఆయన రాచర్ల గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్, స్థానిక నాయకులు పి సనావుల్లా ఖాన్, ఎస్.కల్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.



ఖాశింవలి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి





ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

చెత్తను తొలగించండి

రాచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఉన్న చెత్తాచెదారాలను తొలగించి వ్యాధులు సోకకుండా చూడాలని విద్వాన్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. రాచర్ల - అనుములవీడు గ్రామాల మధ్య వెలిగొండ ప్రాజెక్టు కాలువ వద్ద వ్యర్థాలు వేశారని, అవి కుళ్లి తీవ్రమైన కంపు కొడుతోందని, చెత్త పాఠశాలవైపు వస్తోందని తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో వెంటనే చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించాలని పంచాయతీ కార్యదర్శి ఎంవి నాయక్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపడీవో ఐ వెంకటేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన



బీపేటలో రైతులకు సూచనలిస్తున్న ఏవో

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలను ఏవో కే నీరజ గురువారం పరిశీలించారు. గురిజేపల్లి, గోళ్లవిడిపి గ్రామాల్లో పత్తి, మిరప, మొక్కజొన్న, కంది పైర్లను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పొలాల్లో వరద నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు.

వానలతో జాగ్రత్త

బేస్తవారపేట : వర్షాలకు రైతులు జాగ్రతుల తీసుకొవాలని వ్యసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, అలాగే మండలంలో మరి కొన్ని గ్రామాల్లో మిర్చి పొలాలను ఉద్యాన అధికారి డి.శ్వేత పరిశీలించారు. వాన నీరు పొలాల్లో నిల్వ లేకుండా చూడాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెద్ద దోర్నాల : వర్షాలకు పంటలు నష్టపోకుండా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో జవహరలాల్ నాయక్ సూచించారు. కటకానిపల్లె, చిన్నదోర్నాల గ్రామాల్లో సాగులో ఉన్న పత్తిని ఏవో పరి శీలించారు. పొలాల్లో నిలిచి ఉన్న నీటిని బయటకు పంపించాలని, వా నలు తగ్గాక ఎకరానికి 20కేజీల యూరియా, 25కేజీల పొటాష్ ఎరువును వేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ రాజేంద్రప్రసాద్, శిరీష పాల్గొన్నారు.

రాచర్ల : పసుపు, బొప్పాయి పంటల్లో సాగు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన అదికారి డీ సాయిశ్వేత అన్నారు. మండలంలోని గంగంపల్లిలో గురువారం ఆమె బొప్పాయి, పసుపు పంటలను పరిశీలించారు. అధిక వర్షాలు వలన పంట పొలాల్లో ఉన్న వర్షపు నీటిని బయటకు పంపించి రెండు, మూడుసార్లు పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని వారం వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని 15 రోజులు రెండు సార్లు పిచికారీ చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయన్నారు. నేల ఆరిన తర్వాత మొక్క బాగా పెరగానికి ఎకరాకు 50కిలోల యూరియా, 40కిలోల ఎంవోపీ, 250కిలోల వేపపిండి ఎరువులను వేయాలన్నారు. బొప్పాయి మొక్క పసుపు రంగులో ఉంటే రీడోమిల్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ సూచనలు పాటించాలని ఆమె తెలిపారు.

రెండు కార్లు ఢీ.. ఒకరికి గాయాలు

పెద్ద దోర్నాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు కార్లు ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన ఉర్దూ పాఠశాల సమీపంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో నంద్యాల జిల్లా శ్రీశైలంకు చెందిన రాజశేఖర్ రెడ్డి గాయపడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు వైపు నుంచి కారు శ్రీశైలం వెళ్తుండగా లగేజి ఆటో శ్రీశైలం నుంచి గుంటూరు వైపు వస్తుండగా జంక్షన్ పాయింటు వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన రాజశేఖర్‌రెడ్డి గాయపడ్డారు.

అప్రమత్తంగా ఉండాలి



వాటర్ ట్యాంకులను పరిశీలిస్తున్న కమిషనర్

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కురుస్తున్న వర్షాల పట్ల మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ నారాయణరావు సూచించారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు మంచి నీటి సరఫరా జరిగే ట్యాంకులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలు ఎదుర్కొనే సమస్యలు ఎప్పటికప్పుడు తీర్చాలని, రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీటి సరఫరా జరిగే ట్యాంకులలో క్లోరినేషన్ జరిపి సకాలంలో నీరు విడుదల చేయాలన్నారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వర్షాల నేపథ్యంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. నీటి సరఫరా, పారిశుధ్యం, వీధిదీపాల అంతరాయంపై 9966339599 ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 8474009441 మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 వరకు, 996662515 నెంమర్‌కు రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు కాల్ చేసి సమస్యలు తెలపాలన్నారు.

అవార్డ్‌ను సాధించడం గర్వకారణం

రాచర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎద్యు ఐకాన్ అవార్డ్‌ను సాధించడం గర్వకారణంగా ఉందని స్పందన విద్యా సంస్థల ఎండీ పీ సుధీర్ కుమార్‌రెడ్డి అన్నారు. విద్యారంగంలో తాము చేస్తున్న కృషి వలన నేషనల్ ఎడ్యుకేషన్ ఈవెంట్‌లో భాగంగా తమ సంస్థకు అవార్డ్ లభించిందని గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ఆధ్వర్యంలో విశాఖ నగరంలో జరిగిన కార్యక్రమంలో విద్యారంగంలో తమ కృషిని గుర్తించిన సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. విశాఖ ఎంపీ, గీతం వర్సిటీ అధినేత ఎం.భరత్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. అవార్డు సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయ సిబ్బందికి, విద్యార్థులకు సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



విశాఖ ఎంపీ భరత్‌నుంచి అవార్డును అందుకుంటున్న సుధీర్

కోరం లేక మండల సమావేశం వాయిదా

పీసీపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదా పడింది. గురువారం ఎంపీపీ జషన్య అధ్యక్షతన సమావేశం జరగాల్సి ఉండగా, నిర్ణయించిన సమయానికి మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు హాజరుకాలేదు. ఎంపీపీతో కలిపి 11మంది సభ్యులు ఉండగా, కేవలం మురుగుమ్మి, నేరేడుపల్లి, చింతగుంపల్లి ప్రాదేశికాల సభ్యులు మాత్రమే హాజరయ్యారు. అనారోగ్య కారణాలతో ఎంపీపీ సమావేశానికి హాజరు కాలేదు. సమావేశం నిర్వహించాలంటే కనీసం నలుగురు సభ్యులైనా హాజరుకావాలి. సభ్యులు తగిన సంఖ్యలో హాజరు కాకపోవడంతో ఎంపీడీవో జీవీ కృష్ణారావు సమావేశాన్ని శుక్రవారానికి వాయిదా వేశారు.

సీపీఎం నిరసన

పామూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. ఐదు సంవత్సరాలుగా రోడ్డు అధ్వానంగా ఉన్నా గత వైసీపీ, నేటి కూటమి పాలకులు పట్టించుకోకపోవడంపై సీపీఎం నేతలు గురువారం వరినాట్లు నాటుతూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు సయ్యద్, ఖాదర్ బాషా, కె.మాల్యాద్రి, గౌస్ బాషా, సీహెచ్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పీసీపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, లైంగిక వేధింపులు నివారించడంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో జరిగిన ఈపోటీలను ఎస్ఐ జి.కోటయ్య పరిశీలించారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అగ్గితెగులు నివారణ చర్యలు చేపట్టాలి

పామూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు కంది, వరి, మినుము పైర్లకు తెగుళ్ల ఆశించి ఉంటాయని, తక్షణమే నివారణ చర్యలు తీసుకోవాలని ఏవో టి.అబ్రహాం లింకన్ అన్నారు. గురువారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో సాగులో ఉన్న కంది పంటను పరిశీలించారు. మండలంలో కంది 4250, మినుము 46,వరి 26 ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. వరిలో అగ్గితెగులు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి షేక్ రసూల్, రైతులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

» మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బందితో డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేయించారు. పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీలోనూ పర్యటించి పారిశుధ్య పనులు చేయించారు. ఇళ్ళ మధ్య ఫాగింగ్ చేయించి బ్లీచింగ్ చల్లించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇంజనీరింగ్, ప్రజారోగ్య సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒంగోలు బస్టాండు, గార్లపేట రోడ్డు, ఎంఎస్ఆర్‌రోడ్డు, బాదుల్లావారివీధిలలో కూటమి నేతలతో కలసి పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. బీసీ కాలనీ, బొగ్గులగొంది కాలనీల్లో పర్యటించి వర్షపు నీటి నిల్వలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, జంషీర్ అహ్మద్, ఏఈ కోటేశ్వరరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


కనిగిరిలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మోపాడు రిజర్వాయర్‌లో పెరిగిన నీటిమట్టం

పామూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షంతో మండలంలోని మోపాడు రిజర్వాయర్‌కు రెండు అడుగులమేర నీరు చేరింది. వర్షానికి ముందు 9 అడుగులమేర నీటిమట్టం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీఎస్‌పురం మండలంలోని భైరవకోన, డొక్కలవాగు, పామూరు మండంలోని వగ్గంపల్లి వద్ద ఉన్న నాసవాగు, మన్నేరు వాగుల్లో నీరు ప్రవహిస్తుండటంతో రిజర్వాయర్‌లోకి రెండు అడుగులమేర నీరు చేరింది. దాంతో 11 అడుగులకు చేరింది. ఆయకట్టులో వరి సాగు చేయడానికి కనీసం 20 అడుగుల మేరనీటి మట్టం ఉంటేగాని ఇరిగేషన్ అధికారు లు నీటిని విడుదల చేస్తారు. ఈవర్షాలకు నాలుగు సంవత్సరాల అనంతరం మండలంలోని సిద్దవరం, బోడవాడ, రేణిమడుగు చెరువులు అలుగు పారుతున్నాయి. ఈనీరు వాగుల ద్వారా రాళ్లపాడు రిజర్వాయర్‌కు చేరు తుంది.


పామూరు: అలుగు పారుతున్న బోడవాడ చెరువు

ఈదర వాగుపై రాకపోకలు నిలిపివేత

ముండ్లమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మారెళ్ళ, జమ్మలమడక మధ్యగల ఈదర వాగుకు వర్షపు నీరు రావటంతో ప్రమాదం పొంచి ఉంది. దీంతో పోలీసులు, రెవె న్యూ అధికారులు ముందుజాగ్రత్తగా గురువారం రాకపోకలు నిలిపివేశారు. వాగు వద్ద నీరు తగ్గేవరకు పోలీసులను కాపాలా ఉంచారు. రాత్రుల సమయాల్లో వాగుల్లోకి దిగవద్దని అధికారులు సూచించారు. వాగు వద్ద ముం డ్లమూరు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ దాసు, సిబ్బంది కాశిరాజు, వీఆర్‌వో గురవయ్య పర్యవేక్షిస్తున్నారు.

వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ముం డ్లమూరు - వేంపాడు మధ్య చిలకలేరు వాగు, ఈదర -పొప్పూడి వారిపాలెం మధ్య వాగు, మారెళ్ళ - జమ్మలమడక మధ్య వాగుల వద్ద రాత్రుల సమయాల్లో వీఆర్‌వోలు, వీఆర్ఏలను నియమించినట్లు చెప్పారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రజాప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 62మంది లబ్ధిదారులకు రూ.44,07875 సీఎం సహాయనిధి చెక్కులను మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావుతో కలిసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదల వైద్యం కోసం అడిగిన వెంటనే దయార్థహృదయంతో సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రంలో దూసుకుపోతుందన్నారు. పరిశ్రమలు వెల్లువలా వస్తున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక వేత్తలు లక్షలాది కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించటమే ఇందుకు నిదర్శనమన్నారు.

అయితే, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను అడ్డుకునేందుకు జగన్ అండ్ కో బ్యాచ్ కుట్రలు చేస్తుందని డాక్టర్ లక్ష్మి ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి లోకేష్ విదేశాలు పర్య టించి పెట్టుబడులను రాష్ట్రానికి రప్పిస్తున్నారని చెప్పా రు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్పు కోలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ కుట్రలను, తప్పుడు ప్రచారాలను ప్రజలు గమనిస్తున్నారని, తగు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.


సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, నారపుశెట్టి పాపారావు తదితరులు

పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి

వర్షాలకు పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వ్యవసాయాధికారులను సూచించారు. గురువారం దర్శిలోని ఆమె నివాసంలో ఏడీఏ బాలాజీనాయక్, వ్యవసాయాధికారులతో పంటల పరిస్థితిపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన సూచనలు ఇచ్చి పంటలకు నష్టం జరగకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో టెక్నికల్ ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెస్పీ ఇన్‌చార్జి ఈఈగా విజయలక్ష్మి

దర్శి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దర్శి ఎన్నెస్పీ డివిజన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా యు.విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె త్రిపురాంతకం డీఈఈగా పనిచేస్తున్నారు. ఇక్కడి ఈఈ ఉద్యోగవిరమణ పొందారు. దీంతో ఆస్థానంలో విజయలక్ష్మిని ఇన్‌చార్జ్ ఈఈగా నియమించారు. ఈమేరకు బాధ్యతలు చేపట్టిన ఆమె మాట్లాడుతూ అన్ని ప్రాంతాల రైతులకు సక్రమంగా సాగునీరు అందేలా కృషి చేస్తామన్నారు. నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు సాగు నీటి పంపిణీకి సహకరించాలని ఆమె కోరారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న విజయలక్ష్మి

ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో

పీసీపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో జీవీ కృష్ణారావు పరిశీలించారు. విద్యార్థినుల ఆధార్ నవీకరణ, కొత్త నమోదు ప్రక్రియలను పరిశీలించారు. నిర్దేశించిన సమయానికి విద్యార్థినులందరూ ఆధార్ అప్‌డేట్ చేయించుకునేలా చూడాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిణి సుజాతకు సూచించారు.

రైతులకు ప్రయోజనకరంగా పంట కుంటలు


చిన్నగుడిపాడులో పంట కుంటలో చేరిన వర్షపు నీరు

దొనకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పంట కుంటలు రైతులకు ప్రయోజనకరంగా ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట కుంటల్లోకి వర్షపు నీరు చేరింది. దొనకొండ మండలానికి 122 పంట కుంటలు మంజూరయ్యాయి. పలు గ్రామాల్లో ఇప్పటికే 75 కుంటలు తవ్వారు. వర్షం నీరు వృథా కాకుండా నేరుగా ఈ కుంటల్లోకి చేరే విధంగా పనులు చేపట్టారు. వర్షపు నీటిని ఆదా చేయటం ద్వారా భూగర్భజలాలను పెంపొందించడంతోపాటు సాగుకు నీటి వనరుల కొరత లేకుండా ఉండేందుకు ప్రభుత్వం వీటి నిర్మాణాలను చేపట్టింది.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దర్శి విద్యార్థి ఎంపిక

దర్శి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దర్శి కాటంరాజు జూనియర్ కాలేజీలో విద్యను అభ్యసిస్తున్న జి.వినయ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. సింగరాయకొండలో జిల్లాస్థాయిలో జరిగిన అండర్ 19 ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వి.నారాయణ, డైరెక్టర్ డాక్టర్ పెద్దిరాజు ఆయనను అభినందించారు.


వినయ్

మౌలిక సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మౌలిక సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఎం నాయకుడు ఊసా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సీఎస్‌పురం మండలం అరవేములలో జరిగిన ఆపార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో శ్మశాన వాటికను సర్వేచేసి హద్దులు ఏర్పాటుచేసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గతంలో రెవెన్యూ అధికారులను కోరినట్లు చెప్పారు. ఇప్పటివరకు అధికారులు పట్టించుకోలేదన్నారు. సమావేశంలో మారం రెడ్డి రత్నారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాలు చెల్లించనివారిని ఇబ్బందులు పెట్టొద్దు!

కనిగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో వివిధ బ్యాంకులు, మీ సేవా కేంద్రాలు, ఫైనాన్స్ సంస్థలు ఇచ్చిన రుణాలను చెల్లించని వారిని ఇబ్బందులు గురి చేయవద్దని సీఐ ఖాజావలి అన్నారు. గురువారం రాత్రి స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాలు రికవరీచేసే క్రమంలో రుణ గ్రహితలపై బెదిరింపులకు, వాగ్వివాదాలకు, దాడులకు పాల్పడుతు దుర్భాషలాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆవిధంగా వ్యవహరించటం చట్ట విరుద్ధమన్నారు. పట్టణంలోని ఆధార్ సెంటర్లలో, నెట్‌సెంటర్లలో ఆధార్ కార్డుతో డబ్బులు ఇచ్చేవిధానాన్ని బ్యాంకుల నిబంధనల ప్రకారమే నడుచుకోవాలన్నారు. సమావేశంలో ఎస్ఐ టి.శ్రీరాం, బ్యాంకుల లావాదేవీల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాజ్యమేలిన మద్యం మాఫియా

» ప్రజాప్రభుత్వంపై జగన్ విషప్రచారం
» టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ధ్వజం

కనిగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం మాఫియా రాష్ట్రంలో రాజ్యమేలిందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ధ్వజమెత్తారు. ప్రజల్లో రోజురోజుకు ప్రజాప్రభుత్వంపై పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక జగన్మోహన్‌రెడ్డి విష ప్రచారానికి కుట్ర పన్నారన్నారు. మద్యం కొనుగోలులో క్యూఆర్ కోడ్ స్కాన్ విధానంపై గురువారం పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం దుకాణాల వద్దకు వెళ్లి ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి కొనుగోలు చేయాలన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ హయాంలో తాడేపల్లి ప్యాలెస్ లోనే కల్తీ మద్యం ఫార్ములా తయారైందని ఆరోపించారు. జగన్ చేసిన అవినీతి అక్రమాలకు అంతేలేకుండా పోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మద్యం తయారీ కంపెనీలను జగన్ గుప్పిట్లో ఉంచుకుని జేబ్రాండ్లు తయారీచేసి ఎంతోమంది ప్రాణాలను బలిగొన్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో లిక్కర్ మాఫియా రూ.3500 కోట్లు దోచుకున్న విషయం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి జగన్మోహన్‌రెడ్డి మరో కొత్త నాటకానికి పథక రచన చేశారన్నారు. ప్రజలు గుణపాఠం చెప్పినా అధికార దాహం ఇంకా జగన్‌కు తీరలేదని ఎద్దేవా చేశారు. ప్రజాప్రభుత్వంలో అవినీతి, అక్ర మాలకు తావుండదని ఫిరోజ్ పేర్కొన్నారు. కల్తీ లేకుండా నాణ్యమైన మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుడిపాటి ఖాదర్, బుల్లా బాలబాబు, చిలకపాటి లక్ష్మయ్య, నజిముద్దీన్, ఏనుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మద్యం షాపు వద్ద బార్‌కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రేణులు

రైతుల కష్టం వర్షార్పణం

వెలిగండ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షం రైతులను నిండా ముంచింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు వర్షార్పణం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని రాళ్ళపల్లి మోటుపల్లి, వెలిగండ్ల, గోకులం, ఇమ్మడిచెరువు, జాళ్లపాలేం, తదితర గ్రామాల్లో 980 హెక్టార్లలో సజ్జ సాగు చేశారు. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి సజ్జ కంకులు తడిసి మొలకలు వచ్చాయి. కొంతమంది రైతులు కోసిన సజ్జ పంట తడవకుండా పొలాల్లో పట్టలు కప్పారు. అయినప్పటికీ కంకులు తడిచి మొలకలు రావడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా, వర్షానికి దెబ్బతిన్న సజ్జ పంటను వ్యవసాయాధికారి టి.శిల్ప గురువారం పరిశీలించారు. పంట నష్టం అంచనాను ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. 980 హెక్టార్‌లో సజ్జ పంట రైతులు సాగు చేశారు. అందులో 801 హెక్టార్లలో నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనాలను ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు.


మొలకలు వచ్చిన సజ్జ కంకులు

టీడీపీ నేత కొండారెడ్డికి నివాళి

తాళ్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శాగం కొండారెడ్డి మరణం పార్టీకి తీరనిలోటని నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ లలిత్‌సాగర్ అన్నారు. గురువారం మండలంలోని వెలుగువారిపాలెం గ్రామంలో కొండారెడ్డి సంస్మరణ సభ జరిగింది. శాగం చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కొండారెడ్డి భార్య, కుమార్తెలను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మానం రమేష్‌బాబు, బి.ఓబుల్ రెడ్డి, రమణారెడ్డి, ఆర్.వెంకట్రావు, నాగిరెడ్డి, రామయ్య, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.


కొండారెడ్డి చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న గొట్టిపాటి లక్ష్మి, నారపుశెట్టి పాపారావు

పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపాలి

పామూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పొలాల్లో నిలిచిన నీటిని బయ టకు పంపాలని ఉద్యాన అధికారి కె.కుసుమ రైతులకు సూచించారు. మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో గురువారం బత్తాయి, మిరప, కూరగాయల తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షాలకు పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపించాలన్నారు. పంటలు ఉరకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే తేరు కోవడానికి లీటరు నీటిలో పది గ్రాముల యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో 2 సార్లు పిచికారి చేయాలన్నారు.

రేగులచిలుకలో గ్రామసభ

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం రేగులచిలుక సచివాలయంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా 123 మంది రైతులు తమ భూములకు సంబంధించిన ఆధారాలను అందజేశారు. రైతులకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి సమగ్ర నివేదికను జేసీకి పంపుతామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

వైభవంగా గ్రామోత్సవం

ముండ్లమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని రజక వీధిలో నూతనంగా నిర్మించిన వీర్లంకమ్మ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.




పర్చూరు వద్ద మిర్చి పొలంలో నిలిచిన వర్షపు నీరు


కర్లపాలెం : చింతాయపాలెం వద్ద గాలులకు రోడ్డుపై పడిన తాడిచెట్టు


వేమూరు: వర్షపు గాలులకు పడిపోయిన వరి పైరు


బాపట్ల : కొత్తనందాయపాలెం వద్ద మిరపతోటలో నిలిచిన వర్షపునీరు.


చీరాల పాపరాజు తోటలోని ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

రైతుల ఆశలపై.. కుండపోత

అల్పపీడన ద్రోణి ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతు న్నాయి. వర్షాలు పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. నీరు నిలిచి పంటలు ఉరకెత్తుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన వరి పంటపై వానలు విరుచుకుపడడం దిగుబడులపై ప్రభావం చూపుతుం దని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరితో పాటు మొక్కజొన్న, పత్తి పంటలకు వానలు ప్రతికూలంగా మారనున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై.. రోడ్లు కాల్వలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా డెల్టా ప్రాంతమైన లంక గ్రామాల్లో వర్ష ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. కలెక్టర్లు అధికా రులతో సమీక్షలు నిర్వహించి ముందస్తు రక్షణ చర్యల పై చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయానికి కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి.. హెల్ప్‌లైన్ నం బర్లను అందు బాటులో ఉంచారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులు తుపాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు.

- అల్పపీడన ద్రోణితో ఎడతెరిపిలేని వర్షం
- స్తంభించిన జనజీవనం..రోడ్లన్నీ జలమయం
- వరి, పత్తి పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం
- హార్బర్‌లో రెండో రోజూ కొనసాగిన ప్రమాద సూచిక

(బాపట్ల, చీరాల, పర్చూరు, రేపల్లె, ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గురువారం కుండపోతగా వర్షాలు కురిశాయి. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు విరామం ఇవ్వకుండా పడుతున్న వర్షంతో.. జనజీవనం స్తంభించిపోయింది. తెల్లవారుజాము నుంచి వర్షం వదలకుండా రాత్రి వరకు పడుతూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వాన కురిసింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరి సాగు చేపట్టిన రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వర్షానికి లోతట్టు ప్రాంతాలే కాకుండా, మెరక ప్రాంతాలకూ ముంపు తప్పలేదు. పల్నాడు జిల్లా పరిధిలో కూడా గురువారం ఓ మోస్తరు నుంచి భారీగానే వర్షాలు పడ్డాయి. దీంతో వాగులు పొంగి ప్రవహించాయి. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. పదిహేను రోజుల్లో కోతకు రానున్న తరుణంలో ఈదురు గాలులతో కూడిన వర్షంతో వరి నేలవాలింది. నోటి దాకా వచ్చిన పంట నీటిపాలవుతుందనే వేదన రైతుల్లో నెలకొంది. జూన్, జూలైలో మేఘాలు ముఖం చాటేసిన తరుణంలో విపరీతమైన ఎండలు కాశాయి.. దీంతో ఏ పైరును సాగు చేయలేకపోయారు. ఇప్పుడు వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరి, పత్తి చేలల్లో వర్షపు నీరు చేరింది. లేత పత్తిలో (మిగతా 8వ పేజీలో)


ఉధృతంగా ప్రవహిస్తున్న పర్చూరు వాగు

నష్టం జరగకుండా ముందస్తు చర్యలు



భారీవర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం మండల, గ్రామస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ చెరువుల వద్ద అధికారులను నియమించాలన్నారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన 42 మంది జాలర్లను సురక్షితంగా తిరిగి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలన్నారు. అత్యవసర పరిస్థితులలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08643-220226 కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు.

★ రేపల్లె: నిజాంపట్నం హార్బర్‌లో రెండో రోజు గురువారం మూడో నంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణమే ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో.. వేట చేసే పరిస్థితి లేక మత్స్యకారులు తిరుగుప్రయాణమై హార్బర్‌కు చేరారు. ఈదురు గాలులతో కూడిన భారీవర్షం పడుతుండటంతో అలల ఉధృతి ఎక్కువగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.



విధులు సమర్థంగా నిర్వహించాలి

- పోలీసు కార్యాలయంలో ఎస్పీ తనిఖీలు

బాపట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బంది విధులను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వర్తించాలని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏ, బీ, పీ సెక్షన్లు, డీపీవో


పోలీసు కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

స్టోర్, మెసేజ్ సిస్టమ్‌రూమ్, సర్వీస్‌బుక్ రూమ్, రికార్డు రూమ్‌లను పరిశీలించిన ఎస్పీ ఒక్కొక్క విభాగం పనితీరును సంబంధితాధికారులను అడిగి తెలుసుకున్నారు. డీపీవోకు సంబంధించిన ఫైల్స్ పెండింగ్‌లో లేకుండా సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. డీపీవో సిబ్బంది వారి సెక్షన్లలో విధులు సక్రమంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఎస్‌సీఆర్‌బీ, ఎన్‌సీఆర్‌బీ, హ్యూమన్‌రైట్స్, ఎస్సీ, ఎస్టీ, మహిళా కమిషన్ తదితరాల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. విధుల్లో అలసత్వం వహించిన, ఫైల్స్ త్వరగా పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉంచినా సంబంధిత ఉద్యోగులపై శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస రావు, ఎస్‌బీ సీఐ నారాయణ తదితరులు ఉన్నారు.

జిల్లాలో 83 ఆధార్ కేంద్రాలు

జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి విజయలక్ష్మి

బాపట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వార్డు సచివాలయాలలో 83 ఆధార్ సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నట్లు జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని వెదుళ్లపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని జిల్లా ఆధార్ కోఆర్డినేటర్ అశోక్‌బాబుతో కలిసి ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల బయోమెట్రిక్ అప్‌డేట్ పూర్తిగా ఉచితమన్నారు. 5 నుంచి ఏడేళ్ల, 15 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. జిల్లాలో 5-7 ఏళ్ల వయస్సు పిల్లలు 21,652 మంది, 15-17 ఏళ్ల వయస్సు విద్యార్థులు 14,536 మంది ఉన్నారన్నారు. వీరంతా తప్పనిసరిగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె కోరారు.


వెదుళ్లపల్లి ఆధార్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

జడ్పీలో.. జాప్యం



అద్దె బకాయిల వసూళ్లపై అధికారుల నిర్లక్ష్యం ● రూ.25 కోట్లున్నా వర్క్ ఆర్డర్ల కోసం పడిగాపులు

- ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా అలక్ష్యం

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణ నుంచి నిధులు వినియోగం వరకు అన్ని అంశాల్లో జాప్యం జరుగుతోంది. జడ్పీలో అత్యవసరంగా ఏ ఫైల్ కదలాలన్నా నెలలు పడుతోంది. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టించుకోవడంలేదు. ఇక్కడ ప్రతీ పని ఆలస్యమే అన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ మధ్య కాలంలో జరిగిన సంఘటనలపై పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా అధికారుల్లో స్పందన ఉండటంలేదు. ఈ నెల 29న సర్వ సభ్య సమావేశంలో ఆయా అంశాలపై చర్చ జరగనున్నట్లు తెలుస్తుంది. జడ్పీకి రూ.వేల కోట్లు విలువ చేసే ఆస్తులు ఉన్నాయి. అవి ఎక్కడికక్కడ అన్యాక్రాంతం అవుతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదు. పిడుగురాళ్ల మండలం తుమ్మల చెరువు సర్వే నెంబరు 251లో జడ్పీకి 2.71 ఎకరాల భూమి ఉంది. దానిని నామ్ ఎక్స్‌ప్రెస్ వే (టోల్‌గేట్) సంస్థ వాడుకుంటుంది. అందుకు 2013 నుంచి అద్దె చెల్లిస్తుంది. 2019లో ప్రభుత్వం మారిన తర్వాత అద్దె చెల్లింపులు ఆపేసింది. ఇప్పటికీ జడ్పీకి ఆ సంస్థ నుంచి రూ.12.64 లక్షలు అద్దె రావాల్సి ఉంది. వాటిని చెల్లించక పోగా భూమిని జిల్లా పరిషత్ ప్రమేయం లేకుండా సంస్థకు కేటాయిస్తూ జగన్ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దానిపై ఇటీవల గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై జడ్పీ అధికారులు కనీస దృష్టి సారించినట్లు కూడా కనిపించడంలేదు. ఇదే రీతిలో జడ్పీకి చెందిన భూముల ఆక్రమణలపై జారీ చేసిన నోటీసులు, కేసులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. ఆస్తుల పరిరక్షణకు జడ్పీ చైర్‌పర్సన్ కమిటీలు ఏర్పాటు చేసినా సదరు సమావేశాలు నిర్వహించడంలో యంత్రాంగం విఫలమవుతోందన్న విమర్శలున్నాయి.

నిధులు ఉన్నా.. పనులు సున్నా

ప్రభుత్వం జడ్పీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.25 కోట్లు కేటాయించింది. అయినా పనులు కేటాయించడం లేదని పలువురు జడ్పీటీసీలు వాపోతున్నారు. పాలక వర్గం ఆమోదం పొందిన తర్వాత వర్క్ ఆర్డర్లు ఇవ్వడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పనులకు సంబంధించిన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయంటున్నారు. పాలక వర్గం గడువు ముగుస్తున్నా పనులు కేటాయించడంలో అధికారులు ఈ రకంగా ప్రవర్తిస్తే ఎలా అన్నది కొందరు జడ్పీటీసీల వాదన. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాలకవర్గం, కొందరు ప్రజాప్రతినిధులకు మధ్య అగాథం ఏర్పడినట్లు తెలుస్తుంది. కేటాయించిన పనులకు సంబంధించి ప్రగతికి సంబంధించి నివేదికలు తెప్పించుకుని చేపట్టాల్సిన సమీక్షలపైనా నిర్లక్ష్యం కనిపిస్తోంది.

నేటి నుంచి సీనరేజ్ వసూళ్లు

చెక్‌పోస్టులను ఏర్పాటు చేసిన ఏఎంఆర్ ప్రతినిధులు


మల్లాయపాలెం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఏఎంఆర్ చెక్ పోస్టు

- ఆందోళనకు సిద్ధమైన గ్రానైట్ పరిశ్రమల యజమానులు

బల్లికురవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ సీనరేజ్ వసూళ్లకు రంగం సిద్ధమైంది. నెలకు రూ.47 కోట్ల చెల్లించేలా ప్రభుత్వంతో ఏఎంఆర్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో వారు పలు చోట్ల సీనరేజ్ వసూళ్ల కొరకు చెక్ పోస్టు బాక్సులను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎక్కడికక్కడ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల ద్వారా శుక్రవారం నుంచి ఏఎంఆర్ ప్రతినిధులు సీనరేజ్ వసూళ్లు చేయనున్నారు. అయితే గుంటూరు జిల్లాలో ఒకలా, బాపట్ల జిల్లాలో మరోలా సీనరేజ్ వసూళ్లపై గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో మాదిరిగానే సీనరేజ్ వసూళ్లు చేయాలని లేకుంటే ఆందోళన చేస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటికే బల్లికురవ మండలం వేమవరం, మార్టూరులో గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఏఎంఆర్ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. అయితే ఈ చర్చల్లో ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఒక్క సింగిల్ కట్టర్ ఫ్యాక్టరీకి రూ.35 వేల చొప్పున సీనరేజ్ వసూలు చేస్తామని చెప్పి ఆదనంగా మరో రూ. 35 వేలు చెల్లించాలనడం భావ్యం కాదని యజమానులు తెలిపారు. గుంటూరు జిల్లాలో రూ.27 వేలు మాత్రమే వసూళ్లు చేస్తున్నారని అదేమాదిరిగానే ఇక్కడ కూడా వసూలు చేయాలని లేకుంటే ఆందోళన చేస్తామని తెలిపారు.


బల్లికురవ మండలం వేమవరం వద్ద గ్రానైట్ ఫ్యాక్టరీలు

ఎరువులు అందుబాటులో ఉంచాలి

- బ్లాక్ చేసే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయశాఖ సమీక్షలో మంత్రి రవికుమార్

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవసరానికి సరిపడా యూరియా, డీఏపీ తదితర ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని వ్యవ సాయ శాఖ అధికారులతో గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాల యంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు, బ్లాక్ మార్కెట్ చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అవసర మైన మేర యూరియా, డీఏపీ తీసుకు వచ్చేందుకు సీఎం చంద్ర బాబు చర్యలు తీసుకుంటున్నారన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువుల విక్రయాలు పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఖరీఫ్, రబీ సీజన్లలో కేంద్రం నుంచి వచ్చే ఎరువులలో ప్రవేట్ వ్యాపారుల కంటే మార్క్‌ఫెడ్‌కు ఎక్కువ శాతం కేటాయించేలా కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. వర్షాలతో పంటలకు నష్టం లేకుండా అసవరమైన చర్యలను చేప ట్టాల న్నారు. సమావేశంలో డీఏవో సుబ్రహ్మణేశ్వరరావు, ఏడీఏలు ఏ ప్రాయిమ్, సుదర్శనరాజు, ఏవోలు వెంకటకృష్ణ, శ్రీనివాస రావు, రామ్మోహన రెడ్డి, సైదా, సుబ్బారెడ్డి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.


వ్యవశాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి రవికుమార్

కొత్తపేట ఎన్నికలు జరిగేనా?

- తీర్పు నేటికి వాయిదా వేసిన హైకోర్టు
- మొదటి రోజు నామినేషన్లు నిల్

కొత్తపేట(చీరాల), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేటపాలెం మండల పరిధిలోని మేజర్ పంచాయతీ కొత్తపేట ఎన్నికలు ప్రశ్నార్థకంగా మారాయి. రెండు రోజుల క్రితం ఎన్నికల సంఘం ఎన్నికలకు తేదీలు ప్రకటించింది. ఈ క్రమంలో గురువారం అధికారులు నామినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. పలు పార్టీల నేతలు నామినేషన్ సెట్లను అధికారుల నుంచి పొందారు. అయితే మొదటి రోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదని అధికారులు తెలిపారు. కాగా కొన్ని రోజులుగా కుండపోతగా వర్షం పడుతుందని, ఎన్నికల సమయం కూడా తక్కువగా ఇచ్చారని, ఎన్నికల నిర్వహణ అసాధ్యమంటూ గ్రామానికి చెందిన కొందరు గురువారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో స్వల్ప వాదోపవాదనల అనంతరం తుది తీర్పునకు శుక్రవారం వాయిదా పడింది. అయితే జరిగిన పరిణామాలను పరిశీలిస్తే దాదాపుగా ఎన్నికలు వాయిదా పడినట్లేనని స్పష్టమవుతోంది. అయితే ఎన్నికలపై న్యాయస్థానం ఏ విధంగా తీర్పు వెలువరిస్తోందో వేచి చూడాలి.

నేడు ఎమ్మెల్యే ఏలూరి పర్యటన

మార్టూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ కార్యక్రమాలలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం మార్టూరులో ఓ వైద్యశాల ప్రారంభోత్సవానికి హాజరవుతారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్‌పై అధికారులతో సమీక్ష, క్యాంపు కార్యాలయంలో 103 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేయనున్నారు. అనంతరం ఇంకొల్లు, చిన్నగంజాం మండలాల్లో పర్యటించనున్నారు.

నేడు వైదన చెరువులో చేపల పెంపకానికి వేలం

బల్లికురవ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైదన గ్రామ పంచాయతీలోని చిన్నచెరువు పెద్ద చెరువులలో చేపల పెంపకానికి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి బి. ప్రసాదరావు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించి నిబంధనలను తెలుసుకోవాలన్నారు. రెండేళ్ల కాలానికి వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొనే వారు దరావత్తుగా రూ. 8 లక్షల ముందుగా చెల్లించాలని కోరారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన బి.ఏ., బీకాం(జనరల్ కంప్యూటర్ అప్లికేషన్స్), బి.బి.ఏ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ ఎకనామిక్స్, బీఎల్ఐఎస్సీ కోర్సుల పరీక్షలకు సంబంధించి ఫలితాలను తాత్కాలిక రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, దూరవిద్య సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 4 లోపు దరఖాస్తు చేసుకోవాలని దూరవిద్య పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ నయ్యర్ జైనులాబ్దిన్ తెలిపారు. ఒక్కొక్క పేపరు రీ-వాల్యుయేషన్‌కు డిగ్రీ విద్యార్థులు రూ.770, పీజీ, ఎంఎల్ఐఎస్సీ విద్యార్థులు రూ.960 చెల్లించాలన్నారు. రీవాల్యుయేషన్ దరఖాస్తులను వచ్చే నెల 7లోపు విశ్వవిద్యాలయంలోని దూరవిద్య పరీక్షల సమన్వయకర్త అందజేయాలన్నారు. ఫలితాలను ఏఎన్‌యూడిఈడాట్ఇన్ అంతర్జాలం నుంచి పొందవచ్చన్నారు.

కారు, స్కూటీ ఢీ.. ఇద్దరు దుర్మరణం

వారిలో ఒకరు ప్రకాశం జిల్లా వాసి

తెలంగాణ రాష్ట్రంలో ప్రమాదం



ఆజేయాల మృతదేహం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెడికల్ బైపాస్ రహదారిలో గురువారం కారు, స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో పిట్టల సాన్విత(9), ఆజేయాల(37) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జిల్లాలోని చందుర్తి మండలం లింగంపూర్ గ్రామానికి చెందిన పిట్టల అంజయ్య, నీరజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఆదివారం పెద్ద కూతురు సాన్వితకు జ్వరం రావడంతో కోనరావుపేట మండలం నిమ్మపల్లిలోని పుట్టింటికి నీరజ తన ఇద్దరు కూతుళ్లను తీసుకొని వెళ్లింది. తిరిగి గురువారం ఇద్దరు కూతుళ్లతో కలిసి నీరజ తిమ్మాపూర్ వెళ్లేందుకు బయలుదేరింది. ఈక్రమంలో సిరిసిల్లలో తనకు తెలిసిన మేస్త్రీ ఆజేయాల కనిపించడంతో అతడి స్కూటీపై పెద్దకూతురును ఎక్కించి చిన్న కూతురితో కలిసి ఆమె ఆటోలో వెళ్లింది. ఇదేక్రమంలో బైపాస్ రహదారి వద్ద కెనస్టెన్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న స్కూటీని వేములవాడ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈప్రమాదంలో సాన్వితతోపా టు ప్రకాశం జిల్లా పెద్దదోర్నపల్లి మండలం వెంగయ్యపల్లికి చెందిన మేస్త్రీ మువ్వారపు ఆజేయాల(37) మృతి చెందారు. అంబులెన్స్‌లో వారిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

వైసీపీ హయాంలో ఒకటిన జీతాలు ఇచ్చారా?

మద్దిపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఏనాడైనా ఒకటవ తేదీ ఉద్యోగులకు జీతాలు ఇచ్చారా అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు ప్రశ్నించారు. గురువారం మద్దిపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల డీఏపై వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగులను బ్రాందీ షాపుల దగ్గర నిలబెట్టారని విమర్శించారు.

చోరీలకు పాల్పడుతున్న మహిళా దొంగ అరెస్టు

రూ.20లక్షలు విలువైన సొత్తు స్వాధీనం

నిందితురాలు వేరాలకు చెందిన మహిళ

వివరాలు వెల్లడించిన ఒంగోలు వన్‌టౌన్ సీఐ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగరాజు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికుల వద్ద బ్యాగ్ కట్ చేసి 20 సవర్ల బంగారం అపహరించుకెళ్లిన మహిళా దొంగను అరెస్టు చేసి సుమారు రూ.20 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ వైనాగరాజు చెప్పారు. గురువారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఆయన మాట లోనే... ఈనెల 1న టంగుటూరు మండలం నర్సిరెడ్డిపాలేనికి చెందిన పోతూరి సుమతి పర్చూరు వెళ్లేందుకు ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. బస్సు ఎక్కిన తరువాత బ్యాగ్‌ను పరిశీలించింది. అందులోఉన్న 20 సవర్ల బంగారం ఆభరణాలు కనిపించలేదు. ఎవరో బంగారాన్ని దొంగిలించారని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సీసీ పుటేజీ ఆధారంగా బాపట్ల జిల్లా చీరాల మండలం వేరాలకు చెందిన కంపద్వారకా ఆ చోరీ చేసినట్లు గుర్తించారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న మహిళ ద్వారకాను ఆదుపులోకి తీసుకొని విచారించి ఆమె వద్ద ఉన్న బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈకేసు చేధించి దొంగను పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ వై నాగరాజు, ఎస్సై కే శ్రీనివాసరావు, ఏఎస్సై కే సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు కే రామకృష్ణ జీ శాంతకుమార్, హెడ్‌కానిస్టెబుల్ పీ రవి, ఎం అనిల్, టెక్నీషియన్ వి.వెంకటేశం ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందించారని సీఐ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటండి

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఐదు మండలాలకు పార్టీ కొత్త అధ్యక్షుల నియామకం



ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులతో ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కొత్తగా ఎన్నికైన టీడీపీ మండల అధ్యక్షులందరూ కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. టీడీపీ కార్యాలయంలో గురువారం ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులను ఎరిక్షన్‌బాబు ప్రకటించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించేవారికి గుర్తింపు, పదవులు తప్పకుండా వరిస్తాయన్నారు. ప్రభుత్వ కృషిని, అభివృద్ధిని ప్రజలకు చేరవేయడంలో కార్యకర్తలు ఎంతకష్టపడితే అంత ఫలితం లభిస్తుందని చెప్పారు. ఎర్రగొండపాలెం టీడీపీ మండల అధ్యక్షుడిగా చిట్యాల వెంగళరెడ్డి, పుల్లలచెరువుకు పొట్ల గోవింద్, త్రిపురాంతకంకు మేకల వరాజు, దోర్నాలకు షేక్ మాబు, పెద్దారవీడు మండల అధ్యక్షునిగా మెట్టు శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎరిక్షన్‌బాబు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ముఖ్యనాయకులు దేవినేని చెలమయ్య, గొట్టం శ్రీనివాసరెడ్డి, శనగా నారాయణరెడ్డి, వయ్యావుల ప్రసాద్, కాకర్ల కోటయ్య, గొట్టం శ్రీనివాసరెడ్డి, వేగినాటి శ్రీను, తోట మహేష్, బీవీ సుబ్బారెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, చెవుల అంజయ్య పాల్గొన్నారు.

పారుదల లేని డ్రైయిన్లపై దృష్టి సారించండి

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ మించాల సాంబశివరావు

చీరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చీరాల పురపాలక సంఘం పరిధిలో పారుదల లేని డ్రెయినేజీలపై వెంటనే దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు చెప్పారు. మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో డ్రెయిన్లు నిండి రహదారుల్లోకి నీళ్లు చేరుతున్నాయి. గురువారం పలు వార్డుల్లోని డ్రెయిన్లను ఆయన మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. వెంటనే పారుదల చర్యలు చేపట్టాలు. చైర్మన్ వెంట ఏఈ రవికుమార్, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

చినగంజాంలో విస్తారంగా వర్షాలు



నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, ఏఈ

చినగంజాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండురోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై, కడవకుదురులోని ఆర్‌అండ్‌బీ రహదారిపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వేసిన వరి పంటకు వర్షంతో ప్రయోజనం చేకూరగా, కడవకుదురు ప్రాంతంలోని వంద ఎకరాల్లో పోసిన వరి నారుమడులు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పుగుండూరు రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే అండర్‌పాస్‌లో వర్షపునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అండర్‌పాస్ బ్రిడ్జిని తహసీల్దార్ జీవీ గుంట ప్రభాకరావు, ఎంపీడీవో కె.దావులక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ డి.రాజులు పరిశీలించారు. తహసీల్దార్ రైల్వే సిబ్బందితో మాట్లాడి, డీజిల్ ఇంజన్ల ద్వారా అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపునీటిని బయటకు పంపుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అండర్‌పాస్‌లోని వర్షపునీటిని ఇంజన్ల ద్వారా పూర్తిగా బయటకు పంపి పెదగంజాం గ్రామ పరిధిలోని ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసినట్లు తెలిపారు. రొయ్యల చెరువులకు కాలింగ్ సమస్య ఏర్పడుతున్నట్లు ఆక్వా రైతులు తెలిపారు.

రైతుల ఆశలపై.. కుండపోత

(5వ పేజీ తరువాయి)

వర్షపు నీరు నిలబడడంతో పొలాలు ఉరకెత్తే ప్రమాదం ఉందని, దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాలిపోయిన పైరును నిలబెట్టడానికి రైతులు శ్రమిస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు పడుతాయని ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులతో పాటు లోతట్టు ప్రాంతాల్లోని వారు ఆందోళన చెందుతున్నారు.

ఎడతెరిపిలేని వర్షాలు

- బాపట్ల జిల్లా పరిధిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు జలమయమయ్యాయి. పర్చూరు, ఇంకొల్లు ప్రాంతాల్లో వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేశవరపాడు - తిమ్మిరిపాడు మధ్య ఆలేరు వాగు, వంకాయలపాడు - పూసపాడు మధ్య కప్పల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తిమిరపాడు పరిధిలోని వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. కారంచేడులో పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. చీరాల పరిధిలో జాండ్రపేటలోని ఓ కాలనీని వర్షపు నీరు ముంచెత్తింది. దీంతో అక్కడ నివాసం ఉండే కుటుంబాలను పునరావస కేంద్రాలకు తరలించారు. అద్దంకిలో మొక్కజొన్నపై వర్ష ప్రభావం అధికంగా కనిపిస్తున్నది. బాపట్లలో కూడా పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని పొలాలు రేపల్లె, వేమూరు పరిధిలో కోతకు సిద్ధమైన వరి పైరు నేలకొరిగింది. దీంతో కంకుల్లో తాలు ఎక్కువగా వస్తుందని రైతులు బోరుమంటున్నారు. లంక గ్రామాల్లో మెట్ట భూముల్లో వేసిన మినుము పైరులోనూ వర్షపు నీరు భారీగా నిలిచింది. వర్షం దాటికి కూరగాయ పంటలు పూత, పిందె రాలిపోయాయి.

ఒంగోలుకు హైస్పీడ్ ట్రైన్..!

- **హైదరాబాద్ నుంచి చెన్నై వరకు**
- **గంటకు 320 కి.మీ వేగంతో దూసుకెళ్లే రైళ్లు అరంగేట్రం**
- **ఎలివేటెడ్ రైల్ కారిడార్‌కు డీపీఆర్ సిద్ధం**



హైస్పీడ్ బుల్లెట్‌ట్రైన్

ఒంగోలు కార్పొరేషన్ అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న హైస్పీడ్ బుల్లెట్ రైలు ఎట్టకేలకు రాష్ట్రంలోకి అడుగుపెట్టనుంది. ఈ మేరకు ప్రాజెక్టును చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ప్రతిపాదనలు, వివరాలను నిర్మాణ సంస్థ ఆయన రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్(రైట్స్) బుధవారం ప్రకటించింది. కాగా హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై మధ్య రెండు బుల్లెట్ ట్రైన్లు పట్టాలెక్కనుండగా, అందులో భాగంగా ఒకటి ఒంగోలులో ఆగనుంది. బుల్లెట్ ట్రైన్ గంటకు 320 కి.మీ. స్పీడుతో దూసుకెళ్లనుంది. ఇప్పటికే వందేభారత్ రైలు ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండగా, ఇకపై మరింత వేగంగా గంటల వ్యవధిలోనే వెళ్లే సమయం అతి త్వరలోనే రానుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా బెంగళూరు, చెన్నై వరకు వెళ్లేలా ప్రాజెక్టు రూపొందించారు. హైదరాబాద్-బెంగళూరు రైలు మొత్తం 626 కి.మీ ప్రయాణించనుండగా, తెలంగాణలో 230 కి.మీ, ఆంధ్రప్రదేశ్‌లో 300 కి.మీ, కర్ణాటకలో 96 కి.మీ నడవనుంది. హైదరాబాద్-చెన్నై వెళ్లే రైలు మొత్తం 705 కి.మీ ప్రయాణించనుండగా, తెలంగాణలో 180 కి.మీ, ఆంధ్రప్రదేశ్‌లో 464, తమిళనాడులో 61 కి.మీ ప్రయాణించేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. కాగా 2026 నాటికి డీపీఆర్ అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. ప్రాథమికంగా ఆంచనా వేసిన అధికారులు అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి, చెన్నై చేరనున్నట్లుగా రూట్ సిద్ధం చేశారు. ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వే అధికారుల ఈ ప్రాజెక్టు కోసం ఫైనల్ లోకేషన్ సర్వే ప్రారంభించారు.

రైలు మార్గం ఇలా..

హైదరాబాద్-చెన్నై రైలు హైదరాబాద్‌లోని శంషాబాద్, భరత్ సిటీ, ఏపీలోని దాచేపల్లి, నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి ఎయిర్‌పోర్టు మీదుగా చెన్నై ఔటర్ రింగ్‌రోడ్, చెన్నై స్టేషన్ మీదుగా 760 కి.మీల లైన్‌ను నిర్మించనున్నారు. ఈ లైన్ ఏపీలోని పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల మీదుగా చెన్నై చేరుతుంది. తద్వారా ఇటు హైదరాబాద్, అమరావతి రాజధానులు అనుసంధానం అవుతాయి. శంషాబాద్, తిరుపతి, చెన్నై ఎయిర్‌పోర్టులకు సులభతరంగా చేరుకునేందుకు కనెక్టివిటీ లభిస్తుంది.

ఫీడర్ కాలువ పనులకు రెండు కంపెనీలు టెండర్లు దాఖలు

- **సాంకేతిక బిడ్ పరిశీలించిన అధికారులు**
- **నెలాఖరుకు ఖరారు**

ఒంగోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనుల కోసం రెండు కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. ఆ పనుల కోసం ప్రాజెక్టు అధికారులు పిలిచిన టెండర్లకు సంబంధించిన సాంకేతిక బిడ్‌ను అధికారులు గురువారం పరిశీలించగా రెండు కంపెనీల వారు దాఖలు చేసిన విషయాన్ని గుర్తించారు. వచ్చే ఏడాది ఆగస్టుకు ప్రాజెక్టు తొలి దశ పూర్తి కోసం పట్టుదలతో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో తదనుగుణ చర్యలు జరుగుతున్న విషయం విదితమే. ఇందుకు సంబంధించి అత్యంత కీలకమైన ఫీడర్ కాలువ ఆధునీకరణ కోసం రూ 476 కోట్లు మంజూరు చేస్తూ గత నెల 22న ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. అందులో రూ 375 కోట్లతో ఫీడర్‌కాలువ మొత్తం 21.80 కి.మీ లైనింగ్, మూడు చోట్ల 5.20 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఈనెల తొలివారంలో అధికారులు టెండర్లు పిలిచారు. టెండర్ల దాఖలు సమయం బుధవారం ముగియగా నిబంధనల ప్రకారం గురువారం టెండర్లకు సంబంధించిన సాంకేతిక బిడ్‌లను పరిశీలించారు. దీంతో ఎన్ని కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయన్న విషయం స్పష్టమైంది. ప్రస్తుతం వెలిగొండ రెండవ టన్నెల్ పనులు చేస్తున్న మేఘ ఇంజనీరింగ్ కంపెనీ, అలాగే రాజమండ్రికిచెందిన జీడీఆర్ ఇన్‌ఫ్రా కంపెనీలు టెండర్లు దాఖలు చేశారు. ఆకంపెనీలు సమర్పించిన పత్రాలకు సంబంధించిన సాంకేతిక అంశాలను ప్రాజెక్టు అధికారులు పరిశీలించి ఆ వివరాలను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ(ఎస్‌ఎల్‌టీసీ)కి నివేదిస్తారు. వారి అనుమతి పొందిన అనంతరం ఆర్థిక బిడ్‌ను పరిశీలిస్తారు. అందులో ఏ కంపెనీ తక్కువకు కోట్ చేస్తే ఆ కంపెనీకి టెండర్ ఖరారు చేస్తారు. ఈ ప్రక్రియ అంతా వారంలో పూర్తి చేసి నెలాఖరుకు టెండర్ల ఖరారు చేస్తారని అధికార వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

గనులలో పనులను నిలుపుదల చేయాలి

అవీఇవీ



తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున గ్రానైట్ క్వారీలలో పనులను నిలిపివేయాలని తహసీల్దార్ రవినాయక్ ఆదేశించారు. గురువారం వీర్లకొండ గ్రానైట్ క్వారీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వలన క్వారీలలో రాళ్ల అచ్చులు ఊడి పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గతంలో కూడా ప్రమాదాలు ఇలానే జరిగాయని, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు క్వారీలలో పనులను నిలిపివేయించామని తెలిపారు. ఎవరైన నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రెవెన్యూ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశామని తహసీల్దార్ తెలిపారు.

సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలి



కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఏపీఎం

చినగంజాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఏపీఎం గద్దె పెదసుబ్బారావులు చెప్పారు. వెలుగు డీఆర్‌డీఏ ప్రకృతి వ్యవసాయం వారి ఆధ్వర్యంలో చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మీకాలనీలోని 70 కుటుంబాలకు గురువారం ఉచితంగా కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. మండలంలోని మహాలక్ష్మీ కాలనీని ఎంపిక చేసుకొని మండల సమాఖ్య ద్వారా ఉచితంగా విత్తనాలు అందజేసినట్లు ఏపీఎం తెలిపారు. ఉచితంగా అందజేసిన కూరగాయల విత్తనాలను సేంద్రియ పద్ధతిలో పండించాలని సూచించారు. కార్యక్రమంలో పకృతి వ్యవసాయ సిబ్బంది పద్మ, రజని, భార్గవి, లోకేశ్వరి, వీవోఏ జి.శ్రీలక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో శారీరక, మానసిక పరిపక్వత



విద్యార్థులతో మాట్లాడుతున్న సుబేదార్ సబూర్

అద్దంకిటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీలో చేరడంతో విద్యార్థులకు శారీరక, మానసిక పరిపక్వతతోపాటు క్రమశిక్షణ పెరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు చెప్పారు. గురువారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్‌సీసీలో చేరిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 23వ ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ సబూర్, హవల్దార్ మేజర్ రమేష్ ఆధ్వర్యంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ చల్లా ప్రసాద్ సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ కలిగిన వారికి మెడికల్, ఇంజనీరింగ్, ఎయిర్ పోర్ట్స్, పోలీస్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ వంటి రంగాల్లో ప్రాధాన్యత లభిస్తుందని ప్రిన్సిపాల్ మోహనరావు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ఎంపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

కొత్తపేట(చీరాల), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్(కన్జూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం) చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ చెప్పారు. గురువారం వేటపాలెం మండలం కొత్తపేటలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ క్రమంలో వినియోగదారుల నుంచి అందిన 14 అర్జీలను స్వీకరించి 12 సమస్యలకు పరిష్కారం చూపారు. మిగిలిన రెండు సీజీఆర్ఎఫ్ పరిధిలో లేకపోవడంతో పరిష్కార సలహా చెప్పారు. అనంతరం మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ వినియోగంలో మెళకువలు తెలుసుకుని ఆదాను మార్గాలు ఎంచుకోవాలన్నారు. తీవ్రమైన వాటిని విజయవాడ నగరం గుణదలలోని శాఖ కార్యాలయంలో సంప్రదించి పరిష్కరించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు కృష్ణానాయక్, ఆర్థిక సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా ఇంజనీరింగ్ సూపరింటెండెంట్ ఆంజనేయులు, స్వతంత్ర సభ్యులు సునీత, ఈఈ జాన్ డామన్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన కల్వర్టు



ఎండ్లూరు డొంకవద్ద కర్నూల్‌రోడ్డులో ఉన్న కల్వర్టరు పై చేరిన నీరు

సంతనూతలపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండ్లూరు డొంకవద్ద ఉన్న కర్నూల్ రోడ్డుపై కల్వర్టరు గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రమాదకరంగా తయారైంది. కల్వర్టు కొద్దిగా కుంగడంతో పాటు దానిపైనుంచి ఉన్న వర్షపునీరు కొంతమేర రోడ్డుమీదకు వచ్చింది. ఏ క్షణాన అయినా కల్వర్టు పూర్తిగా కుంగిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. చీమకుర్తి సమీపంలోని గ్రానైట్ ఏరియా నుంచి అధికలోడుతో వచ్చే గ్రానైట్ లారీలు, టిప్పర్ల దాటికి కల్వర్టు దెబ్బతింటోంది. సంబంధిత అధికారులు స్పందించి ఎండ్లూరు డొంకవద్ద, సంతనూతలపాడు సమీపంలోని కల్వర్టులను వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ నినాదం

మార్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ నినాదమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, ఏపీ పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి చెప్పారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం మార్కాపురం ప్రాంతానికి చెందిన ఇద్దరికి స్థానిక బీజేపీ నాయకులు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశానికి జీవనాధారమైన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పనులను వచ్చేఏడాది ఆగస్టు నాటికి ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. పోలవరం నిర్మాణానికి తగినన్ని నిధులు కేంద్రం మంజూరు చేస్తోందని పేర్కొన్నారు.

అవీ..ఇవీ..

టీడీపీ మండల కార్యవర్గం ఎన్నిక



దూళ్లిపాళ్ల హనుమంతరావు, కత్తి అశోక్, నూనె యహోన్

బల్లికురవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కార్యవర్గం ఎన్నిక గురువారం బల్లికురవలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుండి వచ్చిన టీడీపీ నేతలు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా నక్కబొక్కలపాడుకు చెందిన దూళిపాళ్ల హనుమంతురావు, ప్రధాన కార్యదర్శిగా బల్లికురవకు చెందిన కత్తి అశోక్ ఉపాధ్యక్షుడిగా వెలమవారిపాలెంకు చెందిన నూనే యోహెన్‌లను ఎన్నుకున్నారు. అలానే కోశాధికారిగా సంపతి శౌరి, కార్య నిర్వాహక కార్యదర్శులుగా గంప చిన్న అంజయ్య, షేక్ వలి, సింగంశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా పల్లపు కోటస్వామి, పసుమర్తి మేరిబాబు, తాటిపర్తి మూర్తిరెడ్డిలను ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది. తమ నియమాకానికి సహకరించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు టీడీపీ మండల నేతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

శక్తి యాప్‌తో మహిళల రక్షణ



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై హరిబాబు

చీరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : శక్తి యాప్ వినియోగంతో మహిళ, చిన్నారుల రక్షణ సులువని శక్తి టీం ఎస్సై హరిబాబు అన్నారు. గురువారం స్థానిక ఉర్దూ పాఠశాలలో యాప్ అవగాహన నిర్వహించారు. ఈ క్రమంలో శక్తి టీం వినియోగం వలన ప్రమాదాల నియంత్రణ సాధ్యమన్నారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతతో జీవితం సుమమయం

● సహకార కేంద్రబ్యాంకు ఆధ్వర్యంలో కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

చీరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యతతో జీవితం సుమమయంగా మారుతుందని చీరాల సహకార బ్యాంకు మేనేజర్ సునయన అన్నారు. గురువారం ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కళాబృందాలతో అవగాహన కల్పించారు. మిరియాల తిరుపతి బాలాజీ కళాబృందం ఆధ్వర్యంలో కళాకారులు వివిధ ఆర్థిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.వ్యవసాయ ఇతర రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు సతీష్, భవానీ, పీఏసీఎస్ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


పోలూరు వాగును పరిశీలించిన జేసీ



పోలూరు వాగు వద్ద అధికారులకు సూచనలిస్తున్న జేసీ

యద్దనపూడి,(మార్టూరు) అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలో పొంగి ప్రవహిస్తున్న పోలూరు వాగును జాయింట్ కలెక్టర్ భావన గురువారం సాయంత్రం పరిశీలించారు. గురువారం ఉదయం నుంచి పోలూరు వాగుపై నీటి ప్రవాహం కారణంగా ప్రజల రాకపోకలను అధికారులు నిలుపుదల చేశారు. తహసిల్దారు కె రవికుమార్, ఎస్‌ఐ టి రత్నకుమారి లు పోలీసు,రెవెన్యూ సిబ్బంది తో కలిసి వాగు వద్ద పర్యవేక్షించారు.ఈ నేపధ్యంలో సాయంత్రం వాగు వద్దకు వచ్చిన జేసీ భావన అధికారులతో మాట్లాడారు.పోలూరు వాగు వద్ద పరిస్థితి ఏమిటి,అంటూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం వారికి పలు సూచనలు చేశారు.మండలంలో వాగులు కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకూడదని,ఎ ప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని జేసీ అధికారులకు సూచించారు.

విద్యార్థులకు బయోమెట్రిక్ చేయించండి



ఆధార్‌క్యాంపును పరిశీలిస్తున్న ఎంఈవో-2 శ్రీనివాసరావు

అద్దంకిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పలువురు విద్యార్థులకు ఆధార్ కార్డులకు సంబంధించి తప్పనిసరి బయోమెట్రిక్ ప్రామాణీకరించాలని, వారందరికి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లలో బయోమెట్రిక్ వేయించాలని ఎంఈవోలు డి.గంగాధారరావు, కెవి శ్రీనివాసరావులు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావు పరిశీలించారు. పట్టణంలోని రెండు ప్రైవేట్ పాఠశాలలోనూ, మండలంలోని మోదేపల్లి, మణికేశ్వరం, ధర్మవరం గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు జరుగుతున్నాయన్నారు.కావున ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు సమస్య ఉన్న విద్యార్థులను ఆధార్ కేంద్రాలకు తీసుకెళ్లి ఈ అప్లికేషన్ చేయించాలని తెలిపారు. ఈ నెల 23 నుండి 30వ తేది వరకు ఆధార్‌క్యాంప్‌లు జరుగు తాయని హెచ్‌ఎంలకు తెలియజేశారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు

అద్దంకి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రతి సోమవారం అద్దంకి డిపో నుంచి ముండ్లమూరు, తాళ్లూరు, తూర్పుగంగవరం, బొద్దికూరపాడు, రాజంపల్లి,పొదిలి, మార్కాపురం మీదుగా శ్రీశైలంకు బస్ సర్వీసు నడుపుతున్నట్లు డీఎం మహబూబి తెలిపారు. అక్టోబరు27, నవంబరు3, 10 ,17 తేదిలలో అద్దంకిలో ఉదయం బయలుదేరి శ్రీశైలం వెళ్ళి తిరుగు ప్రయాణం లో మరలా అదే రూట్ లో అద్దంకి వస్తుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.







చింతగుంటపాలెం సమీపంలో నీట మునిగిన మిర్చి, పర్చూరు సమీపంలో నీట మునిగిన పంట పొలాలు, మార్టూరు బల్లికురవ రోడ్డుపై కూలిన తుమ్మచెట్టు

వర్షంతో అస్తవ్యస్తం

- పొంగిపొర్లిన వాగులు
- వర్షాలకు దెబ్బతిన్న పొలాలు
- స్తంభించిన జనజీవనం

పర్చూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, కాలువలు పొంగి పొరలుతున్నాయి. ఓ వైపు పంట పొలాలతోపాటు, రహదారుల్లో నీరు నిలిచి జనజీవనం స్తంభించింది. నియోజకవర్గ పరిధిలోని కేశవరప్పాడు - తిమిడ్డిపాడు మధ్య ఆలేరు వాగులో పొంగింది. అదేవిధంగా ఇంకొ ల్లు మండలం వంకాలపాడు - పూసపాడు మధ్య వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆ మార్గంలో రాక పోకలు నిలిచిపోయాయి. పర్చూరు వాగుకు భారీ స్థాయిలో నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కరకట్టలు తెగి తమ పంట పొలాలను ముంచెత్తు తాయని అన్నదాతలు ఆందోళన చెందుతు న్నారు.

పోలీసు బందోబస్తు

వాగులు పొంగి పొరలుతుండటంతో ఆయా మార్గాలను రాకపోకలు సాగించకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంతో ఆయా మార్గాల్లో వాగులు పొంగి వాహన దారులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘనలు అనేకం ఉన్నాయి. దీంతో పోలీసులు అప్రమత్తమై బందోబస్తు నిర్వహించారు.

పర్చూరు : అంతంత మాత్రంగానే సాగైన ఖరీఫ్ పైర్లపై వర్షం పగపట్టింది. ప్రస్తుతం ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే సాగులోని పైర్లు దెబ్బతింటున్నాయి. ఈ ఏడాదైనా కలిసి రాకపోతుందా..? అన్న ఆశతో మిర్చి సాగు చేసుకున్న రైతులకు సాగు ప్రారంభంలోనే నష్టాలు మొదలయ్యాయి. భారీ వర్షాలు పైర్లను ముంచెత్తటంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. ఇక రబీ సాగు కోసం సిద్ధం చేసుకున్న పొలాలు సైతం బీళ్లగా మారాయి.

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి పంటతో పాటు, పొగాకు, జూటు, కంది, కూరగాయాల పంటలు దెబ్బతిన్నాయని రైతులు పేర్కొంటున్నారు. వర్షపునీరు బయటకు పోవడంతో సాగులో ఉన్న పంటలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. ఇప్పటి వరకు ఆశాజనంగా ఉందనుకున్న పత్తిలో పూత రాలి పోయింది. కాయలు కుళ్లిపోతున్నాయి. పొగాకు మొక్కలు కుళ్లి పోతాయని రైతులు పేర్కొంటున్నారు. ఇక ఇప్పటికే నాటేసిన మిరపలో మొక్కలు చని పోతున్నాయి. భారీ వర్షాల వలన బల్లికురవ మార్టూరు రోడ్డులో అడవి తుమ్మ చెట్లు రోడ్డు మధ్యలో పడిపోయింది. దీంతో భారీ వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. గుంటుపల్లి చెరువు వర్షాల వలన నిండింది. దీంతో చెరువు అలుగు పారుతుండటంతో దిగువ భాగంలో మాగాణి సాగు చేసిన రైతుల్లో ఆందోళన నెలకోంది. భారీ వర్షాలు ఇంకా పడితే వరి పంట మునిగి పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చీరాల : రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామీణ ప్రాంతాల్లోని నివాసాల్లోకి నీళ్లు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఇళ్లల్లో ఉండలేక, వర్షంలో బయటకు పోలేక బిక్కుబిక్కు మంటున్నారు. మరోవైపు ప్రధాన రహదారులు సైతం నీళ్లతో నిండి వాగులను తలపిస్తున్నాయి. ఈక్రమంలో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే సహాయక చర్యలు చేపట్టిన తహసీల్దార్ గోపీకృష్ణ జాండ్రపేట హైస్కూల్‌కు కొన్ని ముంపు గ్రామాలకు చెందిన వారిని తరలించి భోజన సౌకర్యాలు కల్పించారు. మరో రెండు రోజులు అల్పపీడన ప్రభావం ఉండటంతో ప్రజలు భీతిల్లుతున్నారు. డ్రెయిన్లు, వర్షపు నీరు ఏకమై వార్డులు దుర్గంధభరితమయ్యాయి. రోగాలు ప్రబలే అవకాశం ఉంటడంతో జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

యద్దనపూడి,(మార్టూరు) : అల్పపీడనంతో బుధవారం రాత్రి, గురువారం ఉదయం మండలంలో కురిసిన భారీ వర్షాలకు వాగులు,వంకలు పొంగిప్రవహిస్తున్నాయి.పొలాల్లో కూడా నీళ్లు భారీగా నిలబడ్డాయి. దీంతో నల్లరేగడి పొలాలు కావడంతో, పొలాల్లో నిలబడిన వర్షపునీరు చెరువులను తలపిస్తున్నాయి. యద్దనపూడి మండలంలో ముఖ్యంగా పోలూరు వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. తూముల చప్టాపై గుండా నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలూరు గ్రామానికి, మిగిలిన గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అదేవిధంగా యద్దనపూడి నుంచి కుమ్మరిపాలెం, వింజనంపాడు గ్రామాలకు వెళ్లే రహదారిలో నేలచప్టాపై వర్షపునీరు భారీగా ప్రవహిస్తుండటంతో ప్రజల రాకపోకలు నిలిచాయి. యనమదల, చింతపల్లిపాడు, యద్దనపూడి పొలాల్లో భారీగా వర్షపునీళ్లు నిలిచాయి. అదేవిదంగా యనమదల గ్రామంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలలో వర్షపు నీళ్లు నిలబడటంతో గోతులు అర్ధంకాక వాహనదారులు చాలా ఇబ్బందులకు గురయ్యారు.

మొలకెత్తిన మినుము

పంగులూరు : అధికవర్షంతో మినుముకు అపారనష్టం వాటిల్లింది. కాయ మీద ఉన్న మినుములు చేలోనే మొలకెత్తాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలోని పలు గ్రామాల రైతులు రెండున్నరవేల ఎకరాలకు పైగా మినుముసాగు చేపట్టారు. వెయ్యి ఎకరాలలో పైరు కోతకోయాల్సి ఉండగా మిగిలిన విస్తీర్ణంలో పైరుపూత, పిందెదశకు చేరుకుంది. రుతుపవనాలతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా పడుతున్న వర్షంతో మినుము పైరు కోతకోయలేని పరిస్థితి ఉంది. వారం రోజుల వ్యవధిలో మండలంలో ఇంచుమించు 8 సెంటీమీటర్ల వర్షం పడింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో కోతకునోచుకోని మినుముపైరులో కాయనాని గింజ మొలకెత్తడంతో పంటచేతికి దక్కదని రైతులు వాపోతున్నారు. మినుము సాగుచేసిన రైతులలో సింహభాగం కౌలురైతులు కాగా, ఎకరాకు రూ. 20వేలు కౌలుతో పాటు సాగుకు రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అధిక వర్షాలతో పూర్తిగా నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. 1000 ఎకరాల్లో మినుము మొలకరాగా, మరో 1500 ఎకరాలలో పూతదశకు చేరుకుంది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న అధిక వర్షంతో మినుములో పూతరాలే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.











చీరాలలో ఇళ్లలోనికి చేరిన వర్షపునీరు, పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీ, పంగులూరులో మినుము కాయపై ఉండగానే వచ్చిన మొలక, పోలూరు వాగును పరిశీలిస్తున్న అధికారులు, పారుతున్న గుంటుపల్లి చెరువు అలుగు

శింగరకొండలో ఆంజనేయస్వామి మండల దీక్ష ప్రారంభం

దీక్ష తీసుకున్న ధర్మకర్తల మండలి చైర్మన్ మురళీసుధాకరరావు



ఆలయ ప్రదక్షణ చేస్తున్న మండల దీక్ష భక్తులు

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో గురువారం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, పలువురు భక్తులు మండల దీక్ష తీసుకున్నారు. దశాబ్ద కాలంగా శింగరకొండలో ఆంజనేయస్వామి మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో గురువారం దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అద్దంకి, దర్శి, వి.కొప్పెరపాడు, వైదన తదితర గ్రామాల నుండి వచ్చిన సుమారు 50 మంది భక్తులు దేవాలయం లో మండల దీక్ష తీసుకున్నారు. నవంబరు 12న అర్ధమండల దీక్ష ప్రారంభం కానుంది. మండల, అర్ధ మండల దీక్షలు తీసుకున్న భక్తులు డిసెంబరు 3న హనుమత్ వ్రతం సందర్భంగా దీక్షా భక్తులు స్వామి వారికి ఇరుముడులు సమర్పించ నున్నారు. దీక్షా భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా బుధవారం రాత్రి శింగరకొండ ప్రసన్నాంజనే యస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభానికి ఆకాశదీపం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధిక వర్షాలతో అధ్వానంగా రహదారులు





అధ్వానంగా ఉన్న మార్టూరు- బల్లికురవ రహదారి

బల్లికురవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో బల్లికురవ మార్టూరు అర్‌అండ్‌బీ రోడ్డు మరింత దెబ్బతింది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం చేసే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులో పెద్దపెత్త గోతులలో గ్రానైట్ వ్యర్థాలు వేయడంతో వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బంది పడుతు న్నారు. బల్లికురవ నుంచి నాగరాజు పల్లి వరకు ఉన్న నాలుగు కిలో మీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. మోకాటి లోతు గోతులు ఏర్పడటంతో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలబడటంతో కొత్త వ్యక్తులు ఈ రోడ్డులో రావాలంటే భయాందోళన చెందుతు న్నారు. గ్రానైట్ వ్యర్థాలను రోడ్డుపై పోయడంతో వాహనాలు జారి పోతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. నక్కబొక్కల పాడు గ్రామ ఎస్సీ కాలనీ వద్ద పైపులైన్ కోసం రోడ్డు అంచున గుంటలు తీయడంతో మట్టి రోడ్డుపైకి వచ్చి ప్రజలు జారి పడుతు న్నారని వారు అంటున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసిందని వెంటనే టెండర్లు వేసి రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి చెరువులను నూరుశాతం నింపండి

రామకూరు చెరువును పరిశీలించిన కలెక్టర్ వినోద్‌కుమార్



పంగులూరు చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పంగులూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సింగర్ చెరువును కలెక్టర్ వినోదర్‌కుమార్ గురువారం సాయంత్రం పరిశీలించారు. చెరువును పూర్తిగా నీటితో నింపకపోవడాన్ని, కట్టలపై చిల్లచెట్లు ఉండాన్ని ప్రశ్నించారు. జిల్లాలోని చెరువులలో ఉన్న నీటి నిల్వల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చెరువులన్నిటినీ వారంరోజులలో నూరుశాతం నీటితో నింపాలని అధికారులను ఆదేశించారు. కట్టలపై ఉన్న చిల్లచెట్లను తొలగించి చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెరువుకు నీరు చేరుకునే ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లు క్లియర్‌గా ఉంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో బాలమ్మ, చీరాల ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు, ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ శ్రీచరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, స్థానిక అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి చెరువును పరిశీలించిన కలెక్టర్

మార్టూరు : మార్టూరు మంచినీటి చెరువును గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చెరువు గురించి అధికారులతో మాట్లాడారు. చెరువు విస్తీర్ణం ఎంత, ఇప్పటి వరకు ఎంతభాగం చెరువు నింపారు, ఇంకా ఎంత నింపాలి అంటూ ఆర్‌డబ్లుఎస్ అధికారులను, గ్రామ పంచాయతీ ఈవోలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. రాజుపాలెం మేజరు నుంచి పైపులైన్ ద్వారా చెరువుకు సాగర్ జలాలు చేరుతున్నాయన్నారు. ఇప్పటికి 90 శాతం చెరువును నింపామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో కలెక్టర్ మరో రెండు మూడు రోజులలో చెరువును పూర్తిస్థాయిగా నింపాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు టి.ప్రశాంతి, ఎంపీడీవో వై శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు, ఆర్‌డబ్లుఎస్ జేఈ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు తహసీల్దారు కార్యాలయంలో కలెక్టర్ అరగంట సేపు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

వేటపాలెం(చీరాల), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏఆర్ కానిస్టేబుల్ కీర్తి గోపీపై కేసు నమోదైంది. బుధవారం తెల్లవారుజామున చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని ఓ పెట్రోల్ బంకులో సిబ్బందిపై గోపీ అనుచితంగా దాడిచేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్సై జనార్ధన్ తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకురాలి అరెస్టు

అద్దంకి,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవానిసెంటర్‌లో బెల్ట్‌షాపు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేస్తున్న మహిళను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు.1.81 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు.

మద్యం సేవించిన వ్యక్తికి జరిమానా

అద్దంకి, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ట్రాలీ ఆటో నడిపిన డ్రైవర్‌ను గురువారం అద్దంకి కోర్టు లో హాజరుపరచగా న్యాయాధికారి అఖిల రూ.6 వేల జరిమానా విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం కు చెందిన వ్యక్తి మద్యం సేవించి ఫోర్‌వీల్ టాటా ఏస్ ఆటో నడుపుతూ పట్టుబడగా కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

ఓటర్ల జాబితా రివిజన్‌కు సహకరించండి

అద్దంకి, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఓటర్ జాబితా రివిజన్‌కు క్షేత్ర స్థాయిలో అన్ని పార్టీల నేతలు తమ వంతు సహకారం అందించాలని అద్దంకి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటి కలెక్టర్ విజయజ్యోతి కుమారి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో రాజకీయపార్టీల నేతలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, తహసీల్దార్లు, రాజకీయపార్టీల నేతలు నాగినేని రామకృష్ణ, జ్యోతి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అద్దంకిగా మార్చేందుకు సహకరించాలి

అద్దంకి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ అద్దంకిగా మార్చేందుకు అందరూ సహకరించాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని శ్రీనివాసరావు అన్నారు. అద్దంకి పట్టణంలోని నామ్ రోడ్డు లో విశ్వబ్రాహ్మణ శ్మశానం, పోలీస్ పెట్రోల్ బంకు తదితర ప్రాంతాలలో గురువారం ఏర్పాటు చేసిన కంపోస్టర్ బిన్‌లను శ్రీనివాసరావు పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి పాల్గొన్నారు.

దీక్షదారులకు అన్నదానం ఏర్పాటు

అద్దంకి, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలోని అయ్యప్పస్వామి దేవాలయంలో దీక్షా భక్తులకు గురువారం నుండి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. జనవరి 9 వరకు దీక్షా భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు. ముందుగా అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, శ్రీరాం రామలింగేశ్వరగురుస్వామి, తిరుపతిరెడ్డి, బాపయ్య, వల్లెపు వెంకటేశ్వర్లు, గట్టుపల్లి రామారావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా అభివృద్ధికి లోకేష్ కృషి అభినందనీయం

● ఆస్ట్రేలియా పర్యటనతో ఆక్వా రైతులకు ఊరట

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆక్వారంగ అభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియా పర్యటనలో లోకేశ్ చేపట్టిన చర్చలు, ఒప్పందాలు ఆక్వా రైతులకు కొత్త ఊపిరి నింపాయని పేర్కొన్నారు. ఆక్వా ఎగుమతులకు అడ్డంకులు తొలగించడంతో పాటు ప్రపంచ మార్కెట్‌లో సీఫుడ్ బ్రాండ్‌కు గుర్తింపు తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ఇది ఆక్వా రైతుల పాలిట వరమని కొనియాడారు. ఆస్ట్రేలియా ఆక్వా పరిశ్రమలతో ఏపీ ప్రభుత్వ సహకారం కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తోందన్నారు. ఇరుదేశాల మధ్య సాంకేతిక మార్పిడి, పరిశోధన సహకారం, పెట్టుబడుల పెంపు వల్ల రాష్ట్ర ఆక్వా రంగం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ విజన్, సీఎం చంద్రబాబు నాయకత్వం ఇవి కలసి పెట్టుబడుల వర్షానికి దారితీస్తుందన్నారు.

శివయ్యను చూసొద్దాం..!



- శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు
- కార్తీక మాసంలో తీర్థయాత్రలు
- ఆర్టీసీ 1వ డిపోలో కరపత్రాల ఆవిష్కరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో రాష్ట్రంలోని వివిధ శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతుందని ఆర్టీసీ ఒకటవ డిపో మేనేజర్ జీ. వెంకటేశ్వర్లు తెలిపారు. నెల్లూరు నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో గురువారం ఆయన శైవక్షేత్రాలు- అక్కడికి వెళ్లే బస్సుల వివరాలను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

పంచారామ క్షేత్ర దర్శిని

పరమశివుడికి ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో ఒకే రోజు భక్తులు ఐదు ప్రముఖ శైవక్షేత్రాలను సందర్శించేలా పంచారామ క్షేత్ర దర్శిని పేరుతో ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని డిపో మేనేజర్ వివరించారు. అమరావతిలోని అమరారామం, భీమవరంలోని సోమేశ్వరరామం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షారామంలోని భీమేశ్వరరామం, సామర్లకోటలోని కోమారారామం క్షేత్రాలను భక్తులు ఒకేరోజు దర్శించుకునేలా బస్సు సర్వీసులను నడుపుతున్నామని చెప్పారు. సూపర్‌లగ్జరీ బస్సు నెల్లూరు మెయిన్ బస్టాండు నుంచి అక్టోబరు 25,26 తేదీల్లో, నవంబరు 1,2,4,8,9,15,16 తేదీల్లోనూ రాత్రి 9 గంటలకు బయలుదేరుతుందన్నారు. పంచారామ క్షేత్రాలను వీక్షించేందుకు ప్రత్యేక బస్సులో ఒక్కరికి రూ.2,500ను టికెట్ ధరగా నిర్ణయించామన్నారు. బస్సులో ప్రయాణం చేసే ప్రతి భక్తుడికి మినరల్ వాటర్ బాటిల్, పశుపు, కుంకుమ, బిస్కెట్ ప్యాకెట్ ఉచితంగా ఇస్తామని ఆయన తెలిపారు.

త్రిలింగ క్షేత్ర దర్శిని

మూడు ప్రముఖ శైవక్షేత్రాలను సందర్శించుకునేలా భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుందన్నారు. యాగంటి, మహానంది, శ్రీశైలం క్షేత్రాలకు అక్టోబరు 25,26 తేదీల్లో, నవంబరు 1,2,4,7,8,9,15,16 తేదీల్లో ప్రత్యేక బస్సులు ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి బయలుదేరుతాయని చెప్పారు. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన బస్సులు త్రిలింగ క్షేత్రాలను దర్శించుకొని మరుసటి రోజు ఉదయం నెల్లూరుకు చేరుకుంటాయన్నారు. ఇందుకుగాను సూపర్ లగ్జరీ బస్సులో టికెట్ ధర రూ.1800గా నిర్ణయించామన్నారు.

అరుణాచల దర్శనం

అగ్ని లింగమైన అరుణాచలేశ్వరుడిని దర్శించుకుని గిరిప్రదక్షిణ చేసుకునేందుకు ఈ నెల 25,26తేదీల్లో, నవంబరు 1,2,4,7,8,9, 15,16 తేదీల్లో ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు. ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి ఆయా తేదీలలో ఉదయం 9.30 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ బస్సుల్లో ఒక్కో భక్తుడికి రూ.1200 చార్జీ వసూలు చేస్తున్నామని చెప్పారు.

శ్రీశైల యాత్ర

శ్రీశైలం దర్శనానికి మంగళవారం నుంచి నవంబరు 11 వరకు ప్రతిరోజూ రాత్రి 8.30 గంటలకు ప్రధాన బస్టాండు నుంచి శ్రీశైలంకు ప్రత్యేకంగా సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతున్నామని డీఎం తెలిపారు. ఈ బస్సులో రూ.670 చార్జీ వసూలు చేస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన భక్తులు నగరంలోని మెయిన్ బస్టాండులో ఉన్న రిజర్వేషన్ కౌంటర్‌లోనూ, సమీప ప్రాంతాల్లోని ఆర్టీసీ ఆథైరజ్డ్ ఏజెంట్ వద్ద, ఆన్‌లైన్‌లో 46480 సర్వీసు నెంబరుపై రిజర్వేషన్ చేసుకోవచ్చని డీఎం తెలిపారు. పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు అద్దె ప్రాతిపదికన బస్సులను ఇస్తున్నామన్నారు. పూర్తి సమాచారం కోసం 99592 25653, 0861 2323333, 94921 92238 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో నెల్లూరు ఒకటి డిపో సీఐ సునీత తదితరులు పాల్గొన్నారు.



తీర్థ యాత్రల వివరాలు తెలిపే కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు, అధికారులు



కూలిన పెంకుటిల్లు

ఉదయగిరి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కురుస్తున్న వర్షాలకు ఉదయగిరిలోని దిలావర్‌భాయ్‌వీధికి చెందిన షేక్ షాహిద పెంకుటిల్లు నేలకూలింది. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోడలు నాని ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది.



సంగం మండలం పెరమన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న బీరాపేరు

తప్పిన ముప్పు

- బలహీనపడిన వాయుగుండం
- తగ్గుముఖం పట్టిన వర్షాలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- జలదంకిలో యువకుడి మృతి
- రేపు మరో అల్పపీడనం..?



కావలి బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

నెల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో వారం రోజులుగా భారీ వర్షాలతో అల్లాడుతున్న జిల్లాకు ఉపశమనం లభించింది. వర్షాల తీవ్రత గురువారం అధికంగా ఉంటుందని తొలుత అంచనా వేసినా... బుధవారం రాత్రి తర్వాత వాయుగుండం క్రమేణా బలహీనపడింది. అదే సమయంలో తన దిశను మార్చుకోవడంతో జిల్లాకు ముప్పు తప్పింది. గురువారం ఉదయం నుంచి వాతావరణం మారింది. కొన్ని చోట్ల మంకుగా ఉన్నప్పటికీ, చాలా చోట్ల ఎండ కాచింది. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి చినుకులు పడ్డాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం వేకువజాము వరకు మోస్తరు వర్షం కురిసింది.

● నిండుతున్న చెరువులు

భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులు నిండుతున్నాయి. ఇప్పటికే 60 శాతం మేర చెరువుల్లో నీరు నిల్వ ఉంది. జిల్లాలో మొత్తం 1007 చెరువులు ఉండగా, వాటిలో 122 చెరువులు పూర్తిగా నిండాయి. మరో 137 చెరువులు 75 శాతం వరకూ నిండగా, ఇంకో 230 చెరువుల్లో 50 శాతానికిపైగా నీరుంది. ఇంకా వరద వస్తుండడంతో ఒకటి, రెండు రోజుల్లో మరికొన్ని చెరువులు నిండే అవకాశమున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇటు ప్రజలు, అటు అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. అయితే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో శనివారం నుంచి వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి.

● సగటు వర్షపాతం 10.5 మి.మీ

జిల్లాలో సరాసరి 10.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పొదలకూరులో 69.2 మి.మీ, బోగోలులో 62.6 మి.మీ, సీతారామపురంలో 60 మి.మీ, బుచ్చిలో 57 మి.మీ, కావలిలో 48.4 మి.మీ, చేజర్లలో 37.4 మి.మీ, జలదంకిలో 37 మి.మీ, ఉలవపాడులో 28 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారంతో పోలిస్తే కొన్ని చోట్ల ఉధృతి తగ్గింది. అయినా ఇంకా కొన్ని గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు కొనసాగుతున్నాయి. జలదంకి మండలం చామదల గ్రామం వద్ద నేరెళ్ల వాగులో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు.

● సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం : నాలుగు రోజులుగా సోమశిలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుతూ..పెరుగుతూ కొనసాగుతోంది. అయితే దిగువకు మాత్రం స్థిరంగా నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయం 32,232 క్యూసెక్కులు వస్తుండగా మధ్యాహ్నానికి 20,960 క్యూసెక్కులకు తగ్గింది. రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తుండగా మరో నాలుగు రోజుల వరద సాగవచ్చని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 69.442 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● కండలేరులో నీటి నిల్వ 59.810 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.810 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 2300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 3450 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

చివరి ఆయకట్టుకు నీరందిస్తాం : ఎమ్మెల్యే ఇంటూరి



అధికారులతో కలిసి రాళ్లపాడు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం : భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులోకి నీరు చేరినందున ఆయకట్టు చివరి వరకు సాగు నీరందిస్తామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి ఇంటూరి నాగేశ్వర రావు చెప్పారు. గురువారం సాయంత్రం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. నీటిమట్టాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు రైతులకు నీరందించేందుకు కృషి చేయాలని, అలాగే నీటి సంఘాల అధ్యక్షులు అధికారులకు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పీ. గురునాథం, ఏలూరి వెంకటేశ్వర్లు, డీఈఈలు వెంకటేశ్వర్లు, శేషయ్య, ఏఈఈ మనోహర్ పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయి యువకుడి మృతి

జలదంకి : మండలంలోని చామదలకి చెందిన దంపూరు మల్లికార్జున(45) గురువారం ఉదయం 6 గంటలకు కావలికి వెళ్లేందుకు ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. బ్రాహ్మణక్రాక- బోగోలు ఆర్‌అండ్‌బీ రోడ్డు చప్టా దాటే క్రమంలో నేరేళ్లవాడు ప్రవాహం ఉధృతి పెరగడంతో వాహనంతో సహా కొట్టుకుపోయాడు. స్థానికుల సాయంతో యువకుడి కోసం గాలించారు. కానీ జాడ తెలియకపోవడంతో రెస్క్యూ బృందానికి సమాచారం అందించారు. పడవలపై వెళ్లి రెస్క్యూ టీం యువకుడి మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు.



మల్లికార్జున (ఫైల్)

● దెబ్బతిన్న చెరువుకట్ట

లింగసముద్రం : మండలంలోని ఆర్‌ఆర్ పాలెం చెరువు కట్ట భారీ వర్షాలకు దెబ్బతింది.గత వారం నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు చేరింది.అయితే బుధవారం కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి సామర్థ్యానికి మించి నీరు చేరి చెరువు కట్టపై నుండి నీరు పొంగి ప్రవహించింది.దీంతో చెరువు కట్టతో పాటు, అలుగు కూడా దెబ్బతింది.

పేకాట వ్యవహారంలో హోటల్ మేనేజర్‌పై కేసు

- హెడ్‌కానిస్టేబుల్ పుల్లారెడ్డి సస్పెన్షన్
- బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్‌పై కఠిన చర్యలకు రంగం సిద్ధం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేకాట కేంద్రం నిర్వహణకు సహకరించిన హోటల్ మేనేజర్‌పై నగరంలోని చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, నగరానికి చెందిన దేమునాయుడు కారుడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఆయన జల్సాలకు, వ్యసనాలకు బానిసై స్నేహితులతో కలిసి పెన్నానదిలో పేకాట ఆడుతూ ఆర్థికంగా నష్టపోయాడు. ఈ క్రమంలో పేకాట కేంద్రాలను నిర్వహించి డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకు పెద్దపెద్ద హోటళ్లను ఎంపిక చేసుకున్నాడు. నగరంలోని శోధన్‌నగర్‌లో గల ఓ ప్రముఖ హోటల్ మేనేజర్ రత్నంతో పరిచయం పెంచుకున్నాడు. హోటల్‌లో పేకాటకు అనుమతిస్తే కమీషన్ కింద రోజుకు రూ.2వేలు ఇస్తానని చెప్పడంతో మేనేజర్ అంగీకరించాడు. హోటల్‌లోని ఓ గదిని వారం రోజులుగా దేమునాయుడు తీసుకొని పేకాట కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం సీసీఎస్, చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ సీతారామారావు, చిట్టెం కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి పేకాట కేంద్రంపై దాడి చేశారు. నిర్వాహకుడితోపాటు మరో 17 మందిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్వాహకుడిని తమదైన శైలిలో పోలీసులు విచారించగా హోటల్ మేనేజర్ పాత్ర గురించి తెలిసింది. దీంతో అతన్ని పోలీసులు అరెస్ట్ చేశారు.



● హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

హోటల్‌లో పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడిన విడవలూరు పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జీకేఎస్ పుల్లారెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన నగరంలోని శోధన్‌నగర్‌లోని ఓ హోటల్‌లో పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయన్ను విధుల నుంచి తొలగించారు.

● బెట్టింగ్ డాన్‌పై కఠిన చర్యలు ?

బెట్టింగ్‌డాన్ కృష్ణసింగ్‌పై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కృష్ణసింగ్‌పై జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో అనేక కేసులు ఉండగా, దర్గామిట్ట స్టేషన్‌లో సస్పెక్ట్‌షీటు ఉంది. అయినా అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. నెల వ్యవధిలో పేకాట ఆడుతూ రెండు సార్లు పోలీసులకు చిక్కాడు. దీంతో అతనిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తారన్న ప్రచారం సాగుతుంది. ప్రస్తుతం ఆయన చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో నివాసం ఉండటంతో సస్పెక్ట్‌షీటు చిన్నబజారు స్టేషన్‌కు బదిలీ కానుంది.

ఏపీ ఎస్పీ డీసీఎల్ డిస్ట్రిక్ట్ స్టోర్స్ ఏఈ, డిప్యూటీ ఈఈల సస్పెన్షన్

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎస్పీ డీసీఎల్ పరిధిలోని గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్‌లో ఏఈగా విధులు నిర్వహిస్తున్న బీ మల్లికార్జున్, డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న పీ శంకరయ్యలను సస్పెండ్ చేస్తూ ఏపీ ఎస్పీ డీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఉత్వర్వులు జారీ చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ కే గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్‌లో విద్యుత్ పరికరాల అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వారిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు. అలాగే ఈ అంశంపై వివరణ కోరుతూ నెల్లూరు సర్కిల్ కార్యాలయంలో ఈఈ (టెక్నికల్)గా విధులు నిర్వహిస్తున్న ఎస్ బాలచంద్రకు షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట 8

ఎల్‌ఆర్‌ఎస్‌కు ముగిసిన గడువు

- 30 నుంచి 35 శాతమే దరఖాస్తులు
- నేతల అండ ఉందనే ధీమా
- ముందుకురాని రియల్టర్లు
- ప్రభుత్వం మళ్లీ గడువు పొడిగించేనా?



నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్ల, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) గడువు గురువారంతో ముగిసింది. అయితే దరఖాస్తులు మాత్రం నామమాత్రంగానే వచ్చాయి. ఈ పథకానికి తొలినుంచి జిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. భారీగా దరఖాస్తులు వస్తాయన్న పాలకులు, అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి.

● మొక్కుబడిగానే దరఖాస్తులు

గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసి, వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్దఎత్తున గండి పడడంతోపాటు, ప్లాట్లు కొన్నవారు ఇబ్బందులు పడుతూవచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వ్యాపారులు, కొనుగోలుదారులు నష్టపోకుండా చర్యలు చేపట్టేందుకు, అలాగే ప్రభుత్వ ఆదాయాన్ని రాబట్టేందుకు ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి మూడు నెలల గడువు ఇస్తూ, ఈలోపు అక్రమ లేఅవుట్లు, అక్రమ ప్లాట్లు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. అయితే లేఅవుట్ల యజమానులు క్రమబద్ధీకరణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. స్థానిక అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అండదండలు ఎక్కువమందికి ఉండడంతో, క్రమబద్ధీకరణకు పెద్దగా ముందుకు రాలేదు. ఈ విషయమై నియోజకవర్గాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో నుడా పరిధిలో కేవలం 30నుంచి 35శాతం మాత్రమే క్రమబద్ధీకరణకు లేఅవుట్ల, ప్లాట్ల యజమానులు ముందుకువచ్చారు. వీటిలో ఎక్కువగా ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయి. నుడా పరిధిలోని 8 నియోజకవర్గాల్లోని 31మండలాల్లో 427అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. వీటిని అధికారులు గుర్తించారు. అయితే క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినా పూర్తిస్థాయిలో ముందుకు రాలేదు. 427అక్రమ లేఅవుట్లు ఉండగా, గడువు ముగిసే సమయానికి 860మేర దరఖాస్తులు నుడాకు వచ్చాయి. 100మేర అక్రమ లేఅవుట్లు మాత్రమే క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 30నుంచి 35శాతం మాత్రమే దరఖాస్తులు నమోదైనట్లు నుడా అధికారులు తెలిపారు.

● మళ్లీ గడువు పొడిగించేనా... ?

ఎల్‌ఆర్‌ఎస్ గడువు ముగిసింది. ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందా..? గడువును పొడిగిస్తుందా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు సైతం వచ్చిన దరఖాస్తులుపై సంతృప్తి చెందకపోవడంతో గడువు పెంపునకు వారు కూడా కృషి చేస్తారన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన గడువులో పూర్తిస్థాయిలో అక్రమ లేఅవుట్ల యజమానులు క్రమబద్ధీకరణకు వచ్చిఉంటే ప్రభుత్వ ఖజానాకు రూ. కోట్లు జమఅయ్యే అవకాశం ఉండేది.

రేషన్ బియ్యం అక్రమాలు... అధికారులపై బదిలీ వేటు

- నెల్లూరు ఏఎస్‌వోగా వాణి
- ఇక్కడ పనిచేస్తున్న అంకయ్య పాడేరుకు..
- మాతృసంస్థకు డీఎస్వో ?

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ బియ్యం వ్యవహారంలో సహాయ పౌరసరఫరాల అధికారు(ఏఎస్‌వో)లపై బదిలీ వేటు పడింది. నెల్లూరు డివిజన్‌లో ఏఎస్‌వోగా పనిచేస్తున్న డీ. అంకయ్యను అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు ఏఎస్‌వో పీ. వాణిని నియమించారు. కావలి డివిజన్‌లో ఏఎస్‌వోగా పనిచేస్తున్న జే.రవిని అన్నమయ్య జిల్లా ఏఎస్‌వోగా బదిలీ చేస్తూ సివిల్ సప్లయిస్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



● మాతృశాఖకు డీఎస్వో ?

జిల్లాలో డీఎస్వోగా పనిచేస్తున్న విజయకుమార్‌ను మాతృశాఖ అయిన రెవెన్యూశాఖకు బదిలీ చేయాలని సూచించినట్లు సమాచారం. జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోందన్న ఆరోపణలతో వాస్తవాలను తెలుసుకోడానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్, సివిల్ సప్లయిస్ కమిషనర్, డీఎస్వో విజయకుమార్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ అర్జునరావులను ఇటీవల అమరావతికి పిలిపించారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని, కొందరు అధికారపార్టీ నాయకులే మాఫియా లీడర్లుగా వ్యవహరిస్తున్నారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ప్రెస్‌మీట్‌లో ఆరోపించడం, ఆ ప్రెస్‌మీట్‌లో సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల పేరును కూడా ప్రస్తావించడంతో కూటమి ప్రభుత్వంలో దుమారం రేగింది.

● లారీలను వదిలిపెట్టారనే ఆరోపణలు

గతనెల 21న నెల్లూరు మూడోమైలు వద్ద ఉన్న సుభాన్‌నగర్‌లో ఐదు లారీల్లో 180 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇందులో రెండు లారీలను రేషన్ బియ్యంగా గుర్తించి సీజ్ చేశారు. మూడు లారీల్లో సాధారణ బియ్యంగా గుర్తించి వదిలిపెట్టారు. ఈ విషయాన్ని కోటంరెడ్డి తప్పుపట్టారు. సివిల్ సప్లయిస్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి మూడు లారీలను వదిలి పెట్టారని, రేషన్ మాఫియా నాయకుడికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో అమరావతికి జిల్లాకు చెందిన డీఎస్వో, సివిల్ సప్లయిస్ డీఎంలను పిలిపించి వివరాలు సేకరించారు. గురువారం వారిపై సివిల్ సప్లయిస్ కమిషనర్ బదిలీ వేటు వేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 560

కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కావలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కావలి డిపోనుంచి పలు పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం ఆదినారాయణ తెలిపారు. అరుణాచలంకు ఈ నెల 26న, నవంబరు 4, 9, 16 తేదీలలో, శ్రీశైలంకు ఈ నెల 26, నవంబరు 2, 9, 16 తేదీలలో, పంచారామాలకు నవంబరు 2, 9 తేదీలలో బస్సులు నడుపుతున్నామన్నారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ లో రిజర్వేషన్ చేయించుకోవాలని, ఆన్‌లైన్ రిజర్వేషన్‌కూడా ఉందన్నారు. వివ రాలకు 7382926413, 9493913989, 9966009395 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉచిత సేవలు సద్వినియోగం చేసుకోండి

కావలి (టౌన్) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఉచిత సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు బ్రహ్మానందం కోరారు. గురువారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ డీఇ సాయిరామ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డు, ఈ సిమ్ కార్డు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌నెట్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తున్నారని, నెట్‌వర్క్ మెరుగు కోసం అదనంగా టవర్ల ఏర్పాటుకు ప్రయత్నం జరుగుతోందన్నారు. మరో ఏడాదిలో 5జీ నెట్‌వర్క్ పూర్తిగా అందుబాటులోకి వస్తుందన్నారు. డీఇ సాయిరామ్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ దీపావళి ధమాక ఆఫర్లను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జే డీవో బాషా, ప్రసాద్, ఎస్డీఈ ప్రభాకర్, బీజేపీ ఒకటవ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు

కావలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గురువారం కురిసిన వర్షాలకు పట్టణంలోని అనేక ప్రాంతాలలో వాగులు, చెరువులను తలపించేలా రోడ్లపై వాన నీరు ప్రవహిస్తోంది. ప్రధానంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు పూర్తిగా పూడి పోవటంతో నీరు పోయేందుకు మార్గం లేక రోడ్లపైకి చేరుతోంది. అనేక చోట్ల ఉన్న కాలువలపై బండలు వేసి ఉండటం, పూడిక తీయకపోవటంతో మార్గాలన్నీ మూసుకు పోయాయి. దీంతో రోడ్లన్నీ మడుగులను తలపిస్తున్నాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా సబ్‌కోర్టు వీధిలో మోకాళ్ల లోతు నీరు నిల్వ ఉంటోంది. అలాగే కావలి పాతూరులోని శివాలయం వీధి, వెంగళరావునగర్‌లోని తుఫాన్‌నగర్, ఇంది రానగర్ తదితర ప్రాంతాలు వాగులను తలపిస్తున్నాయి. ఉదయగిరి రోడ్డులోని విట్స్ కళాశాల సమీపంలో భారీగా వర్షపు నీరు నిలిచి ఉండటంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కావలి-పెదపవని రోడ్డు నుంచి ఉదయగిరి రోడ్డులోకి వచ్చే బైపాస్ రోడ్డు మలుపు వద్ద వర్షపు నీరు నిలిచింది. బస్టాండు వద్ద పెద్దపవని రోడ్డు వర్షపునీటితో చెరువులా మారింది. ఇలా పట్టణంలో అనేక ప్రాంతాలలో డ్రైనేజీ కాలువలపై మూత వేయటం, పూడిక తీయ కపోవటం, కాలువలు నిర్మించకపోవటంతో వర్షపు నీరు, డ్రైనేజీ నీటిలో కలిసి రోడ్లపై ప్రవహిస్తోంది.

బిట్రగుంట: బోగోలు మండల పరిధిలోని సముద్రంలో గురువారం ఉధృతంగా అలలు ఎగసిపడ్డాయి. భారీ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఓ మోస్తరుగా కురిసింది.



చెరువును తలపిస్తున్న కావలిలోని మినీ స్టేడియం గ్రౌండ్

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి సూచించారు.

అల్లూరు : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజుపాలెం-ఇస్కపల్లి ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండడంతో ఎక్స్‌కవేటర్ల సాయంతో రోడ్లు చదును చేసి రాకపోకలకు ఆటంకం లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే వర్షాలకు మళ్లీ రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నార్త్ఆములూరు నుండి ఇస్కపల్లి వరకు ఇదే పరిస్థితి ఉండడంతో మండల ప్రజలు ప్రయాణం అంటేనే విసిగిపోతున్నారు.

కాంక్రీట్ గోడతో మునక నుంచి రక్షణ

కావలి (టౌన్): వర్షాలు పడినప్పుడల్లా పట్టణంలోని ముసునూరు గిరిజన కాలనీ మునకకు గురయ్యేది. అధికారులు, నాయకులు, మీడియా అందరూ రావడం ఇక్కడ సర్వసాధారణం. కానీ.. ఈసారి ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నం. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా గిరిజన కాలనీ మునకకు గురిచేసే రైలు కట్ట పైనుంచి వచ్చే వరద నీటిని దారి మరల్చేందుకు కట్టుదిట్టంగా కాంక్రీట్ వాల్ నిర్మాణం చేయించారు. వారం నుంచి ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తు న్నప్పటికీ కాలనీలో చుక్కనీరు నిలవకపోవడంతో గిరిజన కాలనీకి మునకనుంచి మోక్షం లభించింది. గత 20 ఏళ్లలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని గిరిజనులు తెలిపారు. వరదలప్పుడు పులిహోర పొట్లాలు అందించి, ఫోటోలు దిగి వెళ్లిపోయారే కానీ సమస్యకు పరిష్కారం చూపలేదన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గిరిజనులు 'థ్యాంక్యూ ఎమ్మెల్యే సార్' అంటున్నారు.

చెరువును తలపిస్తున్న ట్రంకురోడ్డు

కావలి (టౌన్) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు పూడికతో నిండిపోవడంతో మురుగునీటితో కలిసి వాననీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా ఏఎం బేకరి కూడలి, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం కూడలి, టీటీడీ కల్యాణమండపం కూడళ్లలో రోడ్లపై మరుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహన చోదకులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఏఎం బేకరి, ముసునూరు ఆటోనగర్ ప్రాంతంలో వర్షపునీటితో ట్రంకురోడ్డు చెరువును తలపిస్తోంది. ఏడాదికొకసారి మున్సిపాలిటీ సిబ్బంది డ్రైనేజీలు శుద్ధి చేసి, ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో తిరిగి వ్యర్థాలతో నిండిపోతున్నాయి.



ముసునూరు గిరిజన కాలనీలో నిర్మించిన కాంక్రీట్ గోడ

మురుగు నీరు వెళ్లే దారేదీ?

కావలి రూరల్: వర్షాలతో స్థానిక బాలక్రిష్ణారెడ్డి నగర్ వాసులకు తిప్పలు తప్పటం లేదు. పేదలు అధికశాతం నివశిస్తున్న ఈ ప్రాంతంలో గురువారం కురిసిన వర్షానికి రోడ్లపైకి నీరు చేరింది. మురుగు కాలువలు లేకపోవటం తో నీరు ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇందిరానగర్ నుండి బాలక్రిష్ణారెడ్డి నగర్‌కు వచ్చే మార్గంలో చర్చి సమీపంలో చిన్న కల్వర్టు ఉంది. అక్కడ వర్షపు నీరు మొత్తం 4 అడుగుల మేర రోడ్డు పైకి చేరింది. అలాగే బుడంగుంట గేటు మార్గంలో కూడా వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనలు సైతం బురదలో కూరుకుపోతుండటంతో ఇళ్ల నుండి బయటకు రాలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు దగ్గర్లో రైల్వే ట్రాక్, కంప చెట్లు ఉండటంతో రాత్రి వేళల్లో ఇళ్లలోకి పాములు వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్సైజ్ సురక్షా యాప్‌తో నకిలీ మద్యానికి అడ్డుకట్ట

● ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యం నిర్మూలనకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షిత మద్యం అందించాలనే లక్ష్యంతో కూటమిప్రభుత్వం తీసుకొచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌పై అవగాహనా కార్యక్రమాన్ని పామూరు బస్టాండ్ సెంటర్‌లోని గాయత్రీ వైన్‌షాప్ వద్ద గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే క్యూఆర్ కోడ్ ఆధారిత యాప్‌ను ప్రారంభించి వినియోగ దారులు నకిలీమద్యాన్ని గుర్తించేందుకు ఈ యాప్‌ను ఉపయోగించుకునే విధానాన్ని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి మద్యం షాపు, బార్‌లలో మద్యం సీసాను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసిన తర్వాత మాత్రమే విక్రయించాలనే నిబంధనలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వంలో కల్తీమద్యం ఏరులై పారి ప్రజల ఆరోగ్యాలు క్షీణించాయని నేడు ప్రభుత్వం ఆ పరిస్థితులు లేకుండా చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కె. శ్రీనివాసరావు, ఎస్ఐలు కే. తేజశ్వర్, ఎస్. రేవతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సురక్షా యాప్ పనితీరుపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు, ఎమ్మెల్యే ఇంటూరి

సీపీఐ నూతన కార్యదర్శికి అభినందన

కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన గుజ్జుల ఈశ్వరయ్యను కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. విజయవాడలో జరిగిన ఆయన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరైన సురేష్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.



గుజ్జుల ఈశ్వరయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న సురేష్‌బాబు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు టెక్నికల్ చైర్మన్‌గా అఖిల్ ఎంపిక

కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఛాంపియన్స్ తైక్వాండో అకాడమీలో ఈనెల 25, 26 తేదీలలో జరగబోవు 42వ జూనియర్ బాలబాలికల రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు టెక్నికల్ చైర్మన్‌గా కందుకూరుకు చెందిన పి అఖిల్ ఎంపికయ్యారని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ ఎస్కే అబ్దుల్‌సలాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా అఖిల్‌ను పలువురు అభినందించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

కావలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల సౌకర్యార్థం శుక్రవా రం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కావలి ఆర్టీసీ డీఎం ఆదినారాయణ తెలిపారు. డీఎం కార్యాలయంలో గురువారం ఆ యన మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణీకులు తమ సమస్యలు, సూచనలను 9959225643 నంబరుకు ఫోన్ చేసి చెప్పాలని, సమస్యలను తప్పక పరిష్కరిస్తామన్నారు. కావలి డిపో పరిధిలోని కావలి, జలదంకి, కలిగిరి, కొండాపురం, బోగోలు, దగదర్తి ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పనికి దూరమైన చేనేతలను ఆదుకోవాలి

నెల్లూరు రూరల్, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా పనికి దూరమైన చేనేత కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పముజుల హరి కోరారు. నెల్లూరు రూరల్లోని సౌత్‌మోపూరు, ములుముడి గ్రామాలలోని చేనేత కార్మికులను ఆయన గురువారం పరామర్శించారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామాలలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి తెలియపరిచి చేనేతలకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిత భారత వీవర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటసుబ్బయ్య, జక్కుల వెంకటేశ్వర్లు, మణి పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో డిప్యుటేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పల్లిపాడు ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ(డైట్) కళాశాలలో డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు ఐదేళ్ల అనుభవం కలిగిన ఎస్‌జీటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ లెక్చరర్ ఇన్ టీచర్ ఎడ్యుకేషన్, లెక్చరర్ ఇన్ టీచర్ ఎడ్యుకేషన్, లెక్చరర్ ఇన్ తెలుగు, లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, లెక్చరర్ ఇన్ ఫైన్ ఆర్ట్స్, లెక్చరర్ ఇన్ ఇంగ్లీష్, సీనియర్ లెక్చరర్ ఇన్ ఈవీఎస్, లెక్చరర్ ఇన్ ఈవీఎస్, లెక్చరర్ ఇన్ సోషల్ స్టడీస్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన ఎస్‌జీటీలు ఈనెల 29వతేదీ లోపు గూగుల్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు [illegible] వెబ్‌సైట్‌నుగానీ, పల్లిపాడు లోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌నుగానీ సంప్రదించాలని కోరారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరి డీబార్

వెంకటాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో గురువారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 14,854 మంది విద్యార్థులకుగాను 13,877 మంది హాజరు కాగా, 977 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని డీబార్ చేసినట్లు తెలిపారు.

వర్షాలకు ఉరుస్తున్న చెక్కనగిషీ కేంద్రం

● హస్త కళాకారుల అవస్థలు

ఉదయగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలో గల చెక్కనగిషీ కేంద్రం గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉరుస్తుండడంతో హస్త కళాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరడం, రేకులు దెబ్బతినడంతో వర్షాలకు ఉరుస్తూ యంత్రాలు, కళాకారులు తయారుచేసిన వస్తువులు తడిసి పాడవడంతోపాటు నాణ్యత కోల్పోతున్నాయని వాపోతున్నారు. కేంద్రం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పలుమార్లు పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెక్కనగిషీ కేంద్రం మరమ్మతులకు నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



కేంద్రంలో తడిసిన చెక్కనగిషీ వస్తువులను శుభ్రం చేస్తున్న కళాకారులు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ హరిచందన ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై బులుగు రంగు గళ్ల ఫుల్ హ్యాండ్స్ షర్ట్, మెరూన్ రంగు డిజైన్ లుంగీ ఉన్నాయి. 55-60 మధ్య వయసు ఉంటుంది. ఇతర ఆధారాలేవీ లభించలేదు.

బ్యాంకు కాలనీలో బంగారం, వెండి చోరీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బీవీనగర్ బ్యాంక్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. బ్యాంకు కాలనీలో జీ ప్రియాంక, హరీష్ దంపతులు నివసిస్తున్నారు. ప్రియాంక పొదలకూరురోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలు. ఆమె భర్త ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈనెల 18 రాత్రి దంపతులు ఇంటి తలుపునకు గడియపెట్టడం మరిచిపోయి నిద్రపోయారు. 19 తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో హరీష్ మంచినీళ్లు తాగేందుకు లేచి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న 51 గ్రాములకు పైగా బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. బాధితురాలు గురువారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగదు దోపిడీ

నెల్లూరు(క్రైం),(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు అని కూడా చూడకుండా కత్తితో చంపుతానని ఓ రౌడీషీటర్ బెదిరించి నగదు దోచెకెళ్లిన ఘటన నెల్లూరులోని మెక్లిన్స్ రోడ్డులో చోటు చేసుకుంది. కోటమిట్ట మెక్లిన్స్ రోడ్డులో నివసించే దివ్యాంగుడు హయత్‌బాషా గురువారం సైకిల్‌పై తన అన్న గౌస్‌బాషా ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో రౌడీషీటర్ సుల్తాన్ అడ్డగించాడు. రూ.వెయ్యి నగదు ఇవ్వాలని లేకుంటే చంపుతానని కత్తితో బెదిరించగా నగదు ఇచ్చేశాడు.

కనిపించని ఆనవాళ్లు !

● జిల్లాలో పోలియోను నిర్మూలించాం...
● మంచి ఫలితాలు ఇస్తున్న నిర్మూలన ఉద్యమం
● పోలియో రహిత జిల్లాగా గుర్తింపు
● ఏటా 3.38 లక్షలమంది పిల్లలకు చుక్కల మందు
● నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలియో అంటే ఒకప్పుడు అందరూ భయపడేవాళ్లం. 1916లో న్యూయార్క్‌లో 2వేల మంది, యూఎస్‌లో 1952లో 3వేల మంది మృత్యువాత పడ్డారు.అదే మనదేశంలో 1945 నుంచి 1984 వరకు 150 మంది మాత్రమే మృత్యువాత పడగా, ఎంతోమంది దివ్యాంగులు అయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఈ వ్యాధిన బారినపడ్డారు. ఈ పరిస్థితిలో ప్రపంచ వ్యాప్తంగా పోలియో వ్యాధిపై చేసిన ప్రయోగాల ఫలితంగా నేడు వ్యాధిగ్రస్థులు తగ్గారు. కేవలం ఒక్క శాతం మాత్రమే పోలియో కేసులు నమోదు కావడం ఇందుకు నిదర్శనం. ఈ వ్యాధిపై పూర్తిగా అవగాహన కలిగించే దిశగా రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా చేపట్టిన చర్యలు, టీకా కనుగొన్న జోనస్‌సాల్క్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబర్ 24న (నేడు) ప్రపంచ పోలియో నివారణ దినం జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది.

● లక్షలాది చిన్నారులకు చుక్కల మందు

ప్రతి ఏటా జిల్లాలో 3.38 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నారు. ఇప్పటివరకు 53 సార్లు పల్స్ పోలియో కార్యక్రమాలు జిల్లాలో చేపట్టి ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేశారు. జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో సైతం 3వేలకుపైగా పోలియో బూత్‌లను ఏర్పాటు చేసి 12వేల మంది సిబ్బంది సహకారంతో పోలియో చుక్కలను వేశారు. ప్రత్యేకించి సమస్యాత్మకమైన ప్రాంతాలలోనూ, రైల్వే, ఆర్టీసీ ప్రాంతాలలోనూ మొబైల్ బూత్‌ల ద్వారా ఈ కార్యక్రమం ఏటా జోరుగా సాగుతుంది. ఇందులో వైద్య ఆరోగ్య శాఖతోపాటు అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాలుపంచుకుంటున్నారు.



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

● ఏటా రూ. 40 లక్షలు వెచ్చించి

పల్స్ పోలియో నిర్వహణకు ఏటా ప్రభుత్వం రూ. 40లక్షలను జిల్లాకు కేటాయిస్తుంది. మొత్తం జిల్లాలోని 52 పీహెచ్‌సీలు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సీహెచ్‌సీల పోలియో చుక్కలను పంపిణీ చేస్తున్నారు. కావలి, వింజమూరు, ఉదయగిరి, ఆత్మకూరు, పొదలకూరు, కొడవలూరులలో పోలియో స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసి పోలియో చుక్కలను పంపిణీ చేస్తున్నారు. 2013లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాలో ఓ పోలియో కేసు నమోదు కావడంతో దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ఇంకా కొనసాగుతుంది.

● ఆధునిక పోలియో మందు

పోలియో వ్యాధి నివారణకు ట్రైవాలెంట్ వ్యాక్సిన్ గతంలో వాడేవారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బైవాలెంట్ వ్యాక్సిన్ అందుబాటులోకి రావడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. గతంలో పీ1, పీ2, పీ3, వైరస్‌కు సంబంధించి ట్రైవాలెంట్ వ్యాక్సిన్ వాడేవారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాదిగా పీ2, వైరస్ నిర్మూలన కావడంతో కొత్త వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది.

జిల్లాను పోలియోరహితంగా మార్చాం



జిల్లాను పోలియో రహిత జిల్లాగా మార్చాం. ప్రస్తుతం జిల్లాలో ఎలాంటి పోలియో కేసులు లేవు. అయితే ప్రభుత్వం పోలియో నివారణ చర్యలు చేపడుతోంది. ప్రతీఏటా పోలియో చుక్కలు వేస్తున్నాం. దీన్ని ఉద్యమంలా చేపడుతున్నాం. ఏటా రెండు సార్లు పోలియో చుక్కల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం.

- డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

వర్షాలకు ప్యాచ్ వర్క్ గోవిందా!

● అధ్వానంగా పెంచలకోన రోడ్డు
● బస్సు ఇరుక్కుని ప్రయాణికుల అవస్థలు



వర్షాలకు అధ్వానంగా తయారైన పెంచలకోన రోడ్డు (ఇన్‌సెట్‌లో),రోడ్డుపై ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

కలువాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదూరుపల్లి-పెంచలకోన రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు వెళ్లే భక్తులకు ప్రయాణం నరకంగా మారింది. ఆదూరుపల్లి నుంచి దాచూరు కమ్మపాళెం వరకు 8 కి.మీ మేర సుమారు 6నెలల కిందట చేసిన ప్యాచ్ వర్క్ నామరూపాలు లేకుండా పోయింది. గురువారం పెంచలకోన నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు దాచూరు సమీపంలో రోడ్డుపై బురదలో ఇరుక్కుపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఈ రోడ్డుపై ఇక ద్విచక్ర వాహనంపై ప్రయాణమంటే సాహసమే అవుతుంది. సుమారు రూ.18లక్షలు పోసి చేసిన ప్యాచ్ వర్క్ అప్పుడే దెబ్బతినడంపై స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట

● సమస్యల పరిష్కారంలో జాప్యం సరికాదు
● వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యుల సమస్యలు తక్షణం పరిష్కరించాలంటూ వైద్యులు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కొందరు వైద్యులు పిల్లలతో కలిసి ఈ ధర్నాలో పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం జాప్యం సరికాదని అన్నారు. వైద్యుల సమస్యలు పరిష్కరించాలని గతంలో సమ్మెకు వెళితే ప్రభుత్వం కొంత గడువు కోరిందని, రోజులు గడుస్తున్నా స్పందన లేకపోవడంతో మళ్లీ ఇప్పుడు సమ్మెబాట పట్టామని చెప్పారు. పీహెచ్‌సీల్లో 20 నుంచి 25 ఏళ్లుగా పనిచేస్తున్నా ఎలాంటి ఉద్యోగోన్నతి లేదని, తక్షణమే టైంబౌండ్ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 90ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు 50 శాతం మూలవేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బ్రహ్మేశ్వర నాయుడు, నవీన్‌కుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, శ్రావణి, జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైద్యులు

ఉరుములు.. మెరుపులు.. తెగిన విద్యుత్ తీగలు

బిట్రగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో పలుచోట్ల గురువారం మధ్యాహ్నం భారీ ఉరుములు, మెరుపులకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో పలుచోట్ల 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ మండల ఏఈ జడరాయ, లైన్‌ఇన్స్పెక్టర్ మురళీధర్ శర్మ, సిబ్బంది విద్యుత్ లైన్ పెట్రోలింగ్ నిర్వహించారు. దగదర్తి మండలం అనంతారం, ఉలవపాళ్ళ మధ్య పిడుగుపాటుకు 33 కేవీ విద్యుత్ లైన్ పిన్ ఇన్సులేటర్ పగిలిపోయినట్లు గుర్తించి, మరమ్మతులు చేపట్టారు. తాళ్ళూరు 11 కేవీ ఫీడర్ విశ్వనాథరావుపేట కొత్తూరు పొలాల్లో తెగిపోయిన విద్యుత్ తీగలను సరిచేశారు. చైతన్య నగర్, కొండబిట్రగుంట ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపోవడంతో అధికారులు, సిబ్బంది వాటికి మరమ్మతులు చేస్తున్నారు.



మరమ్మతులు చేయిస్తున్న ఏఈ జడరాయ

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

● గండిపాళెం జలాశయానికి చేరిన వరద నీరు



గండిపాళెం జలాశయాన్ని పరిశీలిస్తున్న డీఈ, ఏఈలు

ఉదయగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు జలకళ సంతరించుకున్నాయి. గురువారం సాయంత్రం భారీ వర్షం కురడంతో పట్టణంలో వీధులు వాగుల్లా, పంచాయతీ బస్టాండ్ చెరువును తలపించాయి. దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గండిపాళెం జలాశయానికి వరద చేరుతోంది. 35 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన జలాశయం 2 అడుగల నీటిమట్టంతో డెడ్‌స్టోరేజీకి చేరింది. పైతట్టు ప్రాంతం వాగులు ప్రవహిస్తుండడంతో ప్రస్తుతం జలాశయం నీటిమట్టం ఎనిమిది అడుగులకు చేరిందని జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి తెలిపారు. ఏఈలు వేణు, సురేష్‌లతో కలిసి జలాశయాన్ని పరిశీలించడంతోపాటు పిల్లాపేరు, దున్నపోతుల వాగుల ప్రవాహన్ని పరిశీలించారు. పైతట్టు ప్రాంతాల నుంచి జలాశయంలోకి 700 క్యూసెక్కుల ప్రవాహం వస్తుందని, ఇది మరింత పెరిగే అవకాశముందని వారు ఈ సందర్భంగా తెలిపారు.

ప్రతి సమస్యకు కులాలను ముడిపెట్టడం సరికాదు..

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, అయితే ప్రతి సమస్యను కులాలకు ముడిపెట్టి కులరాజకీయాలు చేస్తుండటం దురదృష్టకరమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏ కులమూ గంపగుత్తగా ఒక పార్టీకి ఓట్లు వేయదని, అలాంటప్పుడు తనకు అత్యధిక మెజారిటీ అందించిన నియోజకవర్గ ప్రజలను కులాల ప్రాతిపదికన చూడాల్సిన అవసరం ఎందుకొస్తుందని ఆయన ప్రశ్నించారు. దారకానిపాడు ఘటనలో కులాల ప్రాతిపదికన నాపై బురదజల్లాలని విశ్వప్రయత్నం చేశారని, అయితే బాధిత కుటుంబాలకు అండగా చిత్తశుద్ధితో పనిచేయటం జరిగిందని వివరించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రాళ్లపాడు ప్రాజెక్టుకు సరిపడా నీరురాక ఇబ్బంది ఎదురైనప్పటికీ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశాబ్దాలుగా పెండింగ్ ఉన్న జీకేఎన్ కెనాల్ అభివృద్ధి పనులను కేవలం 16 నెలల్లో పూర్తి చేసి రాళ్లపాడుకు సోమశిల జలాలు అందించేందుకు ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీమేరకు అతిత్వరలోనే కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపటం జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమెట్ల గురునాథం, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 58మందికి వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 41.22 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి

42వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బిట్రగుంట విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బిట్రగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట వాకర్స్ క్రీడామైదానంలో ఇంటర్నేషనల్ మాస్టర్ ఈ రవిగన్ ఆధ్వర్యంలో తైక్వాండోలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్స్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లాలో ఈ నెల 24, 25 తేదీలలో జరిగే 42వ ఏపీ స్టేట్ జూనియర్స్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలకు 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మాస్టర్ రవిగన్ తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ బర్నాడ్, గౌరవాధ్యక్షుడు ఎం స్వర్ణన్‌రాజ్, మాజీ గౌరవాధ్యక్షుడు ఎస్‌ఎస్ యాదవ్, మైనార్టీ నాయకుడు జహీర్, విద్యార్థులను అభినందించారు.

స్పందించని వాటర్ ప్లాంట్ యజమానులు

కావలి,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): వాటర్ ప్లాంట్ అనుమతుల పత్రాలు, నాణ్యతాప్రమాణాల నివేదికలు మున్సిపల్ కార్యాలయానికి తెలియచేయాలని నోటీసులు ఇచ్చినా స్పందించని వారిపై చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో వాటర్ ప్లాంట్‌లు సరిగా నిర్వహించటం లేదన్నారు.

త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతాం!



అల్లూరు రోడ్డులో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం అల్లూరురోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపాన ప్రమాద స్థలాన్ని ఆర్డీవో, ఎన్‌హెచ్-5, పోలీసు అధికారులు గురువారం పరిశీలించారు. కావలి మార్గంలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలపై అధికారులు చర్చించారు. 2017- 18 మధ్య కాలంలో అల్లూరు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. దీంతో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పనులు ప్రారంభ దశలోనే గుత్తేదారుకు నిర్మాణం విషయంలో సమస్య తలెత్తడంతో పనులు ఆపేశారు. నెల్లూరు వైపు వెళ్లే మార్గాన్ని సింగిల్ వే చేసి వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఇక్కడ ఇద్దరు మృతి చెందడంతో అధికారులు గురువారం ఆ మార్గాన్ని పరిశీలించారు. జిల్లా ఆర్డీవో బాల మురళీకృష్ణ, జిల్లా రవాణాశాఖ అధికారి చందర్, ఎన్‌హెచ్ 5 అధికారి, కావలి రూరల్ సీఐ పాపారావు ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ఆ రహదారిలో ప్రమాదాలు జరగకుండా ఫోకస్ లైట్లు, రేడియం స్టిక్కర్లు, డివైడర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆగిన ఫ్లైఓవర్ పనులను త్వరలో ప్రారంభించేందుకు టెండర్లు పిలిచేలా అధికారులు చర్యలు చేపట్టారన్నారు. వారి వెంట పాటు దగదర్తి, బోగోలు ఎస్‌ఐలు జంపాని కుమార్, ఎస్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

వర్షం లెక్క... పక్కానేనా...?

నమోదు కేంద్రాలు మరమ్మతులు గురికావడమే కారణం

ఉదయగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ వర్షం కురిసినా ఎంత వర్షపాతం నమోదైందన్న వివరాలను అధికారులు వెల్లడిస్తుంటారు. వాస్తవానికి ఇవన్నీ కాకి లెక్కలే అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఆ వివరాలు నమోదు చేసే పరికరాలు చాలా చోట్ల మరమ్మతులకు గురికావడమే ఇందుకు కారణం. ఉన్న వాటిలో సగటును లెక్కగట్టి అధికారులు వర్షపాతం నమోదు చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

జిల్లాలో రెవెన్యూ పరిధిలో 38, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ (ఏడబ్ల్యూఎ)లు 192 మొత్తం 230 వర్షపాతం నమోదు కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఎక్కువగా వీటిని ఏర్పాటు చేశారు. సౌరశక్తి ఆధారంగా పనిచేసేవీ ఇందులో ఉన్నాయి. వీటి నిర్వహణకు ఏటా నిధులు మంజూరు చేయాలి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో చాలావరకు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని తుప్పు పట్టగా, మరికొన్ని దెబ్బతిని ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో వర్షపాతం వివరాలు పక్కాగా తెలియడంలేదు. జిల్లాలో 230 వర్షపాత నమోదు కేంద్రాల్లో పలు కేంద్రాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో అవి పనిచేసే చోట పడిన వర్షం ఆధారంగా సగటు లెక్కలు కట్టి సరిపెడుతున్నారు. ఇటీవల ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారామపురం, వింజమూరు తదితర మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నా అధికారులకు నమోదు కేంద్రాలు తక్కువ వర్షపాతం నమోదైనట్లు చూపడమే ఇందుకు నిదర్శనం. ఈప్రభావం పంటల సాగుపై పడే ప్రమాదముంది. మరమ్మతులకు గురైన వర్షపాతం నమోదు కేంద్రాలను బాగు చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. సామగ్రి వస్తే మరమ్మతులు చేయనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.



ఉదయగిరిలో వర్షపాత నమోదు కేంద్రం


'స్త్రీనిధి' పేదల పెన్నిధి !

● 48 గంటల్లోనే రుణం మంజూరు
● ఫోన్‌పే ద్వారా తిరిగి చెల్లించే అవకాశం
● పొదుపు మహిళల హర్షం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాల్లోని పేదమహిళలకు 48 గంటల్లోగా రుణాలు అందచేసి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన పథకం 'స్త్రీనిధి' ఈ పథకం ద్వారా ఎంతోమంది మహిళలు రుణాలు తీసుకుని, జీవనోపాధి పొందారు. గతంలో రుణం తీసుకోవాలన్నా, తిరిగి కట్టాలన్నా ఎంతో కష్టంగా ఉండేది. స్త్రీనిధి రుణాలను కొన్ని గంటల వ్యవధిలోనే అందచేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో పొదుపు గ్రూపుల మహిళలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఎప్పటి కప్పుడు పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. దీంతో వారు ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నారు.

● సభ్యురాలికి ప్రత్యేకంగా రుణం

గ్రూపు రుణంతోపాటు సభ్యురాలికి విడిగా రుణం ఇచ్చే వెసులుబాటు స్త్రీనిధి పథకంలో ఉంది. కేవలం 92 పైసల వడ్డీకే ఈ రుణం అందచేస్తున్నారు. జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఫీజులు ఏమీ లేవు. రుణం కోరిన 48గంటల్లోనే అందచేస్తారు. ఒక్కొక్క సభ్యురాలికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణం అందచేస్తారు. గ్రూపు అంటే పదిమంది ఉన్న పొదుపు గ్రూపునకు రూ. 5లక్షల వరకు రుణం ఇస్తున్నారు. సభ్యులకు విడిగా, లేదా గ్రూపుగా రుణాలు ఇవ్వటం వల్ల పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నారు.




● రూ. 298 కోట్ల లక్ష్యం

జిల్లాలో స్త్రీనిధి పథకం కింద 2025-26 సంవత్సరంలో రూ. 298కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటివరకు 16,273 గ్రూపులకు రూ. 122 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. 2024-25లో జిల్లాకు రూ.178 కోట్ల రుణ పంపిణీ లక్ష్యాన్ని నిర్దేశించగా, జిల్లా రూ.179కోట్ల లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఈ లక్ష్యసాధన శాతం 103 శాతం కావటం విశేషం. సులభ వాయిదాల్లో 2 నుంచి 3 ఏళ్ల వ్యవధిలో రుణం చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఒకవేళ రుణం తీసుకున్న సభ్యురాలు మరణిస్తే సురక్ష పథకం ద్వారా చనిపోయిన రోజు నుంచి తీసుకున్న రుణం కట్టనవసరం లేదు.

● స్త్రీనిధి రికవరీ యాప్

రుణం తీసుకున్న సభ్యురాలు కాని, పొదుపు గ్రూపుకాని రుణాన్ని సులభంగా చెల్లించేందుకు స్త్రీనిధి యాప్‌ను ప్రవేశపెట్టారు. ఈ యాప్ ద్వారా తీసుకున్న రుణాన్ని సకాలంలో ఎలాంటి ఇబ్బందులకు లేకుండా చెల్లించవచ్చు. ఫోన్‌పే కలిగిన సభ్యురాలు నేరుగా రుణాన్ని ఆ యాప్ ఆధారంగా చెల్లించవచ్చు. గతంలో వీవోఏలు, గ్రూపులీడర్లకు, రుణాన్ని మొత్తం చెల్లిస్తే వారు తమ ఖాతాల్లో జమ చేయలేదనే ఆరోపణలు ఉండేవి. యాప్‌ను ప్రవేశపెట్టి, ఫోన్‌పే వినియోగాన్ని తీసుకురావటంతో రుణాన్ని సకాలంలో, బ్యాంకుకు వెళ్లకుండా, వీవోఏలు, గ్రూపులీడర్లను నమ్ముకోకుండా చెల్లించే అవకాశం ఏర్పడింది.

విరివిగా రుణాలు అందచేస్తున్నాం...



స్త్రీనిధి కింద పొదుపు మహిళలకు విరివిగా రుణాలు అందచేస్తున్నాం. గత ఏడాది లక్ష్యాన్ని మించి రుణాలు ఇచ్చాం. ఈ ఏడాది కూడా లక్ష్యాన్ని అధిగమించి రుణాలు అందచేస్తాం.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ, పీడీ